ఫిబ్రవరి
2018

142

సంపుటి : 12 సంచిక : 10 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

హిట్లర్‌ను మట్టికరిపించిన సోవియట్ రెడార్మీ
తెలంగాణాలో ఉధృతంగా సాగుతున్న ఆర్థిక, సామాజిక పోరాటాలు
ప్రజాపునాదిని బలపర్చుకుందాం
తెలుగు ప్రజాసంస్కృతి కమ్యూనిస్టుల మహత్తర పాత్ర
సోవియట్ యూనియన్‌లో సామాజికభద్రత
యఫ్ఆర్‌డిఐ బిల్లుతో ప్రమాదాలు
ప్రమాదంలో మన విత్తనం
అట్టడుగుకు దిగజారుతున్న మోడి

స్ఫూర్తి

# హిట్లర్‌ను మట్టికరిపించిన సోవియట్ రెడార్మీ

**అన్నా లూయీస్ట్రాంగ్**

1941 జూన్ 22 వేకువజామున హఠాత్తుగా హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దండయాత్రకు పూనుకున్నాడు. వేలకొలదిగా నాజీ విమానాలు సోవియట్ విమానాశ్రయాలపై బాంబులు వేశాయి. వేలకొలది ట్యాంకులు సరిహద్దుల్ని బ్రద్దలుగొట్టుకొని నడిచాయి. లక్షలకొలది ఫిరంగిదళాలు, సైనిక దళాలు వెనకనడిచాయి. "ప్రపంచ చరిత్రలోకల్లా పెద్దసైనికదాడి"గా దాన్ని హిట్లరు పేర్కొన్నాడు. అందులో అతిశయోక్తి లేదు. మానవాళి భవిష్యత్తునే నిర్ణయించవలసిన మహాయుద్ధంలో ప్రపంచంలోకెల్లా పెద్దదైన రెండు సేనావాహినులు తారసిల్లాయి.

యూరప్‌ను జయించిన ధీమాతో జర్మన్లు వచ్చారు. అందుకు ఒక సంవత్సరం పాటు వారు పునాదులు వేసుకున్నారు. పోలెండులో కీలకమైన రోడ్లువేశారు. రుమేనియాను ఆక్రమించుకున్నారు. ఫిన్లండుకు సైన్యాలను పంపారు. సోవియట్ పశ్చిమ సరిహద్దు 1800 మైళ్ల పొడవునా మార్గాన్ని సాధించారు. ఉత్తరాదిన ఫిన్లండు నుండి ముర్‌మాన్స్క్ రేవునూ, లెనిన్‌గ్రాడ్‌నూ ముట్టడించారు. మధ్యరంగంలో పోలెండు నుండి మాస్కోవైపు దాడి ప్రారంభించారు. దక్షిణాదిన రుమేనియా నుండి కీవ్, ఒడెస్సాల వైపు పురోగమించ బూనుకున్నారు. యుద్ధరంగంలో 90 లక్షల మంది సైనికుల్ని దింపాననీ, లక్షోపలక్షలమంది ఇంకా రిజర్వులో వున్నారనీ హిట్లర్ చెప్పుకున్నాడు.

ఒక నెలరోజుల మెరుపుయుద్ధంతో రష్యన్ ప్రతిఘటన అంతం అవుతుందని బెర్లిన్, లండన్, వాషింగ్టన్లలో రాజకీయవర్గాలు భావించాయి. "జర్మన్‌లను ఇంతవరకు బలంగా ప్రతిఘటించిన వారు రష్యన్లే"నని ఒక పక్షం రోజుల పోరాటం తర్వాత వాషింగ్టన్ జాగ్రత్తగా వ్యాఖ్యానించింది. ఆరు వారాలయ్యేప్పటికి బ్రిటన్, అమెరికాలు పునరాలోచన ప్రారంభించాయి. ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ రష్యన్‌లు 'అకుంఠిత దీక్ష'ను ప్రదర్శిస్తున్నారని పొగిడాడు. వారి సైనిక శిక్షణను, నిర్మాణనైపుణ్యాన్ని గుర్తించాడు. "విజయానికి రష్యా నూతన పంథాచూపింది.



అన్నింటికి తెగించి సిద్ధమైన అంత బలగాన్ని ఇది వరకెన్నడూ ఎవరూ హిట్లర్‌కు ఎదురొడ్డలేదు" అని ఆగస్టు20వ తేదిన లండన్‌నుండి రేమండ్ క్లావర్ కేబుల్ పంపాడు.

జర్మనీ దాడి స్టాలిన్‌ని ఆశ్చర్యచకితుడ్ని చేసిందని, అవసరమైన ముందు ఏర్పాట్లను ఆయన చేయలేదనీ సోవియట్ భూభాగంపై వాళ్లు దండయాత్ర చేసినప్పుడు సహితం" అవన్నీ శిక్షణారహితమైన రెచ్చగొట్టే చర్యలని'' త్రోసిపుచ్చుతూ ప్రతిఘటించ తిరస్కరించడాడనీ కృశ్చేవ్ 1956లో స్టాలిన్‌ని ఖండించాడు. విమానాశ్రయాల్లో వున్న సోవియట్ విమానాలను చాలావాటిని జర్మన్లు ధ్వంసం చేసినమాట నిజం. జపాన్‌వాళ్లు అమెరికన్ విమానాలను పెరల్ హార్బర్‌లో అలాగే చేశారు. దురాక్రమణదారుడెవడికైనా ఈ అవకాశం ఉంటుంది. ఈ విషయం కృశ్చేవ్ తెలుసుకోవాలి. కాని జూన్ 22 దాడిని ఎర్రసైన నిర్లక్ష్యం చేయలేదు. దాని ప్రతిఘటన ప్రపంచానికి ఆశ్చర్యం గొలిపింది. అంతకు పూర్వం జరిగిన సరిహద్దు సంఘర్షణలను స్టాలిన్ పట్టించుకోలేదంటే దానికి కారణం వున్నది. కృశ్చేవ్ దాన్ని గమనించినట్లు లేదు. కేవలం సైనికశక్తితో యుద్ధం తేలదు. ప్రపంచం ఎటు మొగ్గనున్నదనే దానిపై దాని ఫలితం ఆధారపడి ఉన్నది.

దండయాత్ర జరిగిన రెండువారాలకు రేడియోలో స్టాలిన్ ఉపన్యసిస్తూ యీ విషయాన్ని స్పష్టం చేశాడు. శత్రువు అప్పటికి గణనీయమైన భూభాగాన్ని ఆక్రమించుకున్నాడని సోవియట్ ప్రజలకు ఆయన తెలిపాడు. ఇంకా కొంత ఆక్రమించుకొంటాడని గూడా దాని భావం. అయితే అది గాబరాకు సాకు కాకూడదని గూడా ఆయన చెప్పాడు. "చరిత్రలో అజేయమైన సేనలంటూ లేవు మెరుపుదాడి ద్వారా జర్మనీకి సైనికంగా ముఖ్యమైన అదనపు అవకాశం లభించిన మాట నిజం. అయినా అది రక్తదాహపు దురాక్రమణదారుగా బైటపడి రాజకీయంగా నష్టపడ్డది" ఈ యుద్ధాన్ని "మొత్తం ప్రజలందరి యుద్ధంగా'' మార్చడవే సోవియట్ ప్రతివ్యూహం. ఎర్రసేన "ప్రతి అంగుళం సోవియట్ భూమికోసమూ" పోరాడవలసిందే 'తిరోగమనం తప్పనిసరైతే' విలువగల ప్రతి వస్తువును తీసుకుపోవాలి. లేకపోతే ధ్వంసం చేయాలి. "ఐరోపా, అమెరికా ఖండపు ప్రజలలో" మనకు విశ్వాసపాత్రులైన మిత్రులు దొరుకుతారని చెప్పాడు. మనం చేసే యుద్ధం ప్రజాస్వామిక హక్కులకై ఐరోపా, అమెరికా ప్రజలు చేసే పోరాటాలతో మిళితమవుతుంది. ఆ విధంగా ప్రతిఘటనకే గాక "విజయం మనదే –పదండి ముందుకు " అని గూడా స్టాలిన్ పిలుపునిచ్చాడు.

ఇరువది సంవత్సరాల కాలంపాటు ఇటువంటి దాడికి తట్టుకోవలసివస్తుందనే సోవియట్ ప్రజలు సన్నద్ధులయ్యారు. అయితే ఆ దాడి వారు భయపడిన రూపాన్ని తీసుకోలేదు. పెట్టుబడిదారీ దేశాలన్నీ కలిసి కట్టుగా దాడి చేస్తాయోవోనని వారు భయపడుతూ వచ్చారు. మిగతా ప్రపంచమంతా తమకు వ్యతిరేక శిబిరంగా తయారవుతుందేమోననే భయం నిజంకాలేదు. ఛాంబర్లేను అధికారంలో వుండగా, ఇంకా రెండుసంవత్సరాలు ముందుగా పోలెండులో ఎర్రసేన ప్రవేశిస్తే ఆ పని జరిగుండేది. ఆంగ్లో – ఫ్రెంచి సైన్యాలు వచ్చేవరకూ ఫిన్లండులో యుద్ధం యీడ్చినా ఆ పని తప్పక జరిగుండేది. హిట్లర్ బాల్కన్ రాజ్యాల మీదికి పోయినప్పుడు రష్యా యుద్ధాన్ని ప్రకటించినా ఆ ప్రమాదం వచ్చియుండేది. ఏమంటే ఒక బ్రిటిష్ దౌత్యప్రతినిధి "హిట్లర్ ఇంకా విజయాలు సంపాదించుకొనకముందే' సోవియట్ యూనియన్ హిట్లరును ఎదుర్కొని యుండవలసిందని నాతో అన్నాడు.

స్టాలిన్‌కి ఉన్న అభిప్రాయం వేరు. యూరప్‌లోని సాధనసంపత్తి సంతతినీ తన వశం చేసుకోవడానికి నిరాక్రమణ సంధి ఇచ్చిన 22 మాసాల వ్యవధి హిట్లరు వినియోగించుకున్నాడని స్టాలిన్‌కి తెలియకపోలేదు. కాని

(మిగతా 31వ పేజీలో)

# ఈ సంచికలో...


**1.** హిట్లర్‌ను మట్టికరిపించిన సోవియట్ రెడార్మి
అన్నా లూయీస్ట్రాంగ్ ......... 2

**2. తెలంగాణాలో ఉధృతంగా సాగుతున్న ఆర్థిక, సామాజిక పోరాటాలు......... 4**

**3. ప్రజాపునాదిని బలపర్చుకుందాం**
ఎస్. వీరయ్య ............ 10

**4.** తెలుగు ప్రజాసంస్కృతి కమ్యూనిస్టుల మహత్తర పాత్ర
తెలకపల్లి రవి ............... 12

**5. సోవియట్ యూనియన్‌లో సామాజిక భద్రత** ........17

**6. యఫ్ఆర్‌డిఐ బిల్లుతో ప్రమాదాలు**
ఎ. కోటి రెడ్డి ................ 19

**7. ప్రమాదంలో మన విత్తనం**
**కోలిన్ టాడ్ హంటర్** .................. 23

**8. అట్టడుగుకు దిగజారుతున్న మోడి**
**ఎ.జి నూరానీ** ................. 26



**సంపాదకుడు:**
## ఎస్. వెంకట్రావు

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:
**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్:** ఎడిటోరియల్ **9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# శాస్త్రీయ దృక్పథం

**భా**రత దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం పౌరుల ప్రాథమిక కర్తవ్యమని మన రాజ్యాంగంలో పేర్కొన్నారంటే మన దేశ పరిస్థితుల్లో దానికో ప్రాధాన్యత ఉంది. దేశంలో విస్తారమైన ప్రజానీకం నిరక్షరాశ్యులుగా ఉండడం, సమాజంపై ఫ్యూడల్ ఆలోచనా ప్రభావం బలంగా ఉండడం, సుదీర్ఘకాలం దేశం వలస పాలనలో మగ్గడం... ఈ కారణాల రీత్యా స్వాతంత్ర్యానంతరం దేశం పురోగమించాలంటే ప్రజల ఆలోచనా విధానం అభివృద్ధికర మార్గంలో సాగాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలోని 15ఎ అధికరణంలో ఈ అంశాన్ని చేర్చారు. శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్) అనేది ఒక జీవన విధానం. ఆధునిక సైన్సు ఏ పద్ధతుల్లో అభివృద్ధి చెంది నేడు మానవాళికి సేవ చేస్తోందో ప్రజలు కూడా రోజువారీ జీవనంలో అటువంటి పద్ధతులు అనుసరించాలని దీనర్థం. శాస్త్రీయ పద్ధతిలో ప్రతిదాన్నీ ప్రశ్నించడం, భౌతిక వాస్తవికతను పరిశీలించడం, పరీక్షించడం, సైద్ధాంతీకరించడం, విశ్లేషించడం, ఇతరులకు చెప్పడం అనే క్రమం ఉంటుంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలంటే ప్రజల్లో తర్కం, చర్చ, వాదన, విశ్లేషణ వంటి గొప్ప ధోరణులను అభివృద్ధి చేయాలి.

యూరప్‌లో లిబరల్ బూర్జువా వర్గం ఈ దృక్పథాన్నే ఆయుధంగా చేసుకుని ఫ్యూడల్ శక్తులపై పోరాడి పారిశ్రామిక విప్లవం సాధించింది. అభివృద్ధి చెందింది. మన దేశంలో కూడా స్వాతంత్ర్య పోరాటంలో లిబరల్ బూర్జువా వర్గం ఈ ఆయుధాన్నే ఉపయోగించుకుంది. నిజానికి శాస్త్రీయ దృక్పథం అనే మాటను వాడింది మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఈ ధోరణి మన దేశంలో పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక పునాది పడడానికి ఎంతగానో తోడ్పడింది.

కానీ ఇప్పుడు అధికారం చేపట్టిన చీకటి శక్తులు ఈ శాస్త్రీయ దృక్పథానికీ, విజ్ఞాన శాస్త్రానికీ విరుద్ధమైన భావజాలాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. డార్విన్ పరిణామ వాదం తప్పు అని ఒక కేంద్ర మంత్రి బహిరంగంగా ప్రకటిస్తే, దేశ ప్రధాని అంతటి వాడు జాతీయ సైన్సు కాంగ్రెస్‌లో పురాణాల కాలంలోనే మనవాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసేశారని ఏ ఆధారాలు లేకుండా చెప్పేశారు. అదే సైన్సు కాంగ్రెస్‌లో ఒక ప్రబుద్ధుడు వేదకాలంలోనే మన వాళ్లు విమానాలు తయారు చేశారని ఏకంగా పత్రమే ప్రవేశపెట్టారు. సూర్య 'దేవునికి' స్కూళ్లలో నమస్కారాలు చేయాలని మరో నాయకుడు పెద్ద కార్యక్రమం ప్రకటించారు. ఒక ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడు వ్యవసాయానికి ఆవుపేడ, మూత్రం చాలు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నిటినీ మూసేయాలని శెలవిచ్చాడు. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అంటూ ఏ చాందసత్వాన్నయితే మహాకవి గురజాడ ఈసడించుకున్నారో ఆ చాందసవాదం నేడు గద్దెనెక్కి మనల్ని పరిపాలిస్తోంది. ఈ చాందసవాదం ప్రకటనలకే పరిమితం కాలేదు. పాలకుల అండతో పాఠ్యపుస్తకాల ద్వారా, మీడియా ద్వారా, చాందసవాదుల అశాస్త్రీయ కార్యకలాపాల ద్వారా ప్రజల మస్తిష్కాలను ఆవహించేస్తోంది.

ప్రజలు శాస్త్రీయ దృక్పథం నుండి తప్పుకుంటే ఏమవుతుందో ఈ నాడు మనం ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి దేశాల్లో చూస్తున్నాం. ఒకప్పుడు ఆధునికతవైపు అడుగులేస్తున్న ఈ దేశాలపై అమెరికా దాడిచేసి చాందస శక్తులను పెంచి పోషించిన ఫలితంగా నేడు అక్కడ చీకటి శక్తులు రాజ్యమేలుతున్నాయి. పౌర హక్కులు, ప్రజాస్వామ్యం లేని అంధయుగంలోకి ఆ దేశాలను తీసుకుపోయాయి. భారతదేశం కూడా ఆ స్థితికి వెళ్లకుండా ఉండాలంటే ప్రజల మస్తిష్కాలపై చాందస శక్తులు పూర్తి విజయం సాధించకుండా అడ్డుకోవాలి. దీనికి ప్రజల్లో సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ ప్రచారం చేయడం అవసరం. తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం ద్వారానే ఆ పని చేయగలం.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# తెలంగాణాలో ఉధృతంగా సాగుతున్న ఆర్థిక, సామాజిక పోరాటాలు

పార్టీ తెలంగాణా రాష్ట్ర తొలి మహాసభ 2015 మార్చి 1-4 తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగింది. ద్వితీయ మహాసభ నల్గొండ పట్టణంలో 2018 ఫిబ్రవరి 4-7 తేదీలలో జరగబోతుంది. ఈ మూడు సంవత్సరాల కాలంలో తెలంగాణ సీపీఐ(ఎం) ఆర్థిక, సామాజిక సమస్యలపై ఉధృత పోరాటాలు నిర్వహిస్తూ అణగారిన కులాలకు, శ్రామికులకు అండగా నిలిచింది. కార్మిక పోరాటాలతో ప్రారంభమైన సీపీఐ(ఎం) తెలంగాణ ప్రస్థానం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, బీసీ సబ్‌ప్లాన్ లాంటి సామాజిక అంశాలపై విస్తృతంగా కదిలింది. మల్లన్నసాగర్‌లో మొదలైన భూనిర్వాసితుల ఉద్యమం రాష్ట్రప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టింది. హరితహారం పేరుతో పోడుభూముల నుండి గిరిజనులను, దళితులను, ఇతర పేదలను తొలగించడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడింది. సాగుదారులను సమీకరించి మిలిటెంట్ పోరాటాలను చేపట్టి భూములను కాపాడిన చరిత్ర తెలంగాణలో సీపీఐ(ఎం)కే ఉంది. ఈ పోరాటాల మూలమలుపే సామాజిక న్యాయం-తెలంగాణ సమగ్రాభివృద్ధి నినాదంతో సాగిన మహాజన పాదయాత్ర. ఆ స్ఫూర్తే టీ మాస్ నిర్మాణం. మూడు సంవత్సరాల ప్రస్థానమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం. కొత్త రాష్ట్రంలో ఒంటరి ప్రయాణంగా అడుగులేసిన సీపీఐ(ఎం) ఈ మూడు సంవత్సరాలలో వామపక్ష ఐక్యత, సామాజిక తరగతులతో విశాల ఉద్యమాలు, కార్మిక, కర్షక, మహిళా హక్కులపై కదనరంగంతో తెలంగాణాలో తనదైన ప్రత్యేకతను చాటుతూ సీపీఐ(ఎం) ద్వితీయ మహాసభకు సిద్ధమైంది.

సీపీఐ(ఎం) తెలంగాణ మహాసభ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను నిశితంగా విశ్లేషిస్తుంది. ప్రభుత్వ అడుగులు ఎటువైపు పడుతున్నాయో సరైన అంచనాలతో ఉంది.

### రాష్ట్ర రాజకీయ ఆర్థిక పరిస్థితి

ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో ఏర్పడ్డ కొత్త రాష్ట్రంలో కె.సి.ఆర్ పాలన ప్రజలను నిరాశపరుస్తోంది. తెలంగాణ ధనిక రాష్ట్రమని కేసీఆర్ పదేపదే చెప్పుకుంటున్నా ప్రజలు పేదలుగానే ఉన్నారు. 10.1శాతం పెరుగుదల జివిఎస్‌డిపిలో ఉంది. అయినా గత ప్రభుత్వాలన్నీ కలిసి 70 ఏండ్లలో రు.70వేల కోట్ల అప్పులు చేస్తే మూడేండ్లలోనే కె.సి.ఆర్ ప్రభుత్వం మరో రు.70వేల కోట్లు అప్పులు చేసింది. దుబారా ఖర్చులు, అప్పులతో ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారు. వాతావరణం అనుకూలించినా వ్యవసాయం సంక్షోభంలోనే ఉంది. రుణమాఫీ అమలు జేసినా, పెట్టుబడి సాయం ఎకరానికి రు.4వేలు ఇస్తామన్నా రైతు ఆత్మహత్యలు ఆగటం లేదు. దీనికి ముఖ్యమైన కారణం ఉత్పత్తి ఖర్చులు పెరగటం, పంటకు గిట్టుబాటు ధరలు అమలు జరగకపోవటం. లక్షలాది అసంఘటిత కార్మిక వర్గం కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక ఆందోళన బాట పడుతున్నారు. మూసేసిన పరిశ్రమలు తెరిపించకపోగా తెలంగాణా వచ్చాక ఇంకా అనేక పరిశ్రమలు మూసేయబడ్డాయి. తెలంగాణా వస్తే ఇంటికో ఉద్యోగం అన్న హామీ అమలు కాకపోగా కనీసం ఉన్న ఖాళీలు కూడా భర్తీ చేయటం లేదు. విద్యా, వైద్య రంగాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కార్పొరేట్ శక్తుల దోపిడీని ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోంది. దాదాపు 7 వేల స్కూళ్లు మూసేయబడ్డాయి. కెజి నుండి పిజి వరకూ ఉచిత విద్య హామీ అటకెక్కింది. రాష్ట్రంలో అవినీతి యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక మాఫియా, భూ మాఫియా అడ్డు లేకుండా అక్రమాలు సాగిస్తోంది.

తెలంగాణా ఉద్యమ సమయంలో ప్రముఖ నినాదంగా ఉన్న 'సామాజిక తెలంగాణా' ఊసే పాలనలో లేదు. దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానన్న వాగ్దానం తుంగలో తొక్కారు. ఒక్క మహిళకు కూడా మంత్రివర్గంలో స్థానం ఇవ్వలేదు. అప్పుడప్పుడు కులాలవారీ కొత్త వాగ్దానాలు వినిపించడం, కుల భవనాలకు శంకుస్థాపనలు చేయటం తప్ప ఆచరణ శూన్యం. దళితులు, గిరిజనులకు కుటుంబానికి 3ఎకరాల భూమి వాగ్దానం అమలు కాకపోగా, గిరిజనులు సాగు జేసుకుంటున్న లక్షల ఎకరాల పోడు భూముల నుండి వాళ్లను వెళ్లగొట్టే దుర్మార్గానికి ప్రభుత్వం పూనుకుంది. బిసి సబ్‌ప్లాన్, మైనారిటీ సబ్‌ప్లాన్ చట్టాలు, ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్ అమలు, ఎస్టీ రిజర్వేషన్ పెంపు, మైనారిటీ రిజర్వేషన్, ఎం.బి.సి కులాల గుర్తింపు, నిధుల కేటాయింపు వగైరా వాగ్దానాలను ఏ ఒక్కటీ అమలుజరపలేదు. వివిధ కులాలకు ఊరింపులు, అరా కొరా విదిలింపులు తప్ప రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు జేయటంలో కె.సి.ఆర్ సర్కారుకు చిత్తశుద్ధి లేదు.

నూతన తెలంగాణాలో కనీస ప్రజాస్వామ్య హక్కులు కూడా కరువవుతున్నాయి. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణా అన్నారు. సర్కారు ఏర్పడ్డ తొలిరోజుల్లోనే అతి దారుణంగా శృతి, సాగర్ ఎన్‌కౌంటర్‌తో పాటు వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతూనే ఉన్నాయి. సాధారణ సమ్మెలను కూడా సహించే స్థితిలో ప్రభుత్వం లేదు. ఏ సమ్మెనూ చర్చల ద్వారా పరిష్కరించలేదు. ప్రదర్శనలు, సభలు జరుపుకోవటమే సాధ్యం కాని పరిస్థితి నేడు తెలంగాణాలో ఉంది. ధర్నా చౌక్‌ను రద్దు చేసారు. స్వంత పార్టీలోనూ ప్రజాస్వామ్యం లేని పరిస్థితి. క్షేత్రస్థాయి వరకూ పార్టీ వివిధ గ్రూపులుగా విడిపోయి ఉంది. పాలన అంతా కుటుంబ సభ్యుల స్వంత వ్యవహారంగా మారింది.

టిఆర్ఎస్ ప్రధానంగా తెలంగాణా సెంటిమెంట్‌పైనే బతుకుతోంది తప్ప పాలనలో పాతవిధానాలకు భిన్నత్వం ఏమీలేదు. మరో ప్రత్యామ్నాయంపై ప్రజలకు విశ్వాసం కల్గించగలిగితే ఈ పరిస్థితిని మార్చే అవకాశం

ఉంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ 2019లో అధికారం మాదే అని బింకంగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రభుత్వ వైఫల్యాలపై ధీటుగా వ్యవహరించలేక పోతోంది. ఆ పార్టీ గతంలో చేసిన పాలన, ప్రస్తుత నాయకత్వ అనైక్యత వల్ల ప్రజల విశ్వాసం పొందటం కష్టం. పాలించే పార్టీపట్ల ప్రజల అసంతృప్తి పెరిగితే అదే విధానాలు కల్గి ఉన్న ప్రధాన ప్రతిపక్షం వైపు చూడటం కాకుండా ప్రత్యామ్నాయ విధానాల వైపు ఆలోచించే విధంగా రాజకీయ పరిస్థితిని మార్చాలి. ఆ విధంగా ప్రత్యామ్నాయ పాలనా విధానంతో, అభివృద్ధి నమూనాతో ప్రజల ముందుకు వెళ్లటం నేడు అవసరం. ఇందుకోసం వామపక్ష, సామాజిక శక్తులతో సీపీఐ(ఎం) చేసే ప్రయత్నాలు, ఏర్పర్చిన 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్' పట్ల రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో చర్చ మొదలైంది.

> "మొత్తం 11 వందలకు పైగా సభలు జరిగాయి. మండల,జిల్లా కేంద్రాలలో పెద్ద సభలు జరిగాయి. పార్టీ బలమైన ప్రాంతా ల్లోనూ, ఏజన్సీ పోడుభూముల కేంద్రాలలో ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. రాష్ట్రంలో రాజకీయ ప్రభావం పడేసే విధంగా ముగింపు సభ హైద్రాబాద్‌లో భారీగా జరిగింది."



ఇబ్రహీం పట్నంలో జరిగిన మహాజన పాదయాత్రలో ప్రారంభసభలో పాల్గొన్న ప్రజలు.

### మహాజన పాదయాత్ర

2016 అక్టోబరు నుండి 5 మాసాల పాటు రాష్ట్రంలో పార్టీ ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయం - రాష్ట్ర సమగ్రాభివృద్ధి' ఎజండాగా సాగిన 'మహాజన పాదయాత్ర' ఈ రాజకీయ కృషికి ఒక ఊపునిచ్చింది. పార్టీ శ్రేణులను ఉత్సాహ పర్చటానికి, సామాజిక శక్తులను సీపీఐ(ఎం)వైపు ఆకర్షించబడటానికి, పార్టీ రాజకీయ ప్రతిష్ట పెరగటానికి ఈ యాత్ర బాగా ఉపయోగపడింది. యాత్ర ప్రకటించగానే స్వయంగా ముఖ్యమంత్రే ప్రెస్‌మీట్‌లో సీపీఐ(ఎం) యాత్రను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యాత్ర పట్ల అధికార పార్టీ నాయకులు అవాకులు చవాకులు పేలారు. అయినప్పటికీ యాత్ర జయప్రదంగా నిర్వహించబడడం, రాష్ట్ర ప్రజల్లో చర్చనీయాంశం కావడం రాజకీయంగా పార్టీకి మంచి విజయం.

రాష్ట్ర పార్టీ కార్యదర్శి కా॥ తమ్మినేనితో పాటు, కామ్రేడ్స్ జాన్‌వెస్లీ, ఎస్.రమ, ఎం.వి. రమణ, ఎం.డి. అబ్బాస్, పి. ఆశయ్య, శోభన్ నాయక్, కె.నగేష్, నైతం రాజులు ఈ యాత్ర దళంగా పాల్గొన్నారు. 2016 అక్టోబరు 17న ఇబ్రహీంపట్నంలో ప్రారంభమై 30 జిల్లాల్లో 1520 గ్రామాల గుండా 4,149 కి.మీ. సాగి 2017 మార్చి 19న హైద్రాబాద్ సరూర్‌నగర్ గ్రౌండ్‌లో ముగిసింది. ప్రారంభసభలో ప్రకాశ్ అంబేద్కర్, బివి రాఘవులు, చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొనగా, ముగింపు సభలో కామ్రేడ్స్ సీతారాం ఏచూరి, పినరయ్ విజయన్ (కేరళ సిఎం) పాల్గొన్నారు. యాత్రలో రాష్ట్రంలోని ప్రముఖులతో పాటు, అఖిలభారత కేంద్రం నుండి సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, బృందా కరత్, బివి రాఘవులు, ఎం.ఎ బేబి, వి.శ్రీనివాసరావు, ఇంకా పార్టీ, ప్రజా సంఘాల నాయకులు నడకలో, సభల్లో పాల్గొన్నారు. సిపిఐతో బాటు 7 వామపక్ష పార్టీలు మద్దతిచ్చాయి. అలాగే కాంగ్రెస్, టిడిపి, వైఎస్ఆర్‌సిపి పార్టీలు కూడా దాదాపు అన్ని జిల్లాలలో మన సభల్లో పాల్గొని మద్దతు ఇచ్చారు.

మొత్తం 11 వందలకు పైగా సభలు జరిగాయి. మండల, జిల్లా కేంద్రాలలో పెద్ద సభలు జరిగాయి. పార్టీ బలమైన ప్రాంతాల్లోనూ, ఏజన్సీ పోడుభూముల కేంద్రాలలోనూ ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. రాష్ట్రంలో రాజకీయ ప్రభావం పడేసే విధంగా ముగింపు సభ హైద్రాబాద్‌లో భారీగా జరిగింది. యాత్రకు వివిధ సామాజిక సంఘాలు, మేధావులు, గుర్తింపు కలిగిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో మద్దతిచ్చారు, సభల్లో పాల్గొని ప్రసంగించారు. మధ్యాహ్నం 3గం॥ నుండి రాత్రి 10 గం॥ల వరకూ సభ జరగటం విశేషం. పాదయాత్రతో పార్టీ శ్రేణులు బాగా ఉత్సాహపడ్డాయి. జిల్లా పార్టీలు, ప్రజాసంఘాలు శక్తికి మించి ఈ కృషిలో పాల్గొన్నాయి. ఈ యాత్ర పార్టీ తదుపరి రాజకీయ కార్యాచరణకు పునాదిగానూ, సామాజిక శక్తులకు మనపట్ల విశ్వాసం కల్పించేదిగానూ బాగా ఉపయోగపడింది.

### ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా

పాదయాత్ర సందర్భంగా 'సామాజిక న్యాయం - రాష్ట్ర సమగ్రాభివృద్ధి' అనే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా పత్రాన్ని (తెలంగాణా రాష్ట్ర అభివృద్ధికి మన కార్యాచరణ ప్రణాళిక) విస్తృతంగా ప్రజలకు పంపిణీ చేసి చర్చనీయాంశం చేయగలిగాం. ఈ డాక్యుమెంట్‌ను పాదయాత్రకు ముందే రాష్ట్రంలోని వివిధ రంగాల మేధావులతో సంప్రదింపులు జరిపి రూపొందించటం, రాష్ట్ర కమిటీ చర్చించి ఆమోదించటం జరిగింది. ఈ డాక్యుమెంట్‌లో కేవలం ప్రభుత్వాలను వివిధ అంశాలపైన విమర్శించటం మాత్రమే కాకుండా ఆయా అంశాల్లో భిన్నమైన పంథాలో అభివృద్ధిని ప్రజలకు అందేట్లుగా ఎలా చేయవచ్చో పరిశ్రమలు, వ్యవసాయం, విద్యా,

**❝ ఈ మూడు సంవత్సరాల కాలంలో పై సమస్యలపైనే కాకుండా ఇంకా ముందుకొచ్చిన అనేక సమస్యలపై ప్రజలను కదిలించటానికి, పోరాటాలు నిర్మించటానికి మనం తీవ్రంగా ప్రయత్నించాం. కొన్ని పోరాటాలు ఉధృతంగా జరిగాయి. ఫలితాలు కూడా బాగున్నాయి. మరి కొన్ని క్యాంపెయిన్స్‌గా సాగాయి తప్ప వాటిని పోరాటాలు అనలేము. ❞**



మహాజన పాదయాత్రలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్‌లో నాయకులు, ప్రజలు

వైద్యం తదితర అంశాల వారీగా వివరించటం జరిగింది. ఆ విధంగా తెలంగాణా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాలను, అభివృద్ధి నమూనాను ప్రజల ముందుకు పార్టీ తెచ్చింది.

### టీ మాస్

ఈ కృషి కొనసాగింపుగా 2017 జులైన 4న, 'టీ మాస్' ఆవిర్భావం మరో ముఖ్యమైన మలుపు. 281 ప్రజా వర్గ, సామాజిక సంఘాలతో ఈ ఐక్యవేదిక ఏర్పడింది. హైద్రాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభకు దాదాపు 4వేల మంది వివిధ సంఘాల కార్యకర్తలు హాజరయ్యారు. రాష్ట్రంలోని ప్రముఖ మేధావులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొన్నారు. నాయకత్వ కమిటీలో భాగస్వాములయ్యారు. తర్వాత 32 జిల్లాల్లో జరిగిన సదస్సుల్లో 60 వేల మందికి పైగా పాల్గొన్నారు. 32 జిల్లా కమిటీలు ఏర్పడ్డాయి. జనవరి నెలంతా కార్యకర్తలు జనంలో ఉండాలనే వినూత్న కార్యక్రమానికి టీ మాస్ పిలుపివ్వగా 3500 గ్రామాల్లో కమిటీలు వేశారు. సంక్రాంతి ముగ్గుల పోటీలలో మహిళలు సామాజిక న్యాయంపై తమ నైపుణ్యాన్ని చాటారు. 400 మండలాల్లో నిరాహారదీక్షలు జరిగి కలెక్టరేట్ల ముట్టడి, ధర్నాలలో 50 వేల మందితో జనవరి నెల జనంలో టీ మాస్ మార్మోగింది. ప్రజాగాయకులు, ప్రొఫెసర్లు, సామాజికవేత్తలు, వివిధ సంఘాలు, గుర్తింపు కలిగిన అనేకమంది ప్రముఖులు రాష్ట్రంలో, జిల్లాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. టీ మాస్ కొద్ది కాలంలోనే రాష్ట్రంలో పాపులర్ అయింది. రాష్ట్రంలో వివిధ సామాజిక ఆర్థిక సమస్యలపై టీ మాస్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరిగాయి. సామాజిక సంఘాల కార్యకర్తలు, నాయకులు బాగా ఉత్సాహంగా పాల్గొన్నారు. టీ మాస్ అనేది రాష్ట్ర రాజకీయ వర్గాల్లో, అధికార పార్టీలో కూడా చర్చనీయాంశమయింది.

టీ మాస్‌లో భాగస్వాములైన సంఘాలు, మేధావులంతా ఈ కృషిలో, ఆ కార్యకలాపాలలో పాల్గొంటూనే, పాలకవర్గాలకు ప్రత్యామ్నాయంగా సామాజిక న్యాయం ఎజెండాతో ఒక రాజకీయ వేదిక ఏర్పడాలనే బలమైన ఆకాంక్షను వ్యక్తం చేస్తూ వచ్చారు.

### బహుజన లెఫ్ట్ ఫ్రంట్

టీ మాస్ ఏర్పడిన 3,4 మాసాల్లోనే రాష్ట్రంలో ముఖ్య మైన రాజకీయ పరిణామాలు జరుగుతూ రాజకీయాలు వేడెక్కటం ప్రారంభమైంది. టీఆర్ఎస్ ఒకవైపు, దాని వ్యతిరేక శక్తులన్నీ మరోవైపు ఏకం కావాలనే పిలుపులు ముందుకొచ్చాయి. ఆ వాతావరణం అలాగే కొనసాగితే వామపక్ష రాజకీయ కార్యాచరణ వెనకబడే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితిని అక్టోబరులో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ చర్చించి, రాష్ట్రంలో సీపీఐ(ఎం)తో కలిసి వచ్చే వామపక్ష, సామాజిక, ప్రజాస్వామిక శక్తులతో ప్రత్నామ్నాయ రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికనుగుణంగా రాష్ట్రంలోని వామపక్ష పార్టీల తోనూ, ఇతర రాజకీయ పార్టీలతోనూ సంప్రదింపులు ప్రారంభించి మొత్తంగా 28 పార్టీలను ఫ్రంట్‌గా ఏర్పడటానికి ఒప్పించగలిగింది. 2018 జనవరి 25న హైద్రాబాద్‌లో 6,7 వేల మందితో జరిగిన భారీ సభలో సామాజిక న్యాయం - రాష్ట్ర సమగ్రాభివృద్ధి ఎజండాగా 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్' ఏర్పడింది. జిల్లాల నిర్మాణం పూర్తి చేసి మే లో బహుజన వామపక్ష ఫ్రంట్ మండల జైత్రయాత్రలకు సిద్ధమైంది.

### వర్గ, ప్రజాపోరాటాలు

కోల్‌కత్తా ప్లీనం సామాజిక ఆర్థిక సమస్యలపై వర్గ, ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపిచ్చింది. గత మహాసభలో "ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, విద్యా వైద్య రంగాల్లో సాగుతున్న దోపిడీ, కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి సమస్య, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సమస్య, రైతాంగ ఆత్మహత్యలు, భూమి ఇండ్ల స్థలాల సమస్య"లపై రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్మించటానికి తీవ్ర ప్రయత్నం జరిగింది.

ఈ మూడు సంవత్సరాల కాలంలో పై సమస్యలపైనే కాకుండా ఇంకా ముందుకొచ్చిన అనేక సమస్యలపై ప్రజలను కదిలించటానికి, పోరాటాలు నిర్మించటానికి పార్టీ తీవ్రంగా ప్రయత్నించింది. కొన్ని పోరాటాలు ఉధృతంగా జరిగాయి. ఫలితాలు కూడా బాగున్నాయి. మరి కొన్ని క్యాంపెయిన్స్‌గా సాగాయి తప్ప వాటిని పోరాటాలు అనలేము. మొత్తంగా ఈ కాలంలో

**"మల్లన్నసాగర్ పోరాటం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. ఆత్మరక్షణలో పడేసింది. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన స్థితిని కల్పించింది. 2013 చట్టం ఉల్లంఘనను ఈ పోరాటం వెలుగులోకి తెచ్చింది. 123 జివో ను కోర్టులో కొట్టేసేటట్లు చేసింది. వందల కేసులు హైకోర్టులో వున్నాయి. మల్లన్నసాగర్ పోరాటం రాష్ట్రవ్యాపితంగా నిర్వాసితులను కదిలించింది."**

రాష్ట్రంలో రాజకీయ బలాబలాలు మార్చేంతగా ఉధృతస్థాయిలో ప్రజా పోరాటాలు జరగలేదని మాత్రం చెప్పవచ్చు.

ఈ కాలంలో ఆర్థికాంశాలపై పోరాటాలు బాగా జరిగాయి. అలాగే సామాజిక సమస్యలపై పార్టీ కేంద్రీకరించి పనిజేసింది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, బిసి సబ్‌ప్లాన్, మైనారిటీ సబ్‌ప్లాన్ రిజర్వేషన్లు, ఎంబిసి సమస్యలు, కుల దురహంకార హత్యలు వగైరా సమస్యలపై బాగా కృషి జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కృషి మంచి ప్రభావాన్ని కల్గించింది. ప్రజలను కదిలించింది. పార్టీ పలుకుబడి పెరిగింది.

రాష్ట్రంలో జి.ఎస్.డి.పి 10.1 శాతం పైగా ఉంది. ఈ స్థితిలో సహజంగానే ప్రజలు ఆర్థికంగా కొంత సంతృప్తి చెందే అవకాశాలుంటాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చింది. తెలంగాణా సాధించిన పార్టీగా ప్రజల్లో ఖ్యాతి ఉంది. అందువల్ల అసంతృప్తి ఏర్పడ్డ వర్గాలు, తరగతులు కూడా ఇంకా చూద్దాం అనే ఆశల్లో ఉన్నారు తప్ప ఆగ్రహంతో పోరాటాల్లోకి రావటం లేదు. రైతులు, గ్రామీణ పేదలు, మధ్యతరగతి ప్రధానంగా ఈ స్థితిలో ఉన్నారు.

అసంఘటితరంగ కార్మికులు, ఆశా వర్కర్లు, గిరిజనులు, భూ నిర్వాసితులు పెద్దఎత్తున పోరాటాల్లోకి వచ్చారు. వీరందరినీ పార్టీ ఆర్గనైజ్ చేసి పోరాటాలు నిర్వహించింది. పార్టీ, వివిధ ప్రజాసంఘాలు పోడుభూములు, భూనిర్వాసితుల పోరాటాలు మిలిటెంట్‌గా జరిగేలా కృషిచేశాయి. మున్సిపల్ వర్కర్స్, ఆశాలు, పంచాయితీ రాజ్ వర్కర్లు మొదలైన కార్మిక పోరాటాలు దీర్ఘకాలం నడిచాయి. పోడుభూములు, భూనిర్వాసితుల ఉద్యమాల్లో కొన్ని మంచి ఫలితాలు వచ్చాయి. మున్సిపల్, ఆశా, అసంఘటితరంగ, స్కీం వర్కర్ల పోరాటాలలో ఆశించిన ఫలితాలు రాలేదు. యూనియన్లను చీల్చి దెబ్బకొట్టటం, నిర్బంధం ప్రయోగించటం వంటి చర్యలకు ప్రభుత్వం పూనుకుంది.

### మల్లన్నసాగర్

ఈ కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాల భూములను రైతుల నుండి బలవంతంగా లాగేసుకుంది. వామపక్ష పార్టీల ఒత్తిడితో వచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని ధిక్కరించి 123 జిఓ ద్వారా రాష్ట్రప్రభుత్వం భూములు సేకరించింది. 50 టియంసిల సామర్థ్యంతో నిర్మించ



మహాజన పాదయాత్ర ముగింపు సభలో పాల్గొన్న అశేష ప్రజానీకం

తలపెట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూసేకరణపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చింది. భూనిర్వాసితుల్లో వ్యక్తమైన ఆందోళనను పార్టీ సకాలంలో గుర్తించి మల్లన్నసాగర్ పోరాటాన్ని చేపట్టింది. ఉమ్మడి మెదక్ జిల్లా చొరవతో ప్రారంభమైన మల్లన్నసాగర్ భూనిర్వాసితుల ఉద్యమం సుదీర్ఘకాలం మిలిటెంట్‌గా సాగుతోంది. ఇది పార్టీకి సంబంధాలు లేని ప్రాంతం. ఒకప్పుడు మావోయిస్టుల ప్రభావం అధికంగా వుండేది. కొత్త రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 90 శాతంపైగా ప్రజాప్రతినిధులంతా టిఆర్ఎస్‌లో చేరారు. అలాంటి మల్లన్నసాగర్ నిర్వాసితుల గ్రామాల్లో పార్టీ, ప్రజాసంఘాలు చురుకైన పాత్రను పోషించాయి. 2013 చట్టంపై అవగాహన కల్పించటానికి సదస్సుల రూపంలో మొదట కృషి జరిగింది. జిల్లా పార్టీ బృందం చేసిన పాదయాత్ర, అలాగే పార్టీ రాష్ట్రకార్యదర్శి మల్లన్నసాగర్ ప్రాంతంలో చేసిన పాదయాత్ర భూనిర్వాసితులకు ధైర్యాన్నివ్వడమే కాకుండా ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తం చేసింది. రాయబారాలు, ప్రదర్శనలు, ధర్నాలతో మొదలైన ఉద్యమం, పోలీసులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిఘటించటం, కాల్పులు జరిగేదాకా నిర్బంధం పెరిగింది.

మల్లన్నసాగర్ పోరాటం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన స్థితిని కల్పించింది. 2013 చట్టం ఉల్లంఘనను ఈ పోరాటం వెలుగులోకి తెచ్చింది. 123 జివోను కోర్టులో కొట్టేసేటట్లు చేసింది. వందల కేసులు హైకోర్టులో వున్నాయి. మల్లన్నసాగర్ పోరాటం రాష్ట్రవ్యాపితంగా నిర్వాసితులను కదిలించింది. అదనపు నష్టపరిహారాన్ని కొంతైనా పెంచుకునేట్లు చేసింది.

ప్రభుత్వాన్ని ఎదిరించగల్గే ధైర్యం సీపీఐ(ఎం) కే ఉందన్న వాతావరణం మల్లన్నసాగర్ ఉద్యమం తెచ్చింది. ముఖ్యమంత్రి సీపీఐ(ఎం)ని టార్గెట్‌గా ఎంచుకోవడానికి మల్లన్నసాగర్ పోరాటం కూడా ముఖ్యమైంది. ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ కార్యదర్శి ఎ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు జయరాజ్, భాస్కర్‌లు ఆ గ్రామాల్లోనే నెలల తరబడి వుండటం నిర్వాసితులకు పార్టీ, ప్రజాసంఘాల పట్ల నమ్మకం పెంచింది. కాల్పుల సమయంలో ప్రజలతోనే వున్నారు. 24 మందిపై కేసు పెట్టి, పార్టీ కార్యకర్తలు ముగ్గురిని ప్రభుత్వం జైలుకు

> “ వర్గ ఐక్యత సాధించాలంటే సామాజిక సమస్యలపై కృషి తప్పనిసరి. ఎందుకంటే మన దేశంలో వర్గాలు కులాల నుండి వచ్చిన ప్రజలతో ఏర్పడ్డాయి. ఆ కుల ప్రభావాలు తొలగించనంతకాలం వర్గఐక్యత సాధించలేము. కులాల మధ్య ఉండే అసమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడే క్రమం వర్గఐక్యతకు తోడ్పడుతుంది. ”



మల్లన్న సాగర్ పేరుతో తమ భూములు లాక్కుంటున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొన్న రైతు కూలీలు

పంపింది. ప్రభుత్వం ఎంత నిరంకుశంగా వ్యవహరించినా, ఈ ఉద్యమంలో సీపీఐ(ఎం) చివరి వరకు వారితో నిలుస్తుందనే నమ్మకం కల్గించింది. నిర్వాసితులు, ప్రజలు కదిలే సమస్యలను సకాలంలో గుర్తించి సరైన రూపాల్లో ఉద్యమాలు నిర్మించగల్గితే కొత్త ప్రాంతాల్లో కూడా వేగంగా విస్తరించటం, ప్రజలపై ప్రభావం పడవేయటం సాధ్యమౌతుందని మల్లన్నసాగర్ పోరాటం నిరూపించింది.

మల్లన్నసాగర్‌లో మొదలైన భూనిర్వాసితుల ఉద్యమం ధారావాహికంగా రాష్ట్రమంతా విస్తరించింది. 3 లక్షల ఎకరాల పరిధిలో 200 గ్రామాలలో 26 జిల్లాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారుల నిరసనలు సాగాయి. ద్వితీయ మహాసభలలో నిర్వాసితుల ఉద్యమాన్ని మరింత సమరశీలంగా సాగించటానికి కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

**కార్మిక పోరాటాలు**

కార్మిక రంగంలో ఈ కాలంలో మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. మున్సిపల్, పంచాయితీ కార్మికులు 45 రోజులు సమ్మెలు చేస్తే, 106 రోజుల సమ్మెతో ఆశా వర్కర్లు తెలంగాణలో 100 రోజుల మొదటి సమ్మెగా నిలిచింది. సీపీఐ(ఎం) ఆశాల సమ్మెకు మద్దతుగా తెలంగాణ అంతా ఆర్థిక సహాయానికి పిలుపిచ్చి రు.17,60,000 ఆశాలకు అందజేశారు. కష్టాలలో ఉన్న మహిళలు సీపీఐ(ఎం) చేసిన ఈ సహాయం పోరాట పట్టుదలను పెంచింది. పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోరాటాలను అణచివేసినా వాటి ప్రభావంతోనే అంగన్‌వాడీ, బీడీ, కాంట్రాక్టు కార్మికులు ఇంకా అనేక మంది ఇతరుల జీతాలు పెరిగాయి. అనేక వరాలు ప్రకటించబడ్డాయి. పోరాడిన వర్గాలు, తరగతుల డిమాండ్లు సాధించటంలో మిశ్రమ ఫలితాలున్నా రాజకీయంగా ఈ పోరాటాలన్నింటిలో పార్టీ జోక్యం చేసుకుని మద్దతు ఇవ్వటం, నాయకత్వం వహించటం చేసింది. పోరాడే పార్టీగా రాజకీయ ప్రతిష్టను పార్టీ పొందగలిగింది. అందుకే ముఖ్యమంత్రి స్వయంగా అనేకసార్లు అసెంబ్లీలోనే పార్టీపై విరుచుకుపడటం, వ్యంగ్యాస్త్రాలు సంధించటం, పార్టీపైనా పత్రికపైనా అవాకులు చవాకులు పేలటం, సిఐటియు యూనియన్లపై కక్షగట్టి వ్యవహరించటం చేసారు. ఇప్పటికీ చేస్తున్నారు. పార్టీ చిన్నదైనా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నదీ, ఇరుకున పెట్టగలుగుతున్నదీ సీపీఐ(ఎం) అనేది అందరూ గుర్తించారు.

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్ లాంటి జిల్లాల్లో కూలి పోరాటాలు చేసి కూలి పెంచుకున్నారు. 10 జిల్లాల్లో 30,40 కేంద్రాలలో సాగుభూముల ఉద్యమాలు జరిగాయి. ప్రభుత్వం దళిత, గిరిజనులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి 17 లక్షల ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, ఈ మూడు సంవత్సరాలలో 14 ఎకరాలతో ప్రస్తుతానికి సరిపుచ్చింది. డబుల్‌బెడ్‌రూంలు, డ్వాక్రాలు, సమస్యలు అంతే ఉన్నాయి. మహిళలు మద్యపాన విధానానికి వ్యతిరేకంగా సమరశంఖం పూరించి ప్రభుత్వంతో ఆ విధానాన్ని మార్పించారు. అయినా 18 వేల కోట్లకు మద్యం ఆదాయాన్ని పెంచుకునే లిక్కర్ అమ్మకాలు సాగుతున్నాయి. విద్యార్థుల పోరాటాలు ఉధృతమయ్యాయి.

సెంట్రల్ యూనివర్సిటీ రోహిత్ వేముల ఆత్మహత్య వామపక్ష, సామాజిక తరగతులను కుదిపేసింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అండతో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో విసి అప్పారావు విసిరిన హిందుత్వవాదాన్ని సామాజిక, వామపక్ష శక్తులు ధైర్యంగా ఎదుర్కొన్నాయి. గత రెండు సంవత్సరాలుగా జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ నాయకత్వంలో సోషల్ జస్టిస్ కూటమి విజయదుందుభిని మోగిస్తూ మతోన్మాద ఏబివిపిని ఓడిస్తున్నది. అయినా హిందుత్వ శక్తులు అడ్డదారుల్లో యూనివర్సిటీ ప్రశాంతతను దెబ్బతీయటానికి గుంటనక్కల్లా పొంచుకునే ఉంటున్నారు.

**సామాజిక సమస్యలపై కృషి**

సామాజిక సమస్యలపై సాగాల్సిన కృషి ప్రాధాన్యతను విశాఖ మహాసభ, కోల్‌కతా ప్లీనం నొక్కి చెప్పాయి. ఈ అంశాలపై పార్టీలో కొన్ని ప్రాంతాలలో ఉన్న వైముఖ్యాన్ని, ఎ.పి, తమిళనాడు లాంటి కొద్ది రాష్ట్రాలలో సాగుతున్న కృషిని కూడా మహాసభ ప్రస్తావించింది. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన కృషిని తెలంగాణా ఏర్పడిన తర్వాత మరింత బలంగా సీపీఐ(ఎం) కొనసాగిస్తున్నది. ఈ కాలంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, బిసి సబ్‌ప్లాన్, సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా మహాజన పాదయాత్ర, ప్రజాసంఘాల ఐక్యవేదిక టీమాస్ ఏర్పాటు, సాంస్కృతిక రంగంలో కృషి, రాష్ట్రంలో

వివిధ ప్రాంతాల్లో కుల దురహంకారంతో జరిగిన వివిధ ఘటనలపై స్పందించం, సామాజిక న్యాయం ప్రధాన ఎజండాగా పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటుకై జరిగిన కృషి ఈ కాలంలో జరిగిన ముఖ్యమైన కార్యక్రమాలుగా ఉన్నాయి.

ఈ కృషి వల్ల పార్టీకి అనేకమంది కొత్త మిత్రులు దొరకటంతో పాటు, గతంలో లెఫ్ట్ భావజాలంతో ఉండి దూరమై సామాజిక సంఘాలలో పనిజేస్తున్న ముఖ్యులు, మేధావులు పార్టీ ఆలోచనకు దగ్గరయ్యారు. ప్రజల్లో పార్టీ పట్ల సానుకూల ప్రభావం ఏర్పడింది.

వర్గపోరాటం, సామాజికాంశాలపై కృషి రెండూ వేరు వేరు కావు. ఒకదానికొకటి పోటీ పెట్టి మాట్లాడటం సరికాదు. సామాజిక సమస్యలపై కృషి అనేది వర్గపోరాటంలో అంతర్భాగమే. వర్గపోరాటంలో సోషలిస్టు కృషి, ప్రజాతంత్ర కృషి అనే రెండు భాగాలుంటాయని మార్క్సిజం చెప్పింది. కులవ్యవస్థ, పురుషాధిక్యత వగైరా అంశాలపై జరిగే పోరాటం ప్రజా స్వామిక పోరాటంలో ముఖ్యమైన భాగం. ఈ అంశాలను వదిలివేయటం అంటే వర్గ పోరాటంలో ముఖ్యమైన భాగాలను వదిలివేయటమే.

సామాజిక సమస్యలపై కృషి అనేది వర్గ అనైక్యతకు దారి తీస్తుందనే అవగాహన తప్పు. పైగా వర్గ ఐక్యత సాధించాలంటే సామాజిక సమస్యలపై కృషి తప్పనిసరి. ఎందుకంటే మన దేశంలో వర్గాలు కులాల నుండి వచ్చిన ప్రజలతో ఏర్పడ్డాయి. ఆ కుల ప్రభావాలు తొలగించనంత కాలం వర్గఐక్యత సాధించలేము. కులాల మధ్య ఉండే అసమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడే క్రమం వర్గఐక్యతకు తోడ్పడుతుంది.

కులమనేది ఉపరితలంలో మాత్రమే భాగమనే అవగాహన సరైంది కాదు. కులం పునాదిలో కూడా ఉంది. మన దేశంలో పెట్టుబడిదారీ విధానం ఫ్యూడలిజంతో రాజీ పడింది. అందువల్ల పెట్టుబడిదారీ వర్గదోపిడీ కుల అణచివేత మనదేశంలో విడదీయ వీల్లేకుండా కలగలిసి పోయాయి. అందువల్ల ఆ రెండింటిపై పోరాటాలు ఏకకాలంలో జరగాలి. ఈ అవగాహన కనుగుణంగా కులం సమస్యపై పార్టీ కార్యకలాపాలుండాలి. ఆ విధంగానే పార్టీ ఉద్యమ అభివృద్ధి సాధ్యం.

కాబట్టి కుల వివక్షకు వ్యతిరేక పోరాటం ఈ కృషిలో కీలకం. కులవ్యవస్థ నిర్మూలన దీర్ఘకాలంలో సాధించగలిగేది. ఆ కృషి సాగిస్తూనే కులవివక్ష రూపాలను ప్రతిఘటిస్తూ, వివిధ అంశాలలో కులాల మధ్య సమాన అవకాశాల కోసం కృషిజేయటం ఈ వ్యవస్థ పరిధిలోనే ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అవుతుంది. ఇందుకు ఉపయోగపడే క్రియాశీలమైన నినాదాలు పార్టీ రూపొందించాలి. (ఉదా॥ అట్టడుగు కులాలకు చదువు, భూమి, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక హోదా, వారి సాంస్కృతిక అంశాలకు విలువ వగైరా)

అదే సమయంలో భారత దేశంలో కులమే ప్రధానమనీ, వర్గం అవసరం లేదనీ లేదా అప్రధానమైనదనీ భావిస్తే తప్పవుతుంది. ఎందుకంటే వర్గ అవగాహనే సమాజ మార్పుకు కీలకం. కులాన్ని సక్రమంగా అర్థం చేసుకోవటానికి, కులనిర్మూలన కోసం పోరాడటానికి కూడా వర్గఅవగాహన అవసరం. కుల వ్యవస్థకు, కుల వివక్షకు వ్యతిరేకంగా సమాన అవకాశాలకోసం జరిగే పోరాటాలన్నీ ప్రజాస్వామ్య పోరాటాలే. దోపిడీని నిర్మూలించే సోషలిస్టు పోరాటాలకు ఇవి దోహదపడతాయి. ఈ ప్రజాస్వామ్య కృషి లేకుండా సోషలిస్టు కృషి ముందుకు సాగదు.

కులాలకు రాజకీయాధికారం అనేది కాకుండా వర్గం లేదా వర్గాల రాజకీయాధికారం అనే మార్క్సిస్టు అవగాహనే శాస్త్రీయమైనది.

(మిగతా 16వ పేజీలో)

**వార్తా పత్రికల రిజిస్ట్రేషన్**

**(రూలు 8వ ఫారం IV ప్రకారం)**

**మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు**

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | విజయవాడ |
| 2. ఏ రకమైన పత్రిక | : | మాసపత్రిక |
| 3. ముద్రాపకుని పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామ | : | 1-1-60/2,ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్ -20. |
| 4. ప్రచురణ కర్త పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామ | : | 1-1-60/2,ఎం.బి.భవన్, ఆర్.టి.సి క్రాస్ రోడ్స్, హైదరాబాద్ -20. |
| 5. సంపాదకుని పేరు | : | ఎస్.వెంకట్రావు |
| చిరునామ | : | డోర్.నెం.27-30-4 ఎమ్.బి.విజ్ఞానకేంద్రం గవర్నర్‌పేట,విజయవాడ - 520002 |
| 6. పత్రిక యాజమాన్యం | : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, |

బి.వి.రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందు మూలముగా తెలియజేస్తున్నాను.

సం/-
బి.వి.రాఘవులు
ప్రచురణ కర్త

# ప్రజాపునాది బలపర్చుకుందాం

**ఎస్ వీరయ్య**



రచయిత
సిపిఐ(ఎం) కేంద్ర కమిటి సభ్యులు

**వామపక్ష ప్రజాతంత్ర ఐక్య సంఘటన ఏర్పాటు సాధ్యమా?**

**కమ్యూనిస్టు పార్టీల ప్రజా పునాది పెరుగుతుందా?**

**కమ్యూనిస్టు కార్యకర్తలు ఏం చెయ్యాలి?**

వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సీపీఐ(ఎం) నిర్ణయించిన నాటినుండీ ఈ ప్రశ్నల చుట్టూ చర్చ నడుస్తున్నది. నిజమే. కమ్యూనిస్టుల ప్రజాపునాది చెదిరింది. మరింత చెదరకుండా కాపాడుకోవాలి. బలోపేతం చేసుకోవాలి. దానికోసమే ఈ నిర్ణయం. పునాది ఎందుకు చెదిరిందో అర్థం చేసుకుంటే మరింత చెదరకుండా ఆపడం గానీ, పునాదిని బలపర్చుకోవడం గానీ సాధ్యమే. విశాఖపట్టణంలో జరిగిన సీపీఐ(ఎం) అఖిలభారత మహా సభ ఈ అంశాలను లోతుగా చర్చించింది. సుమారు మూడు దశాబ్దాలుగా పార్టీ అనుసరించిన ఎన్నికల ఎత్తుగడలను లోతుగా సమీక్షించింది. వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన నిర్మాణం కర్తవ్యాన్ని వెనక్కి నెట్టి, ఎవరిని ఓడించాలి అందుకోసం ఎవరెవరిని కలుపుకోవాలి అనేదాని చుట్టే ఎత్తుగడలన్నీ తిరిగిన ఫలితమిది అని తేలింది. పార్టీని బలోపేతం చేసుకోవడం కంటే ప్రధాన శత్రువుని ఓడించడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాము. ఈ క్రమంలో సరళీకృత ఆర్థికవిధానాల మీద జరగవలసిన పోరాటం మోతాదు కూడా పదును తగ్గింది. ప్రధాన శత్రువును ఓడించడం కోసం అవే సరళీకృత ఆర్థిక విధానాలను అమలుజరుపుతున్న ప్రాంతీయ పార్టీలతో అవసరానికి మించి సన్నిహితంగా వ్యవహరించిన ఫలితంగానే ఈ పదును తగ్గింది. లోతైన సమీక్ష అనంతరమే వామపక్ష ప్రజాతంత్ర ఐక్య సంఘటన నిర్మాణం ప్రధాన కర్తవ్యంగా తీసుకోవాలని విశాఖ మహాసభ నిర్ణయించింది. ఇందుకోసం ప్రజా పునాది బలోపేతం చేసుకోవాలనీ, స్వంత బలం పెంచుకోవాలనీ పార్టీ నిర్ణయించింది. పార్టీకి తగిన ప్రజాపునాది ఉన్నప్పుడే అది ఓట్ల రూపంలో ప్రతిబింబిస్తుంది. వామపక్షాలను ఐక్యం చేయాలన్నా, లౌకిక శక్తులకు విశ్వాసం కల్పించి వామపక్షం చుట్టూ సమీకరించాలన్నా సీపీఐ(ఎం)కు తగిన ప్రజాపునాది లేకుండా అది సాధ్యం కాదు. ప్రజాపునాది పెంచుకోవాలంటే ముందు ఉన్న పునాదిని నిలుపుకోవాలి. బూర్జువా పార్టీలతో అనుసరించిన ఎన్నికల ఎత్తుగడల ఫలితంగానే ప్రజాపునాది బలహీన పడిందని స్పష్టమైంది. అందుకే స్వంత పునాది బలపర్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా కదులుతున్నది. సుమారు మూడు దశాబ్దాల ఎత్తుగడల ప్రభావంతో కొంతమంది శ్రేయోభిలాషులు ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే ఆలోచిస్తున్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు, రాష్ట్రంలో టీఆర్ఎస్‌ను ఓడించే లక్ష్యంతో కాంగ్రెస్‌తో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవాలంటున్నారు. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన పార్టీ కాంగ్రెస్. బడా బూర్జువా, భూస్వామ్య శక్తులకు ప్రతినిధి కాంగ్రెస్. అలాంటి పార్టీతో రాజకీయ సయోధ్య కమ్యూనిస్టుల పునాది మరింత చెదిరిపోవడానికే దారితీస్తుంది. ఇతరులను ఓడించే కర్తవ్యం నిర్వహించడంలో చాలా సార్లు జయ ప్రదమయ్యాము. కానీ ఆ ఎత్తుగడలు పార్టీ పునాది బలహీనపడటానికే దారి తీశాయి. అందుకే స్వంత పునాది బలోపేతం చేసుకునేందుకు తోడ్పడే విధానాలను అనుసరించాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్, టీడీపీ తదితర పార్టీలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయం చూపించగలిగినప్పుడే ప్రజలు మన వెనక సమీకృతమవుతారు. అందుకే ఇప్పుడు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర సమస్యల మీద క్షేత్ర స్థాయిలో ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమం నిర్మించడం ద్వారానే అది సాధ్యం. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడటం ద్వారానే స్వంత బలం పెంచుకోగలము. ఒక పార్టీని ఓడించటం లేదా మరొక పార్టీని గెలిపించడం కాకుండా మన బలం పెంచుకోవడం చుట్టూ ఎత్తుగడలు ఉండాలన్నదే దీని సారాంశం. రాజకీయ విధానాన్ని బట్టే ప్రజా పునాది పెరుగుదల /తరుగుదలలో రాజకీయ విధానం కీలకపాత్ర పోషిస్తుంది. దీంతోపాటు మన నిర్మాణ ఏర్పాట్లు కూడా ముఖ్యపాత్ర పోషిస్తాయి. అందుకే విశాఖ మహాసభ రాజకీయ విధానాన్ని సరిదిద్దింది. ఏ రాష్ట్రానికారాష్ట్రం పార్టీ స్వంత పునాది బలోపేతం చేసుకునేందుకు వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన నిర్మాణానికి తోడ్పడే ఎత్తుగడలు వేయాలని దిశానిర్దేశం చేసింది.

రాజకీయ విధానం మీదనే పార్టీ పెరుగుదల ఆధారపడి ఉంటుందన్నది నిజం. అయితే అదొక్కటే సరిపోదు. అందుకు అనువైన కార్యాచరణ ఉండాలి. ప్రజలు కదిలేందుకు సిద్ధంగా ఉన్న ప్రాంతాలను, ప్రజా ఉద్యమాల పెంపుదలకున్న అవకాశాలను గుర్తించాలి. అందుకవసరమైన కార్యకర్తలను కేటాయించుకోవాలి. అట్లా ఎంపిక చేసిన మండలాల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రజా పోరాటాలు లేకుండా చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాపునాది పెరగలేదు. అందుకే పార్టీ శ్రేణులన్నీ ప్రజల వద్దకే పోవాలని కోల్‌కతా ప్లీనం పిలుపునిచ్చింది. ఒక మండలంలో ప్రజా ఉద్యమానికి మంచి అవకాశాలున్నాయని గుర్తించినప్పుడు, ఆ మండల కేంద్రంలో స్వతంత్రంగా పనిచేయగల సామర్ధ్యం కలిగి పార్టీ విధానం పట్ల స్పష్టత ఉన్న కార్యకర్త అవసరం. పార్టీ పునాది పెంపుదలకు ఇది మొదటి మెట్టు. ఆ కార్యకర్తకు తోడు మండలంలోని ప్రజల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను బట్టి, ముందుకొస్తున్న సమస్యల స్వభావాన్ని బట్టి అవసరమైన కార్యకర్తల సంఖ్యను నిర్ణయించుకోవాలి. గ్రామాల

సారూప్యతను బట్టి, కార్యకర్త సామర్థ్యాన్ని బట్టి ప్రతి కార్య కర్తకు కొన్ని గ్రామాలు అప్పగించాలి. మండలాన్ని చిన్న చిన్న ప్రాంతాలుగా విడగొట్టి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించడం వల్ల కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావడానికీ, నిరంతరం అందుబాటులో ఉండడానికీ అవకాశం ఉంటుంది.

ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల మీద కృషి చెయ్యాలి. కేవలం ఆర్థిక సమస్యలకు పరిమితం కాకూడదు. సామాజిక, సాంస్కృతిక, పౌర సమస్యలు నిర్లక్ష్యం చేయకూడదు. రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని విస్మరించకూడదు. వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలతో సహా ప్రజలకు సహకరించాలి. ఆయా కుటుంబాలలో శుభ కార్యాల సందర్భంగా కలిసిపోవాలి. ఇబ్బందుల్లో ఓదార్చాలి, పరామర్శించాలి. సాధ్యమైన మేరకు సహకరించాలి. సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు, బాధితులకు, సాధారణ ప్రజలకు సహాయపడాలి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత నివ్వాలి. ఆందోళనా-పోరాటం, ప్రచారం, నిర్మాణ పద్ధతులను సక్రమంగా అమలుచేయాలి.

❝ ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల మీద కృషి చెయ్యాలి. కేవలం ఆర్థిక సమస్యలకు పరిమితం కాకూడదు. సామాజిక, సాంస్కృతిక, పౌర సమస్యలు నిర్లక్ష్యం చేయకూడదు. రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని విస్మరించకూడదు. వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలతో సహా ప్రజలకు సహకరించాలి. ఆయా కుటుంబాలలో శుభ కార్యాల సంద ర్భంగా కలిసిపోవాలి. ❞

సుదీర్ఘకాలం బూర్జువా పార్టీలతో కలిసి పనిచేసిన ఫలితంగా కొన్ని స్థానిక మొహమాటాలు పనిచేస్తుంటాయి. అది క్షేత్రస్థాయి కృషికి ఆటంకం. గ్రామీణ పేదల సమస్యల మీద పనిచేయడానికి ఆటంకం. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా అభివృద్ధి చెందిన కొత్త గ్రామీణ ధనిక వర్గం ప్రాంతీయ పార్టీలలో చురుకుగా పనిచేస్తున్నది. గ్రామీణ పేదలను స్థానికంగా పీడిస్తున్నది వీరే. రాజకీయంగా వీరితో సాన్నిహిత్యం, వ్యక్తిగత మొహమాటాలు గ్రామీణ పేదలను మనకు దూరం చేశాయి. అందుకే సరళీకృత ఆర్థిక విధానాల మీద పోరాటం విషయంలో రాజీపడవద్దని పార్టీ పిలుపునిచ్చింది. గ్రామీణ పేదల సమస్యలమీద రాజీలేని పోరాటం చేసినప్పుడే పునాది బలపడుతుంది. ప్రజాపునాది పెంచుకునే లక్ష్యం నెరవేరాలంటే ఈ సమస్యను సరిగా అర్థం చేసుకోవాలి. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతులు, వృత్తిదారులు, వ్యవసాయేతర వృత్తులలో పనిచేస్తున్న కార్మికులు గ్రామీణ ప్రాంతాలలో పునాది వర్గాలు. అంతేకాదు, బలమైన కులవ్యవస్థ ఏర్పడి ఉన్న సమాజం మనది. కులవివక్ష, పురుషాధిక్యత బలంగా పనిచేస్తున్నాయి. అందుకే పునాదివర్గాల ఆర్థిక సమస్యలతో పాటు సామాజిక సమస్యల మీద కూడా నిరంతరం పనిచేయాలి. దళితవాడలు, గిరిజన ప్రాంతాలు, అత్యంత వెనకబడిన తరగతుల సమస్యలను అధ్యయనం చేయాలి. ఆయా గ్రామాలలో, బస్తీలలో పునాదివర్గాల ఆర్థిక, సామాజిక సమస్యల మీద ప్రజలను సమీకరించడం, సంఘటితపర్చడం ద్వారానే ప్రజాపునాది బలపర్చుకోగలము.

గ్రామస్థాయిలోనూ, బస్తీ స్థాయిలోనూ ప్రజల సమస్యలు, వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను, స్థానిక రాజకీయాలు బలాబలాలనూ నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. పునాదివర్గాల ఆర్థిక, సామాజిక సమస్యల ప్రాతిపదికగా ప్రణాళిక రూపొందించుకోవాలి. తోసుకొచ్చిన సమస్యలను వదిలిపెట్టకూడదు. వాటికే పరిమితం కాకూడదు. తోసుకొచ్చిన సమస్యల వెంటపడి ప్రణాళికాబద్ధంగా చేయవలసిన కృషిని విస్మరించకూడదు. అనువైన పరిస్థితులున్న మండలాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత తగిన కార్యకర్తలను నియమించి, ప్రణాళిక రూపొందించి అందుకనుగుణంగా పునాదివర్గాల, తరగతుల సమస్యల మీద నిరంతరం కృషి చేయడం ద్వారానే ప్రజాపునాదిని పెంచుకోగలము. దేశంలో లేదా రాష్ట్రంలో ఒక పెద్ద రాజకీయ కుదుపు రాకుండా, విస్తృత స్థాయిలో ప్రజల్లో అసంతృప్తి పెరగకుండా ఒక ప్రాంతంలో ప్రజాపునాది పెరుగుతుందా, అన్న ప్రశ్న కూడా కొందరు వేస్తారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో చేసే కృషి వల్ల పరిమిత ఫలితమే వస్తుందని భావించే వారు కూడా ఒక విషయం అర్థం చేసుకోవాలి. ఈ కృషి చేయక పోతే ఇప్పటికే ఉన్న పునాది కూడా మిగలదు. అంతేకాదు, సార్వత్రిక అసంతృప్తి ఏర్పడి పెద్ద రాజకీయ కుదుపు వచ్చినప్పుడు కూడా, పరిస్థితులను వినియోగించుకుని పునాది బలపర్చుకోవడానికి ఈ కృషి జరిగే ప్రాంతాల లోనే ఎక్కువ అవకాశాలుంటాయి. ఏమైనా ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజా సమస్యల మీద పనిచేయడం ద్వారా మాత్రమే ప్రజాపునాది బలపడుతుంది.

❋


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

**ఈ మాసం ముఖ్యాంశం**

# తెలుగు ప్రజాసంస్కృతి కమ్యూనిస్టుల మహత్తర పాత్ర



రచయిత
ప్రముఖరాజకీయ విశ్లేషకులు

**మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా 14.12.2017 న విజయవాడలోని యం.బి విజ్ఞానకేంద్రంలో జరిగిన సభకు తెలకపల్లి రవి పంపిన ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం - ఎడిటర్**

కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకుడు మాకినేని బసవపున్నయ్య జయంతి సందర్భంగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలోనే మాట్లాడటం మరింత ఆనందంగా వుంది. రాష్ట్ర విభజన తర్వాత నూతన రాజధాని నిర్మాణమే ఇంకా వూపు అందుకోలేదు. బాహుబలి రాజమౌళి వచ్చి చెప్పినా ప్రభుత్వం ఇంకా నమూనాలే ఖరారు చేయలేదు. కాని విజ్ఞాన కేంద్రం మాత్రం సర్వాంగ సుందరంగా తయారై ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక కేంద్రంగా వెలుగొందుతున్నది.

చాలామంది కమ్యూనిస్టులకు భవనాలు వున్నాయని ఆరోపిస్తుంటారు. ఇతరుల లాగా వారు బంజారా హిల్స్‌లోనో లేక అమరావతి పరిసరాలలోనో ఖరీదైన స్థలాలు కొని భారీ సౌధాలు కట్టుకోరు. ప్రజల నుంచి విరాళాలు సేకరించి ప్రజల కోసమే ఇలాంటి కేంద్రాలు, కార్యాలయాలు నిర్మిస్తారు. ఇప్పటికే హైదరాబాదులో వున్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంతో పాటు ఇది కూడా తెలుగువారి చైతన్య వ్యాప్తికి భావ వికాసానికి జీవనాడిగా సేవ చేస్తుందని విశ్వసిస్తున్నాను. ఎంబి అని అందరం పిలుచు కున్న ఆయనతో నాకు వయసులో చాలా తేడా వున్నా సన్నిహిత సంబంధం వుంది. ఆయనతో పర్యటించి సభల వార్తలందించి, ఇంట ర్వ్యూలు చేసి సందేహాలు అడిగి, ఇంకా పలు రూపాల్లో సన్నిహితంగా సంచరించిన తీరు ఇప్పుడు గొప్ప జ్ఞాపకం. కమ్యూనిస్టు సిద్ధాంత వేత్తగా మహామేధావి అచ్చమైన తెలుగులోనూ ఆంగ్లంలోనూ కూడా ధారాళంగా మాట్లాడగల ప్రజ్ఞాశాలి. అంతర్జాతీయ వేదికలు చట్టసభలతో పాటు పల్లెపట్టున సామాన్య జనం పాల్గొనే సభల్లోనూ అదే వూపుతో మాట్లాడి చప్పట్లు కొట్టించగల సవ్యసాచి.

వీటన్నిటితో పాటు మాకినేని విశిష్టత మరొకటి వుంది. ఆయన గొప్ప చదువరి. సాహిత్యాభినివేశం గల వ్యక్తి. అభ్యుదయ రచయితల ఉద్యమానికి మొదట మార్గదర్శిగా వున్నారు. సంఘసంస్కరణోద్యమ వేగుచుక్క వీరేశలింగం, తెలుగు సాహిత్య వైతాళికుడు గురజాడ అప్పారావుల డైరీలు, లేఖలు రచనలు సేకరించేందుకు వెళ్లిన ప్రతినిధి వర్గంలో ఆయన ఒకరు. మహాకవి శ్రీశ్రీపై కడియాల రామమోహనరాయ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూ చూస్తే ఆయనకు సాహిత్యం పట్ల ఎంత అరుదైన అవగాహన వుందో తెలుస్తుంది. ఇలాటి నేపథ్యం వుంది గనకనే ఎంబి జయంతి సంద ర్భంగా సాంస్కృతిక రంగంలో కమ్యూ నిస్టుల పాత్రపై ప్రసంగం ఏర్పాటుచేయడం సముచితంగా వుంది.

కమ్యూనిస్టు రాజకీయాల గురించి మాట్లాడకుండా సంస్కృతి గురించి మాట్లాడలేం ఎందుకంటే నేను ఇందాక చెప్పిన బాహుబలి ఉదాహరణే మళ్లీ చెప్పాలి. రాజధాని నిర్మాణంలో ఒక పెద్ద దర్శకుడిని భాగస్వామిని చేసి చూపించ డంలో చాలా రాజకీయం వుంది. గోదావరి కృష్ణా పుష్కరాలలో బోయపాటి శీను అనే మరో దర్శకుడు కనిపించారు. గౌతమీపుత్ర శాతకర్ణి తీస్తే అదో రాజకీయమైంది. ఇప్పుడు హైదరా బాదులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహా సభలు తీసుకోండి. తెలంగాణ బాష అన్న పదం వద్దని ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా తెలుగు మహాసభలు జరుపుతున్నారు. గతం లోనైతే తెలుగుతల్లి గురించే వివాదాలు నడిచాయి. అప్పుడు ఉద్రిక్తమైన ట్యాంక్‌బండ్ ఈ సభల కోసం దేదీప్యమానంగా వెలుగు తున్నది. కమ్యూనిస్టు నాయకుడైన వేములపల్లి శ్రీకృష్ణ రాసిన చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా పాటను టిడిపి స్థాపకుడైన ఎన్టీఆర్ తన చైతన్య రథంపై వేసుకుని వూరేగారు. ఆయన దాన్ని హైజాక్ చేశారని అప్పట్లో అనేవారు. ఇంతకూ పీపుల్స్ ఆర్ట్ థియేటర్ పేరిట తీసిన పల్లెటూరు చిత్రంలో ఆ పాటకు అభినయించింది ఎన్టీఆరే కావడం విశేషం. ఆయన లాగే ఇప్పుడు తమిళనాడులో రజనీకాంత్, కమల్ హాసన్ రాజకీయాల్లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. గౌరీ లంకేశ్‌ను దారుణంగా హత్య చేస్తే విలన్‌వేషాలు వేసే ప్రకాశ్ రాజ్ ఖండించారు గాని మన తెలుగు హీరోలెవరూ నోరు మెదిపింది లేదు. పద్మావతి చిత్రం విడుదల కాకముందే నిషేధించాలని దుమారం నడుస్తున్నది. ఆ చిత్రంలో ఏదో కలలో రాణి పద్మినిని కించపర్చే పాట వుందని మరెవరో కల గన్నారట. దాన్ని విడుదల కానివ్వద్దని రభస చేస్తున్నారు. ఇవన్నీ కూడ రాజకీయాలకూ కళలకు వున్న సంబంధం గురించి చెబుతున్న ఉదాహరణలే.

అంతెందుకు? ప్రధాని మోడీ సభల్లో బాబా రాందేవ్, శ్రీశ్రీ రవి శంకర్ వంటివారు ఎందుకు కనిపిస్తారు? తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పూజలూ,పురస్కారాలు, యజ్ఞయాగాలలో ఎందుకు మునిగి తేలుతుంటారు? అంటే పాలకవర్గాలు రాజకీయ ప్రణాళికలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలను కూడా తోడు తెచ్చుకుంటారు. అలాటప్పుడు స్వతహాగా ప్రజలను చైతన్యపరచే కమ్యూనిస్టులు ఈ రంగాన్ని ఎలా అలక్ష్యం చేయగలరు? కమ్యూనిస్టుల పాత్ర లేకుంటే తెలుగు భాషా సాహిత్యాలు ఈ వి ధంగా పురోగమించేవి కావు.

మామూలుగా సాంస్కృతిక పునర్వికాసం, పునరుజ్జీవం వంటి మాటలు వాడుతుంటారు. నేను ఉద్దేశపూర్వకంగానే పురోగమనం అన్న మాట తీసుకున్నాను. ఎందుకంటే. మానవ చైతన్యంలో కళా సాహిత్యాలు విడదీయరాని భాగం. పైగా పాలకవర్గాల ఆధిపత్య భావజాలం వాటిలోనూ అల్లుకుపోయి వుంటుంది. మన దేశంలోనైతే శూద్రులు చదవు కోరాదనే రాదని ఆంక్షలు పెట్టారు. దళితులను మనుషులుగానే చూడలేదు. శ్రమ చేసే వారిని హీనం చేసి ప్రభువులూ పండితులకే పట్టం కట్టారు. ఈ వాతావరణాన్ని ఛేదించి శ్రమజీవులను సంఘటిత పర్చడం, సమరశీలత నేర్పడం కమ్యూనిస్టుల లక్ష్యం. అందుకే వారు భావజాల పరంగానూ ఉద్యమాల వ్యాప్తికోసం కూడా సాంస్కృతిక రంగంపై కేంద్రీకరించారు.

సమాజంలో మార్పుల కోసం పోరాడే శక్తులు పెంపొందడానికి ముందే సాహిత్య రంగంలో ఆ భావాలు గోచరిస్తాయని మనకు ప్రపంచానుభవం చెబుతున్నది. ఉదాహరణకు రష్యా విప్లవం తీసుకుందాం. ఇది అక్టోబరు విప్లవ శతవార్షికోత్సవ సందర్భం. అయితే లెనిన్‌నాయకత్వంలో విప్లవం రావడానికి ముందే రష్యన్ సాహిత్యంలో చెహోవ్, టాల్‌స్టాయ్ వంటి దిగ్గజాలు వెలి శారు. జారు పాలనలోని దురన్యాయాల ఫలితంగా శిథిల మవుతున్న జీవితాలనూ చితికి పోతున్న రైతాంగ పరిస్థితులను గొప్పగా చిత్రించారు. తారు మారవుతున్న మానవ విలువల కోసం అలమటించారు. టాల్‌స్టాయ్ మితవాది అయినప్పటికీ ఆయన రచనలు రష్యన్ విప్లవ ప్రతిబింబం అని లెనిన్‌అన్నారంటే అందుకే. ఆయన రచించిన అన్నా కెరెనినా నవలలో నాయిక అన్నా భూస్వామ్య సమాజపు బూటక విలువలు భరించలేక రైలు కింద పడి చని పోతుంది. అదే మాక్సింగోర్కి నవల అమ్మలో నాయిక నీలోవ్నా బిడ్డల చైతన్యంతో ప్రేరణ పొంది తానూ ముందడుగు వేస్తుంది. అమ్మ అంటే పాత సమాజ ప్రతీక. దాంట్లో పొటమరిస్తున్న నూతన భావజాలాన్ని మొదట రచయితలు అక్షరీకరించారు.

కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుగు సాహిత్య రంగంలోనూ ఇలాటి నూతన భావ విస్ఫోటనం ఒక చారిత్రిక క్రమంగా కనిపి స్తుంది. అది సామ్రాజ్యవాద వ్యతిరేకత అంటే పరాయి పాలనకు వ్యతిరేకంగా మొదలైంది. 20వ శతాబ్ది ఇంకా రాకముందే 1892లో గురజాడ అప్పారావు కన్యాశుల్కం ప్రదర్శన జరిగింది.

" కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుగు సాహిత్య రంగంలోనూ ఇలాటి నూతన భావ విస్ఫోటనం ఒక చారిత్రిక క్రమంగా కనిపి స్తుంది. అది సామ్రాజ్యవాద వ్యతిరేకత అంటే పరాయి పాలనకు వ్యతిరేకంగా మొదలైంది. 20వ శతాబ్ది ఇంకా రాకముందే 1892లో గురజాడ అప్పారావు కన్యాశుల్కం ప్రదర్శన జరిగింది. "


పుచ్చలపల్లి సుందరయ్య


మాకినేని బసవపున్నయ్య


చండ్ర రాజేశ్వరరావు


శ్రీశ్రీ

మరో పదిహేడేళ్లకు దాన్ని సంస్కరించి 1909లో పునర్ముద్రణ చేశారు. భావాల్లోనే గాక భాషలోనూ కొత్త వరవడి పెట్టారు. రాజకీయాల్లో మనం కోరుకునే ప్రజాస్వామ్యం భాషా సాహిత్యాల్లోనూ రావాలని గురజాడ గిడుగుతో కలసి పోరాడారు. 1910లో ముత్యాల సరాలు రాసి దేశభక్తి సందేశమిచ్చారు. ఆ ఏడే శ్రీశ్రీ పుట్టారు. సంఘ సంస్కరణోద్యమ అగ్రగామి వీరేశలింగం ఆ రంగంలో పోరాడుతున్నా భాషాపరమైన మార్పు అవసరాన్ని ఆలస్యంగా గుర్తించారు. గురజాడ దైవభక్తి, రాజభక్తి గాక దేశభక్తిని చాటారు. 1905లో సంస్కర్త వీరేశలింగం శిష్యుడైన చిలకమర్తి లక్ష్మీ నర సింహం 'భరత ఖండంబు చక్కటి పాడియావు..' అని వలస పాలనసారాన్ని చెప్పేశారు. 1906 లో కొమర్రాజు లక్ష్మణ రావు హైదరాబాదులో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని నెల కొల్పారు. ఈ కొత్తగాలులను నిరోధించడం కోసం 1911లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఏర్పడి పురాణ సంప్రదాయాలు, గ్రాంధిక భాషలను కాపాడే ప్రయత్నం చేసింది. మరోవైపున ఆ సమయంలోనే అంటే అచ్చంగా 1911లోనే త్రిపురనేని రామస్వామి చౌదరి కురుక్షేత్రం నాటకం రాసి కులాధిక్యతలకు సవాలు విసిరారు. తాపీ ధర్మారావు కూడా హేతువాద రంగంలో కృషి ప్రారంభించారు. కాలం కడుపుతో వుండి కారల్ మార్క్సును కన్నది అన్నట్టు ఇలాటి చారిత్రిక సన్నివేశంలో 1913లో పుట్టారు పుచ్చలపల్లి సుందరయ్య. మాకినేని బసవపున్నయ్య తర్వాతి ఏడాది 1914లో పుట్టారు. చండ్ర రాజేశ్వరరావు కూడా అప్పుడే పుట్టారు. 1915లో గురజాడ కన్నుమూసినా గిడుగు వ్యవహారిక భాషోద్యమాన్ని గొప్పదీక్షతో కొనసాగించారు. అప్పటికి వీరేశలింగం కూడా గ్రాంధికం వదలిపెట్టి ఈ వైపు మరలారు.

1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. 1921లో చలం శశిరేఖ రాసి సంచ లనం తెచ్చారు. కొడవటిగంటి కుటుంబరావు అప్పుడే రంగంలోకి వచ్చారు. మరోవైపున విశ్వనాథ సత్యనారాయణ కూడా తనదైన సనాతన ఫక్కీలో ముందుకొస్తున్నారు. 1920లలో సాహితీ సమితి అది వరకటి సంఘాల వరవడికి భిన్నంగా కొంత ఆధునికత తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. 1922లో ఉన్నవ మాలపల్లి నవల తొలిసారి బోల్షివిక్ విప్లవాన్నిగురించి తెలుగు సాహిత్యంలో ప్రస్తావించింది. అప్పుడే నార్ల వెంకటేశ్వరరావు నేటి రష్యా రాశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య సోవియట్టులు వ్యాసం వెలువ రించారు. 1920 లలోనే భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి భావకవులు వూహాప్రేయసి కోసం స్వేచ్ఛాగానం చేస్తుంటే మరోవైపున

**❝ 1920 లలోనే భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి భావకవులు వూహాప్రేయసి కోసం స్వేచ్ఛాగానం చేస్తుంటే మరోవైపున గరిమెళ్ల సత్యనారాయణ వంటివారు నిర్బంధాలకూ జంకక స్వాతంత్ర గీతాలాపన చేస్తున్నారు. అత్యంత కీలకమైన 20వ దశకం నాటి దృశ్యం ఇది. ❞**

గరిమెళ్ల సత్యనారాయణ వంటివారు నిర్బంధాలకూ జంకక స్వాతంత్ర గీతాలాపన చేస్తున్నారు. అత్యంత కీలకమైన 20వ దశకం నాటి దృశ్యం ఇది.

ఇక 1930లలో దేశంలోనూ ప్రపంచంలోనూ పరిణామాలు మరింత వేగమందుకున్నాయి. 1933లో శ్రీశ్రీ జయభేరి గీతంతో మహాప్రస్థానం ప్రారంభించారు. శ్రీశ్రీయే తరచూ చెప్పినట్టు ఆకలి దశకంగా చెప్పబడే 30లలో కమ్యూనిస్టుల ఆవిర్భావం ఆయన కవితా ప్రస్థానం ఒకేసారి సంభవించడం యాదృచ్ఛికం కాదని అర్థం చేసుకోవాలి. అప్పుడే జర్మనీలో హిట్లర్ ఫాసిజం పెద్ద బెడదగా తయారైంది. దీనికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగానే శాంతి కాముకులైన రచయితల సమావేశం జరిగింది. అమీర్ హైదర్ ఖాన్ పరిచయంతో సుందరయ్య దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం ప్రారంబించారు. సాహిత్య రంగంలో నవ్య సాహిత్య పరిషత్తు పాత కొత్తల కలయికగా ఏర్పడింది.

1934లో సుందరయ్య నాయకత్వంలో ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తొలి మహాసభ జరిగింది.

సరిగ్గా అదే ఏడాది శ్రీశ్రీ పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి అంటూ మరో ప్రపంచం రాశారు. అంతకు ముందు జయభేరిలో ఆయన ' నేను సైతం భువన భవ నపు బావుటానై పైకి లేస్తాను' అన్నారు గాని మరో ప్రపంచం గేయం ముగింపులో ' కనబడలేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు, హోమజ్వాలల భుగభుగలు, ఎర్రబావుటా నిగనిగలు.' అంటూ అరుణ కాంతులు సందర్శించారు. పోనీ పోనీ పోతే పోనీ సతుల్ సుతుల్ హితుల్ పోనీ.. అంటూ మొదలు పెట్టి కానీ కానీ గానం ధ్యానం హాసం లాసం కానీ కానీ కళారవీ పవీ కవీ అని ముగిస్తాడు. గుండెలలో కొండలలో మార్మోగును హుటాహుటి పరుగెత్తే యుగయుగాల రథనాదం అని అభివర్ణిస్తాడు. ఆ ఏడాది ఆయన రాసిన ప్రతి గేయంలోనూ ఈ నూతన జాగృతి దర్శనమిస్తుంది. చాలా గొప్ప గేయాలు ఆ ఏడే రాశారు.

1934లోనే అమ్మ నవలకు కొవ్విడి లింగరాజు అనువాదం వెలువడింది. 1936 లో తుమ్మల వెంకట్రామయ్య తొలి ఎర్రజండా పాట రాశారు. 1936లో లక్నోలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన అఖిలభారత అభ్యు దయ రచయితల తొలి మహాసభ జరిగింది. తాపీ ధర్మారావు తదితరులు హాజరయ్యారు. కార్మిక సంఘాల స్థాపన ప్రభావంతో వారిని ఉత్తేజపర్చే గీతాలను శెట్టిపల్లి వెంకటరత్నం, పెండ్యాల లోకనాథం వంటివారు రాశారు. అదే సమయంలో లండన్ అభ్యుదయ రచయితల ప్రణాళిక అబ్బూరి రామకృష్ణారావు ద్వారా అందుకున్న శ్రీశ్రీ ప్రజల కోసం నిలబడ తానంటూ పొలాలనన్నీ హలాల దున్నీ ప్రతిజ్ఞ గీతం రాశారు. దిగిరాను దిగిరాను దివి నుండి భువికి అన్న భావకవుల ధోరణికి భిన్నంగా ఆకాశాపు దారులంట హడావుడిగ వెళిపోయే జగన్నాథ రథచక్రాల్ భూమార్గం పట్టిస్తానన్నారు. నా కొరకు చెమ్మగిల్లు నయనమ్ము లేదు అన్న భావకవుల ధోరణిని తోసిపుచ్చి ఏడవకండేడవ కండి అని బాధాసర్పదష్టుల కన్నీళ్లు తుడిచారు. ఇది ఒక కొత్త దశ. మౌలిక మార్పు. జగన్నాథ రథచక్రాల్ అంటూ నాటి శ్రామిక జన ఉద్యమోధృతినీ సాహిత్య సాంస్కృతిక ప్రభంజనాన్ని శ్రీశ్రీ గొప్పగా చిత్రించారు. 1934 తర్వాత 1937లోనే ఆయన మహాప్రస్థాన గీతాలు ఎక్కువగా రాశారు.

**సింహాచలం పగిలింది.. వింధ్యాచలం రగిలింది.. మహానగాలెగురుతున్నాయి**
**నటధూర్జటి నిటలాక్షి**
**పగిలిందట నిటలాగ్ని రగిలిందట**
**అరే ఝూ ఝుటక్ పటక్**
**వచ్చేశాయి వచ్చేశాయి**
**జగన్నాథ జగన్నాథ**
**జగన్నాథ రథచక్రాలు**
**ఈ లోకం మీదేనండి మీ**
**రాజ్యం మేరేలండి**

ఇక పల్లెసీమల్లో అదివరకు స్వాతంత్రోద్యమ ప్రభావంతో స్వరాజ్య భజనావళి, కోలాటాల వంటివి నేర్చుకున్న యువజనులు ఇప్పుడు ఈ ప్రజా కళల ప్రభావంలోకి వచ్చేశారు. 1937లోనే గూడవల్లి రామబ్రహ్మం తీసిన రైతుబిడ్డ, కులతత్వాలను నిరసించిన మాలపిల్ల కూడా ఈ కోవలో తప్పక చెప్పుకోవాల్సినవి. తూర్పుగోదావరి జిల్లా ముంగండలో మహీధర సోదరులు అవంతి ప్రచురణలు ప్రారంభించి ప్రగతిశీలగ్రంధాల అనువాదాలు ముద్రించడం మొదలుపెట్టారు. హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమూ, మద్రాసులో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, గ్రంధాల వ్యాప్తికి బాగా దోహదం చేశాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ 1942లో సోవియట్ పై వైమానిక దాడికి దిగారు. రష్యా అమెరికా బ్రిటన్ ఫ్రాన్స్ మిత్రరాజ్యాలుగా ఏర్పడ్డాయి. అప్పుడే శ్రీశ్రీ తనకు తానే మహా ప్రసిద్ధమైన గర్జించు రష్యా గాండ్రించు రష్యా రాశారు. యుద్ధ స్వభావంలో వచ్చిన మార్పును గురించి కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా ఒక వైఖరి తీసుకోకముందే శ్రీశ్రీ స్పందించడం ఆయన మహామేధకు నిదర్శనమని ఎంబి ఎప్పుడూ అంటుండేవారు. ఆ విధంగా తెలుగు సాహిత్యం అంతర్జాతీయ దశలోకి ప్రవేశించింది. 1943లోనే ప్రజాశక్తి విజయవాడ నుంచి తొలి ప్రముఖ తెలుగు దిన పత్రికగా ప్రారంభమైంది. ఇలాటి రచనలన్నిటికి వేదికగా పనిచేసింది.

కమ్యూనిస్టుపార్టీపై ఈ యుద్ధం కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం నిషేదం ఎత్తివేసింది. ఏర్పడిన నాటినుంచి నిషేదంలోనే వున్న కమ్యూనిస్టులు మొదటిసారి బహిరంగంగా పనిచేసే అవకాశం లభించింది. ఇది ప్రజా ఉద్యమాల పెరుగుదలకే గాక ప్రజా కళల ప్రభంజనానికి కూడా దారి తీసింది. ఎక్కడికక్కడ ప్రగతిశీల సాహిత్యం ప్రజా కళలు జానపద రూపాలు యువజన మహిళా బృందాలు కొత్తవూపిరి పోసుకున్నాయి. పరాయి పాలనలో అణగారి పోతున్న జానపదాలు సంప్రదాయ కళారూ

పాలు కొత్త రూపం సంతరిం చుకున్నాయి. ఆధిపత్య వర్గాల పెత్తనం కుప్పకూలింది. ప్రజాశక్తి పత్రిక ప్రచురణ మొదలైంది. ప్రచురణాలయం మంచి పుస్తకాలు ముద్రించింది. పులుపుల శివయ్య, మాకినేని బసవ పున్నయ్య తదితరులు రాజమండ్రి, విజయ నగరం వెళ్లి కందుకూరి గురజాడల రచనలు తీసుకొచ్చారు. గురజాడ దేశభక్తి గీతాన్ని గొప్పగా ప్రచారంలో పెట్టారు. గురజాడ, వేమన వంటివారి పేరిట ఏర్పడిన యువజన సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామాల స్వరూపమే మార్చేశాయి. శ్రమజీవులకూ, దళితులు తదితర పీడిత వర్గాలకు ప్రజాశక్తి చదివి వినిపించి చైతన్యవంతులను చేశాయి. కాంగ్రెస్ నేతలు స్వాతంత్ర పోరాటం చేస్తున్నా సామాజిక ఆర్థిక సమానతను కోరుకున్నవారు కాదు. గాంధీగారిని కీర్తించడం తప్ప జాతీయ అంతర్జాతీయ రాజకీయాలు చెప్పింది లేదు. కమ్యూనిస్టులు ఆ పనిచేయడం పెద్ద సంచలనమైంది. బ్రిటిష్ వారు తమ ప్రయోజనం కోసం నిషేదం ఎత్తివేసి పనిచేసే స్వేచ్ఛ కల్పిస్తే కమ్యూనిస్టులు ఆ అవకాశాన్ని ప్రజా చైతన్యం పెంచేందుకు ఆయుధంగా చేసుకున్నారు. ప్రజా కళా బృందాలు ఎంతో క్రమశిక్షణతో నేర్చుకుని మరీ ప్రదర్శనలు చేశాయి. ప్రజా నాట్యమండలి నిర్మాత డా.రాజారావు, ప్రజా కవులు సుంకర, వాసిరెడ్డి, బుర్రకథకుడు నాజర్, మిక్కిలినేని, కొడవటిగంటి ఇంకా ఇలాటి వారు అనేకులు కళాయజ్ఞం సాగించారు. వీధిభాగవతం, బుర్రకథ, హరికథ వంటి సంప్రదాయ రూపాలను సామ్యవాద సందేశానికి శాంతి ఉద్యమానికి సాధనంగా చేసుకున్నాయి. చదువురాని వ్యవసాయ కార్మికులు కూడా అంతర్జాతీయ రాజకీయాలు మాట్లాడే అవగాహన పొందారు. ఇదంతా సహించలేకనే పెద్దబాలశిక్ష ఫెయిల్ ప్రజాశక్తి ప్యాస్ అంటూ ప్రత్యర్థులు గేలి చేసేందుకు ప్రయత్నించారు గాని నిజానికి అదే వారి గొప్పతనం.

**స్టాలిన్ గ్రాడు దాక సాగిరానిచ్చినిన్ను ఎర్రసేన చుట్టుముట్టి గొర్ర కోత కోయుచుండ హిట్లరు అబ్బ నా కళ్లు చల్లబడ్డవయ్య హిట్లరు..**

**ఇలాటి పాటలు**


**రాజారావు వేసే హిట్లర్ నృత్యం, సుత్తీ కొడవలి నృత్యం**


**కాంగ్రెస్ ముస్లిం లీగుల రాజకీయాలు చెప్పే సిమ్లా భాగవతం**

**గురజాడ రాసిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ బుర్రకథ..**

**❝ గురజాడ దేశభక్తి గీతాన్ని గొప్పగా ప్రచారంలో పెట్టారు. గురజాడ, వేమన వంటివారి పేరిట ఏర్పడిన యువజన సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామాల స్వరూపమే మార్చేశాయి. శ్రమజీవులకూ, దళితులు తదితర పీడిత వర్గాలకు ప్రజాశక్తి చదివి వినిపించి చైతన్యవంతులను చేశాయి. ❞**


వేమన


గురజాడ


గిడుగు


కందుకూరి

**వేమన పద్యాలు, ఏరన్న రాకముందే ఎరువాక వచ్చెరన్నా వంటి కూలీల పాటలు .. కోలాటాలు బృందగానాలు ఆటల పాటల పోటీలు** ఒకటేమిటి.. అన్నీ వూపేశాయి.

ఇదంతా ఎంత ప్రభావం చూపిందంటే మహామహులు కూడా మారిపోక తప్పలేదు. ఎవ్వరని ఎంతురో నన్ను నేనంత శోక భీకర తిమిర లోకైక పతిని అంటూ శోకించిన కృష్ణశాస్త్రి 1943లో తెనాలిలో జరిగిన మొదటి అభ్యుదయ రచయితల సంఘం సభలకు హాజరై **ఆకాశము నొసట పొడుచు అరుణారుణ తార..ఏకాకి నిశీథినిడుచు తరుణ కాంతి ధార..**అంటూ ఎర్రని పాటలు రాశారు. పుష్పవిలాపం కట్టిన కరుణశ్రీ మా కండలు పిండిన నెత్తురు మీ పెండ్లికి చిలికిన అత్తరు అంటూ వర్గ వ్యత్యాసాలను గానం చేశారు. ఇదో పెద్ద పరిణామం. సంచలనం.విలువలు మార్చేసిన విలయం.ప్రళయం.

ఇదొక గొప్ప సామాజిక వెల్లువే. అప్పటివరకూ ధనవంతులు భూస్వాముల మాటకు ఎదురు లేని పరిస్థితి మారిపోయి శ్రమజీవులు ప్రశ్నించడం, ప్రతిఘటించడం ప్రారంభమైంది. అక్షర జ్ఞానం రాజకీయ పరిజ్ఞానం, శాస్త్ర విజ్ఞానం ఇవన్నీ కళాబృందాలు యువజన మహిళా సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ద్వారా ప్రజలకు అందాయి. గ్రంథాలయాలు, పత్రికా పఠనం ఎంతో మార్పు తెచ్చాయి. హక్కుల కోసం పోరాడ్డం, ఆరోగ్య పరిరక్షణ, నాగరికతతో పాటు ఆటపాటలు నాటకాలు, కళారూపాలు విజృంభించాయి. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలలో సామాజిక దృశ్యమే మారిపోయింది. తాతలనాటి విలువలను యువత ప్రశ్నించింది. మూఢాచారాలను ధిక్కరించింది. వెక్కిరించింది.

**తొలినాటి సంద్రాలు**
**తుహినగిరి శిఖరాలు**
**ఇంకి పోతున్నాయిలే**
**కుంగిపోతున్నాయిలే**
**రాజుకట్టిన కోట**
**రాణి మెట్టిన తో ట**
**భూతాలు గెంతాయిలే**
**బొమికలే మిగిలాయిలే** అని

**పురిపండా అప్పలస్వామి** రాసిన పాట ఇందుకో ప్రతిబింబం. నిజంగానే రాజులు జమీందార్లపైన కూడా తిరుగుబాట్లు మొదలైనాయి. మందసా, చల్లపల్లి, మునగాల తిరుగుబాట్లు ఇందుకు మచ్చు తునకలు. కాంగ్రెస్ రాచరిక వ్యతిరేక పోరాటాలను సమర్థించలేదు. ఇక కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జమిందార్ల ఆధ్వర్యంలో అప్పటి జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతర ఉద్యమం చేసినా, రాజకీయంగా బ్రిటిష్ వారికి, రాచరికాలకు అనుకూలం. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టులే జమిందారీ వ్యతిరేక పోరాటాలకు నాంది పలికారు. చల్లపల్లిలో

**ఇదొక గొప్ప సామాజిక వెల్లువే. అప్పటివరకూ ధనవంతులు భూస్వాముల మాటకు ఎదురు లేని పరిస్థితి మారిపోయి శ్రమజీవులు ప్రశ్నించడం, ప్రతిఘటించడం ప్రారంభమైంది. అక్షర జ్ఞానం రాజకీయ పరిజ్ఞానం, శాస్త్ర విజ్ఞానం ఇవన్నీ కళాబృందాలు యువజన మహిళా సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ద్వారా ప్రజలకు అందాయి.**

వీరనారి ఐయ్యమ్మ గొప్ప ప్రేరణనిచ్చింది. .1944లో విజయవాడలో జరిగిన అఖిలభారత రైతు మహాసభ చరిత్రలో ఒక మైలురాయి. కమ్యూనిస్టుల సమీకరణ, నిర్వహణ శక్తికి మాత్రమే గాక కళాభినివేశానికి కూడా అద్దం పట్టింది.

చల్లపల్లి పోరాటంలో కీలక పాత్ర వహించిన చండ్ర రాజేశ్వరరావు నిజాం వ్యతిరేక పోరాటం రగిలించడం కోసం హైదరాబాదులో రెడ్డిహాస్టల్‌లో మారుపేరుతో చేరి బద్దం ఎల్లారెడ్డి వంటివారిని ప్రభావితం చేశారు. తెలంగాణలో 1944లో ఏర్పడిన ఆంధ్ర మహాసభ వీరి నాయకత్వంలో సమరశీలత సంతరించుకుంది. సంగంగా ప్రజలు పిలుచుకున్న ఈ సంస్థ తరపున పోరాడే వారికి ఆంధ్ర ప్రాంతంలో సైనిక శిక్షణ ఇచ్చారు. 1946లో అభ్యుదయ రచయితల సాహిత్య పాఠశాల పెదపూడిలో జరిగింది. హేమాహేమీలు పాల్గొని దిశా నిర్దేశం చేశారు. నవ్యసాహిత్య పరిషత్తు లోని పెద్దలు చాలా మంది అభ్యుదయ మార్గం తొక్కారు. సరిగ్గా అదే 1946 జులై 4న దొడ్డి కొమరయ్య అమరత్వంతో తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభ మైంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నేపథ్యంలో ఈ ప్రజా కళా ఉద్యమం మొత్తం ఆ సాయుధ పోరాటానికి సంఘీభావంగా మరో చరిత్ర సృష్టించింది.

# తెలంగాణాలో పోరాటాలు

(9వ పేజీ తరువాయి)

కులాలకు రాజకీయ అధికారం అనే అస్థిత్వ వాదనపట్ల స్పష్టంగా ఉంటూనే అటువంటి సంస్థలు పార్టీతో కలిసి వస్తున్నప్పుడు ప్రజాస్వామ్య పోరాటంలో వారిని కలుపుకొని పోవాల్సి ఉంటుంది.

అంబేద్కర్, పూలేలు భారతదేశంలో గొప్ప సంఘ సంస్కర్తలు. జీవితాంతం కులవ్యవస్థ, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు. వారిని పాలకవర్గాలు తమలో కలుపుకోవటానికి, వారి కృషిని వక్రీకరించటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ ప్రమాదం నుండి వారి ఆశయాలను కాపాడాలి. వారి ఆశయాల కోసం కృషిజేసే వారితో ఐక్యత సాధించటం, కలిసి పనిజేయటం ప్రజాస్వామిక పోరాటంలో కీలకమైనది. దేశాన్ని హిందూత్వవాదులు పాలిస్తూ, ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న నేపథ్యంలో ఇది మరింత అవసరం. అయితే వీరి సిద్ధాంతాలకున్న పరిమితులు పార్టీ గమనంలో ఉండాలి.

**రైతు ఆత్మహత్యలపై బస్ యాత్ర**

వామపక్షాల రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో రైతాంగ ఆత్మహత్యలపై రాష్ట్ర వ్యాప్తంగా బస్‌యాత్ర జరిగింది. తద్వారా రైతాంగ సమస్యలను ప్రజల్లో, ప్రభుత్వంలో చర్చనీయాంశం చేయగలిగింది. ఆ తర్వాతనే ప్రభుత్వం ఆత్మహత్య జరిగిన కుటుంబాలకు రు. 6లక్షల సహాయం పథకాన్ని ప్రకటించి అమల్లోకి తెచ్చింది.

**శృతి, సాగర్ ఎన్‌కౌంటర్‌లపై**

తాడ్వాయి అడవుల్లో శృతి, సాగర్ (మావోయిస్టులు)లను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి దారుణంగా చంపటం రాష్ట్రంలో సంచలనం కలిగించింది. ఈ సమస్యపై వామపక్షాలు, మావోయిస్టు ప్రజాసంఘాలు కూడా కలిసి నిరసన కార్యక్రమాలు చేసాయి. చలో అసెంబ్లీ పిలుపు ఇవ్వబడింది. ప్రజల్లో పెద్ద స్పందన వచ్చింది. దాదాపు 5వేల మందికి పైగా అరెస్టు అయ్యారు. రాష్ట్ర బంద్‌కూడా పాటించబడింది.

**కార్మిక పోరాటాలకు మద్దతుగా**

మున్సిపల్ కార్మికుల 40రోజుల దీర్ఘ సమ్మెకు మద్దతుగా రాష్ట్రవ్యాప్త బస్‌యాత్రతో సహా వామపక్షాలు ఐక్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహించాయి. నిరవధిక నిరాహార దీక్షల్లో కూడా రాష్ట్ర వామపక్షాల ముఖ్యనాయకులే కూర్చున్నారు. ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్త రాజకీయ ప్రభావం కలిగించాయి.

**ఏప్రిల్ 2015 వామపక్ష రైతు సంఘాల ఐక్యవేదిక**

వామపక్ష రైతు సంఘాల ఐక్యవేదిక ఏర్పడటంలో పార్టీ చొరవే కీలకం. జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షులుగా ఏర్పడిన ఈ వేదిక ఆత్మహత్యలు, గిట్టుబాటు ధరలు వగైరా రైతాంగ సమస్యలపై అనేక కార్యక్రమాలు నిర్వహించింది.

**ధర్నాచౌక్ ఉద్యమం**

గత రెండు దశాబ్దాలుగా రాష్ట్ర రాజధానిలో ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ కేంద్రంగా అనేక ప్రజా ఆందోళనలు, పోరాటాలు జరిగాయి. తెలంగాణా వచ్చాక దానిని ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి నిరసనగా సుదీర్ఘ ఆందోళన పోరాటాలు వామపక్షాలు ఇతరుల ఆధ్వర్యంలో నడిచాయి. 40 రోజుల పాటు దీక్షలు, ప్రదర్శనలు, అనేక ఇతర కార్యక్రమాలు నడిచాయి. దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్‌లో కూడా ఒక రోజు ధర్నా చేసారు. అయినా ప్రభుత్వం దిగిరాలేదు. 2017 మే 15న ఆక్యుపై ధర్నాచౌక్ పిలుపుకు వేలాదిమంది తరలి వచ్చారు. పోలీసు బారికేడ్లను ఛేధించుకుని ధర్నాచౌక్ ఆక్రమించారు. ఈ పోరాటంలో పార్టీ ముఖ్యపాత్ర వహించింది. 20మంది వరకు పార్టీ కార్యకర్తలు, నాయకులు గాయపడ్డారు.

ఈ మూడేండ్ల కాలంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. ముఖ్య మైన ప్రతి సందర్భంలో ఐక్యంగా పత్రికా ప్రకటనలు ఇవ్వటం, ప్రెస్‌మీట్‌లు నిర్వహించటం జరిగింది. టీఆర్‌ఎస్‌కు గత పాలక ప్రభుత్వాలు ప్రత్యామ్నాయం కావు, బిఎల్‌ఎఫ్ మాత్రమే ప్రత్యామ్నాయమని సీపీఐ(ఎం) తీసుకున్న రాజకీయ విధానంతో సిపిఐ ప్రస్తుతానికి రాష్ట్రంలో కలిసిరావటం లేదు. రానున్న కాలంలో బిఎల్‌ఎఫ్‌లో సీపీఐని కూడా భాగస్వామ్యం చేయటానికి సీపీఐ(ఎం) అన్ని ప్రయత్నాలను చేస్తుంది.

----

# సోవియట్ యూనియన్‌లో సామాజిక భద్రత

సోవియట్ యుగంలో జీవించిన సామాన్య ప్రజలకు సోవియట్ యూనియన్ జ్ఞాపకాలు అంటే, '1 డాలర్‌కు 76 కోపెక్కులు', 'అత్యంత శక్తివంతమైన సైనిక శక్తి', లేదా 'సర్వ శక్తివంతమైన కె.జి.బి' కాదు. మా సైన్యం మీదా, మా కె.జి.బి. మీదా మేము ఆధారపడవచ్చుననీ, అవి మమ్మల్ని రక్షిస్తుంటాయనీ, మాకు తెలుసు. సోవియట్ యూనియన్ లో జీవించిన సామాన్య మానవునికి డాలర్ ఎలా ఉంటుందో తెలియదు. సోవియట్ యూనియన్ జి.డి.పి. గురించీ, బ్రహ్మాండమైన పరిశ్రమల గురించీ, లేదా ఆర్థిక ప్రగతి గురించీ, మేము ఆలోచించే వాళ్ళం కాదు. మేము మరోలా ఆలోచించేవాళ్ళం, మరో కోణం నుంచి చూసే వాళ్ళం.

**సోవియట్ యూనియన్:**

మీ నగరంలో, రాత్రి కాని, పగలు కాని, ఏ సమయంలో నైనా, నువ్వు వీధుల్లో నడుస్తున్నప్పుడు, ఒక్క చెడు మాట కూడా వినవు. నీ మీద ఏ రకమైన దాడి జరుగదు. మొదటి అంతస్తు కిటికీలకు ఇనప ఊచలా? నువ్వు పిచ్చాడులా ఉన్నావు. అపార్టుమెంటు అంటే జెయిలు గది కాదు. అపార్టుమెంటు భవన ప్రవేశ ద్వారానికి మెటల్ తలుపులా? ఇది కేవలం ఒక పిచ్చి పని. సెల్లార్లూ, అటకలూ, అపార్టుమెంటు భవనాలకు దారులూ ఎప్పుడూ తెరిచి ఉండేవి. అక్కడ నెత్తిమీద కప్పులేని వారు, మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు ఉండేవారు కారు.

నీ అపార్టుమెంటు కాంప్లెక్సు ఆవరణలో నీ దుస్తులను ఆరవేసినప్పుడు, ఆ దుస్తులు దొంగిలిస్తారని కాని, పాడు చేస్తారని కాని నువ్వు ఆలోచించనే ఆలోచించవు. ఎందుకంటే నీ జీవిత కాలంలో అటువంటి సంఘటనలు జరుగలేదు. మీ కాంప్లెక్సులో 300 కంటే ఎక్కువ అపార్టుమెంట్లున్నా అందరూ నీకు వ్యక్తిగతంగా తెలిసే ఉంటారు. అనుకోకుండా నీ దగ్గర అగ్గి పెట్టె లేకపోయినా, ఉప్పు లేకపోయినా, నువ్వు ఎవరినైనా ఆపు చేసి నిస్సంకోచంగా అడగవచ్చు. రెండో ప్రపంచ యుద్ధంలో పోరాడిన వ్యక్తి సిటీ బస్సులోకి అడుగు పెట్టగానే, ప్రయాణీకులలో సగం మంది తమ సీట్ల నుంచి లేచి, అతనికి కాని ఆమెకు కాని, తమ సీటు ఇస్తారు. అటువంటి వారు స్టోరులో అడుగు పెట్టగానే, జనం లైనులో వారికి చోటిస్తారు.



సోవియట్ యూనియన్ లో ఆటపాటలతో విద్యాభ్యాసం

పెద్ద స్టోర్లు, నేటి సూపర్ మార్కెట్లలా పని చేస్తుండేవి. నువ్వు నీ తోపుడు బండిలో సామాను పెట్టుకుని, బయటకు వెళ్ళిపోవచ్చు. స్టోరును జైలులా చేస్తూ, ప్రతి మూలా సెక్యూరిటీ కెమెరాలుండేవి కావు, సెక్యూరిటీ గార్డులుండేవారు కారు. బయటికు వెళ్ళడానికి ఒక దారి కాక అనేక దారులుండేవి. కాని జనం షాపుల నుంచి వస్తువులను దొంగిలించేవారు కారు. ప్రతి మూలా మినరల్ వాటర్ ఇచ్చే సోడా మెషీన్లుండేవి. అక్కడ ఎప్పుడూ గ్లాసులుండేవి. టెలిఫోను బూత్‌లలో ఫోను బుక్కులుండేవి. ఇప్పుడు అక్కడ ఫోను బుక్కులు ఎంతకాలం ఉంటాయి? ఉన్నత ప్రమాణాలు గల ఉచిత విద్య అందరికీ అందుబాటులో ఉండేది. ప్రపంచంలో మరే దేశంలోనూ, ఎన్ని లక్షల డాలర్లు చెల్లించినా, అటువంటి విద్య లభించదు. మా దేశంలో వేము ఉచితంగా పొందాం. దానితో పాటు గ్యారంటీగా ఉద్యోగం కూడా దొరికేది. అన్ని రకాల విభాగాలూ ఉన్న క్రీడా క్లబ్బులు, జిమ్‌లలోకి ప్రవేశం ఉచితం. పిల్లలకు ఉచిత వేసవి క్యాంపులు, ఉచిత ఆరోగ్య 'స్పా'లు ఉండేవి. మీ ప్రాంతంలో క్లినిక్‌కు మీరు వెళ్ళినప్పుడు, మీ డాక్టరు మీ ఆరోగ్యంలో చిన్న సమస్యలున్నాయని గమనించి, మీరు కోలుకోవాలని ఆరోగ్య కేంద్రానికి, ఉదాహరణకు, క్రిమియా కు, పంపించినప్పుడు, మీకు అంతా ఉచితమే.

అప్పుడు ఉత్తర కకాసస్ లో టెర్రరిస్టులు ఉండేవారు కారు, మత్తు పదార్థాలు ఉండేవి కావు. ప్రపంచంలోనే ఉత్తమమైన ఆరోగ్య కేంద్రాలూ, మినరల్ వాటరూ ఉండేవి. యుక్రెయిన్‌లో, స్వస్తికా గుర్తులతో నాజీలుండేవారు కారు. విమానాలు, టాంకుల పరిశ్రమలు ఉండేవి. పరిశుభ్రమైన నగరాలు ఉండేవి. సంతోషంగా ఉండే ప్రజలుండేవారు. బాల్టిక్ రాజ్యాలు, హై ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్, రేడియో టెక్నాలజీ, వాహనాలనూ, ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన బాల్సాం తైలాన్నీ, తయారు చేసేవి.

> ❝ నీకు పెళ్ళయినప్పుడు ఒక బెడ్‌రూం ఉన్న అపార్టు మెంటు ఉచితంగా దొరికేది. నీకు బిడ్డ పుట్టినప్పుడు, ఆ అపార్టుమెంటుకు బదులు రెండు బెడ్‌రూంలున్న అపార్టుమెంటు దొరికేది. నీ కుటుంబం పెరిగిన కొలదీ (సాధారణంగా ముగ్గురు, నలుగురు బిడ్డలు) నీ అపార్టుమెంటు కూడా పెరిగేది. ❞




సోవియట్ లో అందరికి వైద్యసేవలు ఉచితం

అక్కడ చాలా ఎక్కువ జీతం దొరికే ఉద్యోగాలుండేవి. సోవియట్ యూనియన్ ప్రమాణాలతో పోల్చి చూసినా అద్దంలా ఉండే వీధులుండేవి. ఇప్పుడు ఈ దేశాలలో, మాజీ యస్.యస్. (నాజీ) మిలీషియాలున్నాయి. యువ జనాభాలో సగం మంది యూరోపులో టాయిలెట్లు శుభ్రం చేసే పనిలో ఉన్నారు. .దారి తప్పిన బిడ్డ ఎదురైనప్పుడు, పోలీసు ఆఫీసరు ఆమెను తల్లిదండ్రుల వద్దకు తీసుకుపోయి, వాళ్ళకు అప్పగించి, సెల్యూట్ చేసి వెళ్ళేవాడు. అతను గౌరవనీయుడైన సోవియట్ ఆఫీసరు కాబట్టి అలా ప్రవర్తించే వాడు కాని పదవిలో పైకెదగాలని కాదు.ఒక యువకుడు, వీధుల్లో ఒంటరిగా ఉన్న ఒక పిల్లకాని, పిల్లవాడి దగ్గరకు కాని వెళ్ళి, ఆ బిడ్డకు అవసరమైతే, సహాయం చేసేవాడు. ఈ రోజు అలా ఒక యువకుడు వీధుల్లో ఒంటరిగా ఉన్న బిడ్డ దగ్గరకు వెడితే, అతన్ని పిల్లల మీద లైంగిక అత్యాచారం చేసే వ్యక్తి అనే ఆరోపణతో, జనం బ్రతికుండగానే తినేస్తారు. ప్రతీ మూడో కుటుంబం, ఇంటి తాళాలు, తలుపు పక్కన, రగ్గు కింద వదిలేసేది, కాని దొంగతనాలు ఉండేవి కావు. చాలా అరుదుగా, ఎప్పుడైనా, ఎవరి టి.వి. అయినా దొంగిలించబడితే, మరుసటి రోజే ఆ దొంగ జైలులో ఉండేవాడు. అనేక నెలల పాటు నగరంలోని లక్షమంది జనాభా ఈ దొంగతనం గురించి మాట్లాడుతుండేవారు.

నీకు పెళ్ళయినప్పుడు ఒక బెడ్‌రూం ఉన్న అపార్టుమెంటు ఉచితంగా దొరికేది. నీకు బిడ్డ పుట్టినప్పుడు, ఆ అపార్టుమెంటుకు బదులు రెండు బెడ్‌రూంలున్న అపార్టుమెంటు దొరికేది. నీ కుటుంబం పెరిగిన కొలదీ (సాధారణంగా ముగ్గురు, నలుగురు బిడ్డలు) నీ అపార్టుమెంటు కూడా పెరిగేది. రెండు బెడ్‌రూంల అపార్టుమెంటు బదులు మూడు బెడ్‌రూంల అపార్టుమెంటు దొరికేది. తనఖా! అంటే అర్థం ఏమిటి? సోవియట్ ప్రజలకు పరిచయం లేని ఏదో విదేశీ పదమై ఉంటుంది. లేదు, ఈ మాట మేం ఎప్పుడూ వినలేదు. దీనర్థం మాకు తెలియదు. ఉత్తమ చలన చిత్రాలూ, టీవీలో బోధనాత్మక కార్యక్రమాలూ ఉండేవి. శవాల గుట్టలూ, రక్త ప్రవాహాలూ, పిరమిడ్ స్కీం లూ, రబ్బరు బొమ్మల్లాంటి వేశ్యలూ, నడుం కింద విషయాల గురించి హాస్యోక్తులూ ఉండేవి కావు.

ఒక ఆరు నెలల పాటు మీరు స్టోరుకు వెళ్ళి ఉండకపోవచ్చు, కాని ధరల గురించి మీకు తెలిసే ఉంటుంది. ఆరు నెలల క్రితం బ్రెడ్ 24 కోపెక్కులుంటే, ఈ రోజు కూడా 24 కోపెక్కులే ఉండేది. ఆగండి, నేను తప్పు చెప్పాను. ఇప్పుడు 22 కోపెక్కులుండవచ్చు. ప్రతి వసంతకాలంలోనూ మీకు అందే జీతం పెరిగేది. మీరు ఒక పుస్తకంలో ఒక రూబుల్ పెట్టి మరచిపోయి, పది సంవత్సరాల తర్వాత చూసి బయటికి తీస్తే, ఆ కాగితం ఒక చెత్త కాగితంగా కాక ఇంకా రూబుల్ గానే ఉండేది. బహుశా పదేళ్ళ తర్వాత రూబుల్ విలువ పెరిగి ఉండేది కూడా. సోవియట్ యూనియన్‌లో నిత్యం కనిపించే ప్రకటనలలో ఒకటి ఇలా ఉండేది: 'మీ సొమ్మును బ్యాంకులో ఉంచండి'. బ్యాంకులకు బదులు తలగడా క్రింద కూడా ఉంచవచ్చు. సోవియట్ ప్రజలకు, ద్రవ్యోల్బణ భయం, దొంగల భయం ఉండేవి కాదు.

ఈ రోజుల్లో బ్యాంకర్‌ను గౌరవించినట్లు, అప్పుడు స్టీల్ ఫౌండర్‌నూ, ధ్రువ ప్రాంతాలకు విమాన యాత్రలు చేసిన పైలట్లనూ గౌరవించేవారు. 'గేంగ్ స్టర్' అనే పదాన్ని, 1990ల నాటి రష్యాలో పలికినట్లు, ఉద్రిక్తతతోనూ, ఆరాధనతోనూ కాక సోవియట్ యూనియన్‌లో తిరస్కారపూరితంగా, అసహ్యంతో ఉచ్చరించేవారు. సోవియట్ చెవికి 'టెర్రరిస్ట్' అనే పదం, 'మరో నక్షత్ర మండలం నుంచి వచ్చిన, మూడు కన్నుల దుష్టశక్తి ఆక్టోపస్'లా వినిపించేది. స్కూళ్ళలో సెక్యూరిటీ గార్డులు అన్న విషయాన్ని ఎవరూ ఊహించగలిగే వారు కారు. అత్యంత భయానకమైన పీడకలలో కూడా ఇటువంటి జీవితాన్ని మేం ఊహించలేదు. స్కూలులో చాలా స్ట్రిక్టుగా ఉండే వ్యక్తి, బహుశా గేటు దగ్గర ఉండే వ్యక్తి. ఒక విద్యార్థి 'ప్రిన్సిపాల్ ను కలవడం' అంటే 'కోర్టు మార్షల్' లా ఉండేది.

సోవియట్ యూనియన్‌లో నివసించని వారికి ఇదంతా ఎలా నేను వివరించగలను? ఒక విశ్వసనీయమైన, భద్రతతో కూడిన, మిమ్మల్ని సంతోషంగా ఉంచే ప్రదేశాన్ని ఊహించండి – మీ నర్సరీ, బహుశా గ్రామంలో మీ అమ్మమ్మ గారి ఇల్లు. ప్రతి వారికీ తనకు ఇష్టమైన ప్రదేశం ఉంటుంది. అలా ఊహించుకున్నారా? విశాలమైన మా దేశంలో ఏ ప్రదేశంలోనైనా మేం అలా ఉండేవాళ్ళం.

**(రష్యన్ వాయిసెస్ పోస్ట్ నుండి)**

**అనువాదం: తోలేటి జగన్మోహనరావు**

# యఫ్ఆర్‌డిఐ బిల్లుతో ప్రమాదాలు

ఎ కోటిరెడ్డి



రచయిత
ప్రజాశక్తి సహాయసంపాదకులు

**య**ఫ్ఆర్‌డిఐ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రతిపక్షాల వత్తిడితో బిల్లును పార్లమెంటు జాయింట్ సెలెక్ట్ కమిటీకి పంపించింది. బిల్లు పార్లమెంట్ జాయింట్‌సెలెక్ట్ కమిటి వద్ద ఉండగానే బిల్లులో ఉన్న అంశాలు బ్యాంకులు, బీమా, ఇతర ప్రభుత్వ సంస్థలలో ప్రజలు దాచుకున్న డబ్బుకు రక్షణ లేకుండా పోతుందని విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ప్రజలను మభ్యపెట్టటం కోసం ప్రభుత్వం అసత్యాలను ప్రచారం చేస్తున్నది. ఈ బిల్లును చట్టంగా చేయటం వలన డిపాజిట్‌దారుల డబ్బుకు ఎటువంటి ప్రమాదం ఉండదని,ద్రవ్యవ్యవస్థ నిర్వహణ మెరుగుపడుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. కాని బిల్లులో ఉన్న 'బెయిల్ ఇన్' క్లాజ్ ప్రభుత్వం చెబుతున్న మాటలపై ప్రజలకు విశ్వాసం లేకుండా చేస్తున్నది. తమ శ్రమను ధారబోసి సంపాదించుకున్న డబ్బు అవసరాలకు ఉపయోగపడుతుందని బ్యాంకులలో దాచుకుంటే ఆ మొత్తాన్ని కోల్పోతామేమోననే భయం ప్రజలను వెంటాడుతున్నది. మోడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఎటువంటి హెచ్చరికలు లేకుండానే మోడి 2016 నవంబరులో పెద్దనోట్ల రద్దును ప్రకటించటం, తాము బ్యాంకులలో దాచుకున్న నగదును తీసుకోవటానికి పడిన అష్టకష్టాల జ్ఞాపకాలు ప్రజలను వెంటాడుతున్నాయి.నోట్లరద్దు లక్ష్యాలను అపహాస్యం చేస్తూ మోడి రోజూ కొత్త లక్ష్యాలను గురించి చేసిన ప్రకటనలు ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని వమ్ముచేశాయి. అందువలన యఫ్ఆర్‌డిఐ బిల్లులో ఉన్న బెయిల్ ఇన్ క్లాజు వలన ప్రజల డిపాజిట్లకు ఎటువంటి ప్రమాదం ఉండదని ప్రభుత్వం ఎంతగా హామీలిస్తున్నా ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరు.

### యఫ్ఆర్‌డిఐ చట్టం ప్రభుత్వ ద్రవ్యసంస్థలను దెబ్బతీస్తుంది

మోడి ప్రభుత్వం తీసుకురానున్న యఫ్ ఆర్‌డిఐ చట్టం ప్రభుత్వరంగంలోని ద్రవ్యసంస్థలైన జాతీయ, ప్రాంతీయ బ్యాంకులు, కో ఆపరేటివ్ బ్యాంకులు, బీమా, సహకార సంస్థలు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్లు తదితరాలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీయటానికి, ప్రజల కష్టార్జితాన్ని బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టటానికి ఉద్దేశించినది. సరళీకరణ ఆర్థిక విధానాల అమలులో ఒక భాగమైన ద్రవ్యరంగ సరళీకరణ పాలకులు ఊహించినంత వేగంగా జరగటం లేదు. దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ప్రజలకు నిరంతరం సేవ లందిస్తూ, వారి విశ్వాసాన్ని పొందాయి. తమ ఇంట్లో దాచుకున్న డబ్బుకైనా దొంగల భయం ఉంటుంది. కాని బ్యాంకులు, ప్రభుత్వ ద్రవ్యసంస్థలలో దాచుకున్న ధనానికి ఎటుకంటి ప్రమాదం లేదని, తాము ఎప్పుడు కోరుకుంటే అపుడు తమ ధనాన్ని వెనక్కు తీసుకోవచ్చునని ప్రజలకు నమ్మకం ఉంది. ప్రభుత్వరంగంలోని ద్రవ్యసంస్థల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉన్నది కాబట్టి ఈ రంగంలో ప్రైవేటు సంస్థలు ఆశించినంత అభివృద్ధిని సాధించ లేకపోయాయి.. గతంలో కాంగ్రెస్, బిజెపి నాయకత్వంలోని యుపిఎ, యన్‌డిఎ ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వరంగంలోని ద్రవ్యసంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయటం,సాధ్యం కాలేదు. ద్రవ్యరంగాన్ని పూర్తిగా సరళీకరించటంలో ప్రభుత్వాలు విజయం సాధించలేకపోయాయి. ద్రవ్య రంగంలో సరళీకరణ విధానాల అమలులో భాగంగా ప్రైవేటు బ్యాంకులు, బీమాసంస్థల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఫలితంగా ఆయా రంగాలలో ప్రైవేటు సంస్థలు ఏర్పడ్డాయి. కాని అవి వారాశించిన విధంగా అభివృద్ధిని సాధించలేకపోయాయి. ప్రైవేటు బ్యాంకుల ఏర్పాటుకు అనుమతించి రెండు దశాబ్దాలు దాటినా నేటికీ మొత్తం డిపాజిట్లలో వాటి వాటా 18 శాతం దాటలేదు.63 శాతం డిపాజిట్లు ప్రభుత్వరంగ బ్యాంకులలోనే ఉన్నాయి. ప్రభుత్వరంగ బీమాసంస్థ యల్‌ఐసి మార్కెట్ వాటా71.07 శాతం, జిఐసి వాటా 55 శాతానికి పైగా ఉన్నది. 2017లో యల్‌ఐసి లాభాలు 27 శాతానికి, జిఐసి లాభాలు 80 శాతానికి పైగా పెరిగాయి. ప్రభుత్వరంగంలోని ద్రవ్యసంస్థలపై ప్రజలకున్న నమ్మకమే అందుకు కారణం. ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తేనే ప్రజలు ప్రైవేటు బ్యాంకులు, ద్రవ్యసంస్థల వైపు మళ్ళుతారని కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు భావిస్తున్నాయి. వారి మనోభీష్టానికి అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

### పెద్దనోట్ల రద్దుతో సడలిన విశ్వాసం

2014 సంవత్సరంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సరళీకరణ ఆర్థిక విధానాల అమలును వేగవంతం చేసింది. అందులో భాగంగా ద్రవ్యవ్యవస్థను సరళీకరించటానికి అనేకచర్యలు తీసుకున్నది. పెద్దనోట్ల రద్దు ఆ దిశలో తీసుకున్న ప్రధాన చర్య. పెద్దనోట్ల రద్దును ప్రకటిస్తూ ప్రధాని చేసిన ప్రసంగంలో నల్లధనాన్ని వెలికితీయటం, అవినీతిని అరికట్టటం, నకిలీ కరెన్సీ చలామణిని నిరోధించటం, ఉగ్రవాదాన్ని అరికట్టటం లక్ష్యాలుగా ప్రకటించాడు. ఆ తర్వాత రోజునుండి లక్ష్యాలను మార్చటం ప్రారంభించాడు. కరెన్సీ నోట్లు ఎక్కువగా చలామణి కావటం వలన అవినీతి పెరిగిపోతున్నదని, అవినీతిని అరికట్టాలంటే నోట్ల చలామణి తగ్గాలని, డిజిటల్ చెల్లింపులకు ప్రజలు మరలాలని ప్రచారం ప్రారంభించాడు. రద్దుచేసిన నోట్లు మొత్తం ఖజానాకు తిరిగివస్తాయని నవంబరు చివరికే స్పష్టమైంది. దానితో రకరకాల అంశాలను

**“ స్వాతంత్ర్యానంతరం మొదటి సారిగా ప్రభుత్వ ద్రవ్యసంస్థలపై ప్రజల విశ్వాసం సడలటానికి పెద్దనోట్ల రద్దు కారణమైంది. ఇపుడు తీసుకొస్తున్న యఫ్‌ఆర్‌డిఐ చట్టం ప్రభుత్వ ద్రవ్యసంస్థలపై విశ్వాసాన్ని పూర్తిగా వమ్ముచేయటంతో పాటు వాటిలో డబ్బు దాచుకోవటం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితిని కల్పిస్తుంది. ”**



**నోట్లరద్దు సందర్భంగా బ్యాంకుల వద్ద డబ్బుకోసం గుమికూడిన ప్రజలు**

ముందుకు తెస్తూ ప్రజలను మభ్యపెట్టటానికి ప్రధాని ప్రయత్నించాడు. పెద్దనోట్ల చలామణి వలన అవినీతి పెరుగుతున్నదని, దానిని అరికట్టటానికి 500, 1,000 రూపాయల నోట్లను రద్దుచేస్తున్నామని చెప్పి, 2,000 రూపాయల నోట్లను తీసుకు రావటం విమర్శలకు దారితీసింది. దానితో త్వరలోనే 2,000 రూపాయల నోట్లను రద్దుచేస్తామని ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం 2,000 రూపాయల నోట్ల ముద్రణను నిలిపివేశామని రిజర్వుబ్యాంకు ప్రకటించింది. ఈ విధమైన ప్రకటనలు ప్రభుత్వ ద్రవ్య విధానం పట్ల ప్రజలలో అనుమానాలను పెంచాయి. స్వాతంత్ర్యానంతరం మొదటి సారిగా ప్రభుత్వ ద్రవ్యసంస్థలపై ప్రజల విశ్వాసం సడలటానికి పెద్దనోట్ల రద్దు కారణమైంది. ఇపుడు తీసుకొస్తున్న యఫ్‌ఆర్‌డిఐ చట్టం ప్రభుత్వ ద్రవ్యసంస్థలపై విశ్వాసాన్ని పూర్తిగా వమ్ముచేయటంతో పాటు వాటిలో డబ్బు దాచుకోవటం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితిని కల్పిస్తుంది. అందువలననే యఫ్‌ఆర్‌డిఐ బిల్లును గురించిన చర్చ తీవ్రమై, లోపాలు బయటపడుతున్న కొద్దీ ప్రజలు బ్యాంకులలో డిపాజిట్ చేసే మొత్తాలు తగ్గిపోతున్నాయి. బ్యాంకుల నుండి డబ్బు తీసుకోవటం మినహా తిరిగి జమచేయటానికి ప్రజలు సిద్ధం కావటం లేదు.

బిజెపి పూర్తి మెజారిటీతో అధికారంలో ఉండటంతో సరళీకరణ ఆర్థిక విధానాల అమలులో ప్రధానాంశమైన ద్రవ్యవ్యవస్థ సరళీకరణను మరింత వేగవంతం చేయటానికి పూనుకున్నది. అందులో భాగంగానే యఫ్‌ఆర్‌డిఐ చట్టం చేయటానికి ప్రయత్నిస్తున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ద్రవ్య సంస్కరణల అమలును వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నది. 2008లో అమెరికాలో గృహరుణ సంక్షోభం వచ్చిన తర్వాత ఈ డిమాండ్ మరింత ఊపందుకున్నది. గృహరుణ సంక్షోభం అమెరికాలో ప్రారంభమై ప్రపంచంలోని అన్నిదేశాలకు విస్తరించింది. సంక్షోభంలో చిక్కుకున్న బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థలను ఒడ్డున పడేయటానికి ఆయా దేశాలలోని ప్రభుత్వాలు వాటికి ‘బెయిల్ అవుట్’ ఇచ్చాయి. అంటే పన్నుల ద్వారా ప్రజలు చెల్లించిన ధనాన్ని ప్రభుత్వాలు బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థలకు ఉచితంగా–బెయిలవుట్– ఇచ్చాయి. దానితో బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థలు సంక్షోభం నుండి బయటపడ్డాయి. ద్రవ్యసంస్థల రుణం ప్రభుత్వాల రుణంగా మారటంతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రభుత్వాలు దానినుండి బయటపడటానికి మార్గాలను అన్వేషించటం కోసం ద్రవ్య స్థిరత్వ సంస్థ (ఫైనాన్షియల్ స్టెబిలిటి బోర్డ్) ను ఏర్పాటు చేశాయి. ప్రభుత్వ ధనాన్ని వినియోగించకుండా ఆయా ద్రవ్యసంస్థలలో ఉన్న ప్రజల ధనాన్ని ఉపయోగించటం ద్వారా సంక్షోభంలో ఉన్న ద్రవ్యసంస్థలకు ‘బెయిల్ ఇన్’ ఇచ్చే విధానాన్ని అమలుచేయాలని ఫైనాన్షియల్ స్టెబిలిటి బోర్డ్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను జి 20 దేశాల సమావేశంలో ఆమోదించారు. జి 20 దేశాల గ్రూపులో మనదేశం కూడా సభ్యురాలుగా ఉంది. అయినా ప్రజా వ్యతిరేకతకు జడిసి గతంలో కాంగ్రెస్ నాయకత్వంలో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం దీనిని అమలు చేయటానికి సాహసించలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశభక్తి ముసుగు వేసుకొని, ప్రజాధనాన్ని హరించే ‘బెయిల్ ఇన్’ ను అమలుచేయటానికి పూనుకున్నది.

**బెయిల్ ఇన్ అంటే ఏమిటి**

యఫ్‌ఆర్‌డిఐ బిల్లులో ఉన్న బెయిల్ ఇన్ క్లాజు ప్రజల డబ్బును పెట్టుబడిదారులకు కట్టబెట్టటానికి దోహదం చేస్తుంది. సాధారణ ప్రజలు భద్రత ఉంటుందనే అభిప్రాయంతో తాము కష్టపడి సంపాదించుకున్న డబ్బును ప్రభుత్వబ్యాంకులు, ఆర్థిక సంస్థలలో దాచుకుంటున్నారు. బ్యాంకులు సాధారణ ప్రజల నుండి బడా పెట్టుబడిదారుల వరకు అన్ని వర్గాల నుండి డిపాజిట్లు సేకరిస్తాయి. ఆ విధంగానే అన్ని వర్గాల ప్రజలకు రుణాలు కూడా ఇస్తూ ఉంటాయి. ఆ విధంగా ఇస్తున్న రుణాలలో కొంతభాగం బ్యాంకులు, ఇతర ద్రవ్యసంస్థలకు తిరిగి రావటం లేదు. తిరిగిరాని రుణాలలో 90 శాతం పెట్టుబడిదారులకు ఇచ్చిన రుణాలే ఉంటున్నాయి. పెట్టుబడిదారుల నుండి తిరిగిరాని రుణాలలో రుణం తీసుకున్న పరిశ్రమ, సంస్థ ఆర్థికంగా దెబ్బతినటంతో తిరిగి చెల్లించలేనివి తక్కువగా ఉంటున్నాయి. ఆయా పరిశ్రమలు, సంస్థల ఆర్థిక పరిస్థితులు బాగానే ఉన్నా, తాము తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించగల స్థితిలో ఉన్నా పెట్టుబడిదారులు ఉద్దేశ్యపూర్వకంగా రుణాలను ఎగ్గొడుతున్నారు. తమ ఆస్తులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నారు. దేశంలో కెల్లా ధనికుడైన ముఖేష్ అంబాని, ప్రధాని నరేంద్రమోడికి సన్నిహిత మిత్రుడైన ఆదాని, రుణాలు ఎగ్గొట్టి, ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో దేశం నుండి తప్పించుకుపోయిన విజయ్ మాల్యా, లలిత్‌మోడి తదితరులు ఈ కోవలోని వారే. ఈ విధంగా

కావాలని రుణాలు ఎగ్గొడుతున్న వారి వలననే ప్రభుత్వ బ్యాంకులు, ఆర్థికసంస్థలు సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. ఆ విధంగా సంక్షోభంలో చిక్కుకున్న ఆర్థికసంస్థలను సంక్షోభం నుండి బయట పడవేయాలంటే ఉద్దేశ్యపూర్వకంగా రుణాలు ఎగ్గొడుతున్న పెట్టుబడిదారులపై కఠినచర్యలు తీసుకుని బకాయిలు వసూలు చేయాలి.వారిని ఆర్థిక నేరస్తులుగా ప్రకటించి, చట్ట ప్రకారం శిక్షించాలి. వారు ఎగ్గొట్టిన రుణాలను వసూలు చేయకుండా, వారిని శిక్షించకుండా ప్రభుత్వం రక్షిస్తున్నది. ప్రజలు బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థలలో దాచుకున్న మొత్తాలను స్వంతం చేసుకుని తమను తాము రక్షించుకోవటం కోసం, డబ్బు దాచుకున్న వారిని నష్టపెట్టటం కోసమే 'బెయిల్ ఇన్' తీసుకువస్తున్నది. అంటే ప్రజలు తమ కష్టం ద్వారా సంపాదించుకుని, బ్యాంకులలో దాచుకున్న ధనాన్ని పెట్టుబడిదారులు బహిరంగంగా దోపిడీ చేయటానికి అవకాశం కల్పించటమే యఫ్ఆర్డిఐ బిల్లులోని బెయిల్ ఇన్ క్లాజు లక్ష్యం. బెయిల్ ఇన్ ద్వారా ప్రజల ధనాన్ని పెట్టుబడిదారులకు ఎలా కట్టబెడతారు? ప్రజలు తాము సంపాదించిన డబ్బును భద్రత కోసం బ్యాంకులు, ద్రవ్యసంస్థలలో దాచుకుంటారు. పెట్టుబడిదారులు ఉద్దేశ్యపూర్వకంగా రుణాలు ఎగ్గొడుతున్నారని పైన చూశాం. పెట్టుబడిదారులకు ఇచ్చిన రుణాలు తిరిగిరాకపోవటం వలన బ్యాంకులు, ద్రవ్యసంస్థలు తామ సంస్థలో డబ్బు దాచుకున్న వారికి చెల్లించాల్సిన డబ్బును చెల్లించలేని స్థితికి చేరతాయి. ఫలితంగా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. అపుడు బ్యాంకులు, ద్రవ్యసంస్థలు ప్రజలు తమవద్ద దాచుకున్న డబ్బును తమ స్వంతం చేసుకుని, ఆలోటును పూరించు కుంటాయి. ఉదాహరణకు ఒక బ్యాంకు తాను ఇచ్చిన రుణాలలో పదివేల కోట్ల రూపాయలు తిరిగిరాలేదు.అవి యన్పిఎలుగా మారిపోయాయి. ఆ మొత్తాన్ని పూరించుకోకపోతే బ్యాంకు మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాబట్టి ప్రజలు డిపాజిట్ చేసిన మొత్తాల నుండి ఈ పదివేలకోట్ల రూపాయలను బ్యాంకు తన స్వంతం చేసుకుంటుంది. ఆ డబ్బుతో తన అవసరాలు తీర్చుకుంటుంది. ప్రజల డబ్బును పెట్టుబడిదారుల సంపద పెంచటానికి తరలించారు. ఫలితంగా బ్యాంకులకు వచ్చిన నష్టాన్ని ప్రజల డబ్బుతో భర్తీచేశారు. మరి డిపాజిట్దారుల పరిస్థితి ఏమిటి? డిపాజిట్ దారుల నుండి ధనాన్ని తీసుకున్న మేరకు వారికి బాండ్లు, ఈక్విటీలు ఇస్తామని ప్రభుత్వం

❝ కాని ప్రజల వద్ద ఉన్న బాండ్లు పెట్టుబడిదారుల వద్దకు చేరితే వాటి స్వతంత్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. బ్యాంకులు, ద్రవ్యసంస్థలు పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతాయి. ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించకుండానే, ప్రజలకు తెలియకుండానే బ్యాంకులు, ద్రవ్యసంస్థల ప్రైవేటీకరణ జరిగిపోతుంది. ❞

చెబుతున్నది. కాని వాటి వలన డిపాజిట్ దారులకు ఉపయోగమేమి ఉండదు. సాధారణ ప్రజలు తమ అవసరాల కోసం బ్యాంకులు, ద్రవ్యసంస్థలలో తమ ధనాన్ని దాచుకుంటారు. కొందరు రోజువారీ అవసరాలకు, ఉద్యోగాలు, నెలజీతాలతో పనిచేసేవారు ఆ నెలలో తమ కుటుంబ అవసరాలను తీర్చుకోవటం కోసం, కొందరు నిర్ణీతకాలంలో తమకు వచ్చే అవసరాల కోసం- పిల్లల చదువులు, పెళ్ళిళ్ళ తదితరాలు- తమ డబ్బును దాచుకుంటారు. వారికి అవసరమైన సమయానికి డబ్బు చెల్లించకుండా బాండ్లు, ఈక్విటీలు ఇస్తే ఉపయోగమేమిటి? ఆ విధంగా బ్యాంకులు, ద్రవ్యసంస్థలు బాండ్లు, ఈక్విటీలు జారీచేస్తే, తమ అవసరాల కోసం ప్రజలు వాటిని తప్పని సరిగా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.బాండ్లు, ఈక్విటీలను ప్రజలు అమ్ముకోవటం ప్రారంభిస్తే వాటిని ఎవరు కొంటారు? తిరిగి పెట్టుబడిదారులే వాటిని కొనుగోలు చేస్తారు. ప్రజల నుండి కొనుగోలు చేసేటపుడు పెట్టుబబడిదారులు వాటి పూర్తి విలువను ప్రజలకు చెల్లిస్తారా? చెల్లించరు. వారు ఎంత తక్కువ చెల్లించినా అమ్ముకోవటం మినహా ప్రజలకు గత్యంతరం ఉండదు. ఆ విధంగా ప్రజలు తాము దాచుకున్న డబ్బును తమకు అవసరమైన సమయంలో తీసుకోలేరు. ఆ తర్వాత కూడా అతి తక్కువ మొత్తం మాత్రమే పొందగలరు. దీనిలో మరో అంశం కూడా ఉన్నది. ప్రజల వద్ద బ్యాంకులు, ద్రవ్యసంస్థల బాండ్లు, ఈక్విటీలు ఉన్నా బ్యాంకులు ప్రభుత్వ ఆధీనంలో ఉండటానికి ఆటంకం ఉండదు. కాని ప్రజల వద్ద ఉన్న బాండ్లు పెట్టుబడిదారుల వద్దకు చేరితే వాటి స్వతంత్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. బ్యాంకులు, ద్రవ్యసంస్థలు పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతాయి. ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించకుండానే, ప్రజలకు తెలియకుండానే బ్యాంకులు, ద్రవ్యసంస్థల ప్రైవేటీకరణ జరిగిపోతుంది.

బెయిల్ ఇన్ క్లాజుతో ఉన్న ప్రమాదం ఏమిటనేది ప్రజలకు అర్థం అవుతున్న కొద్దీ యఫ్ఆర్డిఐ బిల్లుకు వ్యతిరేకత పెరుగుతున్నది. దీనిని గమనించిన ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టటం కోసం రకరకాల వాదనలను ముందుకు తీసుకువస్తున్నది. డిపాజిట్దారుల అంగీకారం లేకుండా వారు దాచుకున్న డబ్బును తీసుకోవటం జరగదని ఆర్థికశాఖ మంత్రి అరుణ్జైట్లీ చెబుతున్నాడు.అదే నిజమైతే బెయిల్ ఇన్క్లాజుతో అవసరమేముంది? ప్రజలు ఇష్టపూర్వకంగా తమడబ్బును బ్యాంకులు, ఆర్థికసంస్థల్లో డిపాజిట్ చేసుకోవటానికి చట్టం ఎందుకు? ఇపుడు బెయిల్ఇన్ లేకపోయినా ప్రజలు తమడబ్బును బ్యాంకులు, ద్రవ్యసంస్థలలో దాచుకోవటంలేదా? కాబట్టి బెయిల్ ఇన్ క్లాజుపై ప్రజలను మోసం చేయటం కోసమే ఆర్థికమంత్రి అబద్ధాలు చెబుతున్నాడని స్పష్టమౌతున్నది. గ్యారంటి కల్పించిన మొత్తాలను మినహాయించి, మిగిలిన మొత్తాన్ని మాత్రమే బెయిల్ ఇన్కు ఉపయోగిస్తామని మరోమాట చెబుతున్నారు. ప్రజల అంగీకారంతోనే బ్యాంకులలో వారు దాచుకున్న డబ్బును బెయిల్ ఇన్కు ఉపయోగిస్తామని ఇంతకు ముందు చెప్పిన మాట అబద్ధమని ఈ మాటలు రుజువు చేస్తున్నాయి. గ్యారంటి కల్పించిన మొత్తం వదిలివేయటం అన్నా ప్రజల ధనాన్ని అక్రమంగా స్వంతం చేసుకోవటమే అవుతుంది. తమకు అవసరాలున్నపుడు తీసుకోవచ్చునని ఎవరైనా ఎక్కువ మొత్తం దాచుకోవచ్చు. ఆ మొత్తం అవసరమైనపుడు రాకపోతే వారి పరిస్థితి ఏమిటి? ప్రజలు తాము సంపాదించుకున్న డబ్బు ఎక్కువ అయినా, తక్కువ అయినా తమ ఇష్టప్రకారం ఖర్చుపెట్టుకోవాలనుకుంటారు. ప్రజలు దాచుకున్న డబ్బు నిర్ణీత మొత్తం దాటితే తన ఇష్ట ప్రకారం ఉపయోగించుకుంటాననే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిది? ప్రజలను మోసం చేయటానికి రోజుకొక మాట చెబుతున్న ప్రభుత్వం బిల్లు చట్టంగా మారిత తర్వాత నిర్ణీత మొత్తాన్ని

**❝ మనదేశంపై కూడా ఆ సంక్షోభాల ప్రభావం ఉన్నప్పటికీ ఇతరదేశాలు గురైనంత తీవ్రంగా ఆ ప్రభావానికి మనదేశం గురికాలేదు. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వరంగంలో ఉన్న బ్యాంకులు, ద్రవ్యసంస్థలు, పరిశ్రమలే కారణం. ఇపుడు ప్రభుత్వం తీసుకురానున్న యఫ్‌ఆర్‌డిఐ చట్టం, వేగంగా అమలుచేస్తున్న ప్రైవేటీకరణ ఈ పరిస్థితిలో మార్పులు తీసుకువస్తుంది. ❞**

మినహాయించి, మిగిలిన మొత్తాన్నే బెయిల్ ఇన్‌కు వినియోగిస్తామనే మాటకు కట్టుబడి ఉంటుందా?

### రిజల్యూషన్ కార్పొరేషన్

యఫ్‌ఆర్‌డిఐ చట్టాన్ని అమలుచేయటం కోసం రిజల్యూషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఇందులో పదకొండు మంది సభ్యులుంటారు. వీరిలో ఏడుగురిని ఆర్థికశాఖ నియమిస్తుంది. బ్యాంకులు, ద్రవ్యసంస్థల ఆర్థిక పరిస్థితిని ఈ కార్పొరేషన్ పర్యవేక్షిస్తుంటుంది. ప్రతిసంస్థ ఏ పరిస్థితుల్లో ఉంది. ఆ సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే విషయాన్ని రిజల్యూషన్ కార్పొరేషన్ నిర్ణయిస్తుంది. ఇబ్బందుల్లో ఉన్న బ్యాంకులు, ద్రవ్యసంస్థలను విదేశీ సంస్థతో సహా ఎవరికైనా అమ్మివేయటం, ఇతర సంస్థల్లో విలీనం చేయటం, బెయిల్ ఇన్ ఇవ్వటం అనే మూడు ప్రత్యామ్నాయాలతో సమస్యను పరిష్కరిస్తుంది. ఈ మూడు ప్రత్యామ్నాయాలు ప్రభుత్వరంగంలోని బ్యాంకులు, ద్రవ్యసంస్థలను ప్రైవేటు, విదేశీబ్యాంకులు, ద్రవ్యసంస్థలు స్వాధీనం చేసుకోవటానికి, ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టటానికి అవకాశం కల్పిస్తాయి. ఇచ్చిన రుణాలు వసూలు కాక ఒకబ్యాంకు, లేదా ద్రవ్యసంస్థ ఇబ్బందులకు గురైనపుడు రుణాల వసూలు కోసం చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేసి, రుణాల వసూలుకు ప్రభుత్వం ఆ సంస్థలకు తోడ్పడితే ఎక్కువ భాగం రుణాలు వసూల వుతాయి.ప్రభుత్వరంగంలోని ఆర్థికసంస్థలు ఆరోగ్యకరంగా మనుగడ సాగిస్తాయి. ప్రభుత్వం ఆ పనిచేయటం లేదు.ఆ పని చేయకుండా రిజల్యూషన్ కార్పొరేషన్ తన విధుల ప్రకారం ఇబ్బందుల్లో ఉన్న బ్యాంకులను, ద్రవ్యసంస్థలను ఇతర సంస్థలో విలీనం చేస్తే ఏం జరుగుతుంది? ఆరోగ్యకరంగా ఉన్న సంస్థకూడా సంక్షోభంలో చిక్కుకుపోవటానికి ఈ


బ్యాంకు రుణాలను ఎగ్గొడుతున్న కార్పొరేట్ సంస్థల అధిపతులతో కేంద్రమంత్రి

చర్య దోహదం చేస్తుంది. ఆ విధంగా ఈ పరిష్కారం మొత్తం ప్రభుత్వరంగంలోని బ్యాంకులు, ద్రవ్యసంస్థలన్నింటినీ సంక్షోభంలోకి నెట్టటానికి దారితీస్తుంది. ఇక సంక్షోభంలో ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలను విదేశీ, స్వదేశీ ప్రైవేటు బ్యాంకులు, ద్రవ్య సంస్థలకు అమ్మితే ఆ సంస్థలు ప్రైవేటు వారిచేతుల్లోకి పోతాయి. ప్రభుత్వరంగంలోని బ్యాంకులు, ద్రవ్యసంస్థలన్నింటినీ ప్రైవేటీకరించటం సరళీకరణ విధానాల లక్ష్యం. ప్రైవేటీ కరణకు ప్రత్యక్షంగా పూనుకుంటే ప్రజలు సహించరు. కాబట్టి బ్యాంకులు, ద్రవ్యసంస్థలకు నష్టాలు వస్తున్నాయని చెబుతూ, నష్టాల నుండి ఆ సంస్థలను బయట పడవేయటం పేరుతో పరోక్షంగా ప్రైవేటీకరణ చేయటానికి ఇది దారితీస్తుంది. ఇక బెయిల్ ఇన్ ప్రత్యక్షంగా ప్రజల ధనాన్ని కార్పొరేట్, బహుళజాతి సంస్థలు కొల్లగొట్టటానికి అవకాశం కల్పిస్తుంది. అందువలన రిజల్యూషన్ కార్పొరేషన్ ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలను ప్రైవేటీకరించటానికి మార్గం సుగమం చేస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలను ప్రైవేటీకరించటానికి తొందరపడుతున్న ప్రభుత్వం రిజల్యూషన్ కార్పొరేషన్‌లో ఆ విధానాలను అమలుజరిపే వారినే నియమిస్తుంది. అందువలన యఫ్‌ఆర్‌డిఐ బిల్లు చట్టంగా మారటం ప్రభుత్వరంగ బ్యాంకులు, ద్రవ్యసంస్థలను సత్వరం ప్రైవేటీకరించటానికి దారితీస్తుంది.

ఈ క్రమంలో రిజర్వుబ్యాంకు పాత్రకూడా మారుతుంది. ఇప్పటి వరకు రిజర్వుబ్యాంకు ద్రవ్య విధానాన్ని నిర్ణయించటం, అమలును పర్యవేక్షించటం, ద్రవ్య సరఫరాను క్రమబద్ధీ కరించటం చేస్తున్నది. ఈ బిల్లు చట్టంగా మారి అమలు ప్రారంభమైతే ద్రవ్య స్థిరత్వాన్ని కాపాడటానికే రిజర్వు బ్యాంకు పాత్ర పరిమితం అవుతుంది. కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం ద్రవ్య విధానాన్ని నిర్ణయిస్తుంచటానికి మార్గం సుగమమౌతుంది. రిజర్వుబ్యాంకు గవర్నర్లుగా నియమితులయే వారు కూడా సరళీకరణ విధానాలను అమలుచేసేవారే అయినా గతంలో గవర్నర్లుగా వ్యవహరించిన కొందరు కొన్ని సందర్భాలలో ప్రభుత్వ నిర్దేశానికి భిన్నంగా వ్యవహరించారు. వడ్డీరేట్ల నిర్ణయం, క్యాష్ రిజర్వు రేషియో తదితరాలలో తమ స్వంత మార్గంలో వ్యవహరించారు. ఆ విధంగా వ్యవ హరించటం ప్రజలకు, ఆర్థికవ్యవస్థకు కొంత మేరకు ఉపశమనం కలిగించింది. ఇపుడు ప్రభుత్వం అటువంటి స్వతంత్ర నిర్ణయాలకు అవకాశం లేని పరిస్థితులను తీసుకువస్తున్నది.

దేశంలో సరళీకరణ విధానాల అమలు ప్రారంభమైన గత రెండున్నర దశాబ్దాల కాలంలో ఈ విధానాలను అమలు జరుపుతున్న దేశాలలో అనేక సంక్షోభాలు వచ్చాయి. మనదేశంపై కూడా ఆ సంక్షోభాల ప్రభావం ఉన్నప్పటికీ ఇతర దేశాలు గురైనంత తీవ్రంగా ఆ ప్రభావానికి మనదేశం గురికాలేదు. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వరంగంలో ఉన్న బ్యాంకులు, ద్రవ్యసంస్థలు, పరిశ్రమలే కారణం. ఇపుడు ప్రభుత్వం తీసుకురానున్న యఫ్‌ఆర్‌డిఐ చట్టం, వేగంగా అమలుచేస్తున్న ప్రైవేటీకరణ ఈ పరిస్థితిలో మార్పులు తీసుకువస్తుంది. ఫలితంగా ఇతరదేశాలలో సంభవించే సంక్షోభాలు మనదేశంపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తాయి. సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు దేశ ప్రజానీకం మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఆర్థికాభివృద్ధికి కూడా విఘాతం కలుగుతుంది. ప్రభుత్వం తీసుకువచ్చిన నోట్లరద్దు, జియస్‌టిలు ప్రజల ప్రయోజనాలను, ఆర్థికాభి వృద్ధిని ఏ విధంగా దెబ్బతీశాయో చూశాం. ఇపుడు తీసుకువస్తున్న యఫ్‌ఆర్‌డిఐ చట్టం వాటిని మించిన నష్టం కలిగిస్తుంది. కాబట్టి ఈ బిల్లు చట్టం కాకుండా నిరోధించేందుకు ప్రజలంతా సన్నద్ధం కావాలి. ❃

# ప్రమాదంలో మన విత్తనం

## భారత్‌లో సామాజిక చట్రాన్ని చిదిమేస్తున్న ప్రపంచీకరణ

కోలిన్ తాడ్‌హంటర్

భారత్‌లో ప్రస్తుతం అమలు జరుగుతున్న అభివృద్ధి అజెండాను విదేశీ పెట్టుబడి శాసిస్తున్నది. ఇప్పుడున్న వ్యవసాయ విధానం స్థానే పశ్చిమ దేశాల వ్యవసాయ వాణిజ్యావసరాలకు, మరీ ముఖ్యంగా ఆహార శుద్ధి, రిటైల్ వర్తకానికి అనుగుణమైన కార్పొరేట్ వ్యవసాయ పద్ధతిని రుద్దడం దాని లక్ష్యం. వ్యవసాయ రంగానికి చెందిన కొందరిని భారీ గొలుసుకట్టు సూపర్‌మార్కెట్లకు, బడా సప్లయర్లకు కాంట్రాక్టుపై పనిచేసేలా మార్చడం వీరి పథకం. మితిమీరి శుద్ధి చేసిన, పోషక రహిత, జన్యుమార్పిడి ఆహారాన్ని అవి కూడా రసాయనాలు ఎక్కువగా వాడిన పంటల నుంచి తీసుకున్నవాటిని ఈ సంస్థలు మనకు అందిస్తాయి. నేల సత్తువను ఎక్కువగా హరించివేసే, క్షామం వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకోలేని, తక్కువ వైవిధ్యం కలిగిన, అంతగా నిలకడలేని ఇటువంటి వ్యవసాయ నమూనాతో ఆహార భద్రత సాధించడం అసాధ్యం.

దురదృష్టవశాత్తూ విదేశీ వ్యాపారుల ముందు భారత బడా రాజకీయ బాబులు మోకరిల్లి వారి ప్రయోజనాలు నెరవేర్చడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. 'నిరుపేద' దేశాలు అన్న ముద్ర వేసి, ఈ 'వెనుకబాటుతనం' పోవాలంటే పశ్చిమ దేశాల, వాటి బడా బహుళజాతి సంస్థలు, దాతృత్వగాళ్లుగా పోజుపెట్టే అపర కుబేరుల సహకారం తప్పనిసరి అన్న భావనను వీరు మన మెదళ్లలో కూరుతారు. ఇందుకోసం ఆఫ్రికాలో మోన్‌శాంటో, బిల్‌గేట్స్ ఫౌండేషన్ ఆఫ్రికన్లకు చేసిన 'సాయం' గురించి గోరంతలు కొండంతలు చేసి చూపుతారు. సాయం పేరుతో అక్కడి వ్యవసాయాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని వీళ్లు చూస్తున్నారు. పాత వలసపాలకుల మనస్తత్వమే ఇంకా ఇక్కడ పనిచేస్తోంది.

ఈ తరహా ' అభివృద్ధి', లేదా 'ప్రపంచీకరణ' ను అమెరికా, ప్రపంచ బ్యాంకు ముందుండి నడిపిస్తున్నాయి. ప్రపంచమంతటా ఒకే రకమైన ఉత్పత్తి, వినియోగం, సంస్కృతిని తీసుకురావడం వాటి ఉద్దేశం. తద్వారా అత్యంత శక్తివంతమైన బహుళజాతి కంపెనీలు త్వరితగతిన భారీగా లాభాలు పోగేసుకునేందుకు అవసరమైన ప్రాతిపదిక సృష్టిస్తారు. భారత్‌లో కానీ, ప్రపంచంలో కానీ వ్యవసాయ రంగంలో తీసుకొచ్చే ఈ మార్పుల సారాంశమొక్కటే. విత్తనాల్లో వైవిధ్యాన్ని దెబ్బతీసి ఒకే రకమైన విత్తనం కిందికి తీసుకురావడం. తద్వారా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను కాపాడడం ఇదీ వీరి పన్నాగం.

### విత్తన వైవిధ్యం నాశనం

పర్యావరణవేత్త ఆలివర్ టికెల్ ఇటీవల ఇచ్చిన నివేదికలో ఇలా పేర్కొన్నారు. వేల సంవత్సరాల నుండి స్థానికంగా రైతులు స్వతహాగా కలిగివుంటూ వస్తున్న తృణధాన్య జాతులు ప్రతి పొలంలోనూ ఓ ఆరడజనుకు తగ్గకుండా వుండేవి. అన్నీ కలుపుకుంటే 200 రకాల దాకా తృణధాన్యాలుండేవి. ప్రతిదీ తనదైన జన్యు వైవిధ్యాన్ని కలిగివుండేది. పంధొమ్మిదో శతాబ్దంలో రైతులు అధిక దిగుబడులు సాధించడం కోసం ప్రత్యేకించి కొన్నిటిని ఎంచుకున్నారు. వ్యవసాయంలో మరింత సుస్థిరత, ఒకే రకమైన వంగడాల కోసం అన్వేషణ మొదలైంది. అప్పుడున్న వాటిలో మామూలు వాతావరణ పరిస్థితుల్లో సైతం అధికదిగుబడినిచ్చే వంగడాన్ని ఎంచుకుని , దానినే విస్తృతంగా నాటారు. ఏపుగా పెరిగి, మంచి దిగుబడినివ్వడంతో అందరూ ఆ విత్తనం కోసం ఎగబడ్డారు. దానినే విశిష్టమైన వంగడంగా పేర్కొంటూ వాటి ఉత్పత్తిదారులు ఆ విత్తనాలను పెద్దయెత్తున అమ్ముకున్నారు.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి ముందే ఈ విత్తనాలు సంకరం కావించబడి వున్నాయి. స్థానిక వాతావరణ పరిస్థితులకు ఇవి అన్నివిధాలా అనువుగా వుండడం, లాభదాయకంగా వుండడతో రైతులు వీటివైపు ఎక్కువగా మళ్లారు. విత్తన ఉత్పత్తిదారులు పంటల్లో జన్యుపరమైన వైవిధ్యాన్ని నాశనం చేయడానికి ఇక్కడే బీజం పడింది. పంటలు జన్యుపరంగా ఏకాకృతిని సంతరించుకున్నాయి. అయితే ఈ పరిస్థితి ఎంతో కాలం నిలవలేదు. క్రిమి కీటకాలు, ఫంగస్ ఎడాపెడా దాడి చేయడంతో క్రిమి సంహారకాల వాడకం బాగా పెరిగిపోయింది. ఈ మందులు ఎంతగా చల్లినా ఒక్కొక్కసారి ఫలితం వుండేది కాదు. మొక్కలు గిడసబారిపోవడం, కలుపు పెరగడంతో వీటిని నివారించడం కోసం ఈ మందులపై మరింతగా ఆధారపడాల్సి వచ్చేది. విత్తనాలు, రసాయనిక ఎరువులపై గుత్తాధిపత్యం చలాయించే అగ్రిబిజినెస్ కంపెనీలు రైతుల మూల్గులను మరింతగా పీల్చి పిప్పిచేసి దండిగా లాభాలు పిండుకునేందుకు ఇది వీలు కల్పించింది. కొన్ని సందర్భాల్లో దిగుబడులు పెరిగినా ఈ సస్య విప్లవం వల్ల పర్యావరణ పరంగా, సామాజిక, ఆర్థిక పరంగా తగు మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోందని టికెల్ అభిప్రాయపడ్డాడు. విషతుల్యమైన ఆహారం, నేల నిస్సత్తువగా మారడం, నీటి కాలుష్యం, నీటి కొరత, ప్రజారోగ్యం దెబ్బతినడం, గ్రామీణ రైతులు ఎంతో కష్టపడి సాధించుకున్న విత్తన స్వావలంబన హరించుకుపోవడం, శిలాజ ఇంధనాలపై (రవాణా, చమురు, హైడ్రోకార్బన్‌వాడకంపై) మరింతగా ఆధారపడటం ఇలా అనేక రూపాల్లో దీని ప్రభావం పడుతోంది. వీటి ప్రభావం వాతావరణ మార్పులపైనా పడుతోంది..

వాతావరణ మార్పుల దృష్ట్యా జన్యుపరమైన పంటల్లో వైవిధ్యం ఇదివరకెన్నటికన్నా ఇప్పుడు మరింత ఎక్కువ అవసరమవుతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలి. సర్వకాల సర్వావస్థల్లోను చీడలను తట్టుకుని మంచి దిగుబడినిచ్చే నమ్మకమైన వంగడాలను

**“ విత్తనాలు తీసుకురావడం, రసాయనికి ఎరువులను మితిమీరి వాడడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. గనుక ఈ ఏకాకృతి పంటల సంస్కృతి వల్ల భూగోళానికే ముప్పు వాటిల్లే ప్రమాదముందని వందన శివ వంటి వారు ఆందోళన చెందుతున్నారు. ”**



బి.టి పత్తిపంటలు

సాధించాలి. గరిష్టస్థాయిలో దిగుబడుల కోసం ఏమైనా చేయాలనేది ఒక రకంగా సరైనదేననిపించవచ్చు. కానీ, దాని వల్ల మొత్తం పంటల వ్యవస్థే కుప్పకూలే పరిస్థితి రాకూడదు. వరదలు, కరువు కాటకాలు సంభవించినప్పుడు, కొత్త కీటకాలో, ఫంగసో, వైరస్సో దాడి చేసినప్పుడు పరిస్థితి చాలా దయనీయంగా వుంటుంది.

విత్తన వైవిధ్యాన్ని నాశనం చేయడం కార్పొరేట్ల విత్తన ప్రాధాన్యతల్లో ముఖ్యమైన అంశంగా వుండడమే కాదు. ఇది ఒక పథకం ప్రకారం సంప్రదాయకంగా అనుసరిస్తూ వస్తున్న విత్తన విధానాన్ని ఉద్దేశపూర్వకంగా పక్కకు నెట్టడమే. జన్యుపరమైన వైవిధ్యాన్ని గనుక నాశనం చేస్తే రసాయనిక ఎరువులు అధికంగా వాడే వ్యవసాయ పద్ధతులపై ఆధారపడడం మినహా వేరే గత్యంతరం లేని పరిస్థితి వస్తుంది. సుదూర పట్టణ ప్రాంతాలకు లేదా విదేశాలకు ఎగుమతి కోసం ఉద్దేశించిన వాణిజ్య పంటలపై ఆధారపడడం వల్ల స్థానిక రైతాంగం దెబ్బతింటుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, సాంప్రదాయక పద్ధతుల్లో సాధించుకున్న స్వావలంబన సంస్కృతిని నాశనం చేయడమే.

పంటల్లో వైవిధ్యాన్ని దెబ్బతీసి ఒకే రకమైన విత్తనాలు తీసుకురావడం, రసాయనిక ఎరువులను మితిమీరి వాడడం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. గనుక ఈ ఏకాకృతి పంటల సంస్కృతి వల్ల భూగోళానికే ముప్పు వాటిల్లే ప్రమాదముందని వందన శివ వంటి వారు ఆందోళన చెందుతున్నారు. జన్యుమార్పిడి విత్తనాలు, ఆహార శుద్ధి రంగంలోకి బడా కంపెనీలు చొరబడుతుండడంతో విత్తనాలను భద్రపరచడంలో భారత గ్రామీణ మహిళలు ఇప్పటివరకూ అనుసరిస్తూ వస్తున్న పద్ధతులు మరుగునపడిపోతాయి. స్థానిక అయిల్ మిల్లులు మూతపడతాయి. ఆ స్థానాన్ని కార్పొరేట్ మిల్లులు ఆక్రమిస్తాయి.

ఈ విధంగా మనం సాంప్రదాయకంగా అనుసరిస్తూ వస్తున్న ఉత్పత్తి విధానాన్ని పక్కనపెట్టి, పశ్చిమ దేశాల కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం, అధిక లాభార్జనే ధ్యేయంగా రూపుదిద్దుకున్న విధానాన్ని కావలించుకోవడం దేశానికి నష్టదాయకం. భారతీయ రైతులు వెనుకబడినవారని, వారికి సాయం అందించే పేరుతో మనపై రుద్దుతున్న ఈ విధానాలు భారత్‌పై పశ్చిమ దేశాల సాంస్కృతిక, ఆర్థిక ఆధిపత్యానికి దారి తీస్తాయి. అంతిమంగా మన ఆహార, వ్యవసాయ రంగాలను విదేశీ కార్పొరేట్ల ప్రయోజనాలు శాసించే స్థితి వస్తుంది.. దీంట్లో ఎలాంటి సందేహమూ లేదు.

దక్షిణాసియా అధ్యయనాల సంస్థ వెల్లడించిన ఒక పత్రం ప్రకారం వేల సంవత్సరాల నుంచి రైతులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసలు సాగించే క్రమంలో వ్యాపార సంబంధాలు, కానుకలు ఇచ్చిపుచ్చుకోవడాల ద్వారా రకరకాల వృక్ష జాతులు, జంతు జాతులను సేకరించారు. పని చేస్తుండడం ద్వారా నేర్చుకోవడం, చేసిన తప్పుల నుంచి పాఠాలు తీసుకోవడం, పాత సంప్రదాయాలు, కొత్త వైజ్ఞానిక పద్ధతులను మేళవించడం ద్వారా రైతులు రూపొందించిన ఈ వ్యవస్థను నాశనం చేయాలని చూడడం ఎంతమాత్రమూ తగదు. రైతులకున్న పరిశీలన, జ్ఞాపక శక్తి అపారమైనది. దీనిని బోధనలు కథల రూపంలో ఒక తరం నుంచి మరొక తరానికి అందిస్తూ వస్తున్నారు.

చిన్న కమతాల రైతుల ప్రాధాన్యత గురించి ఈ పరిశోధనాపత్ర రూపకర్తలైన మారికి విక్ జియాని, జగ్జిత్ ప్లాహె నొక్కి చెబుతూ, ‘ రైతులు (ఈ దేశానికి వెన్నెముక ) నష్టాన్ని వీలైనంత మేరకు తగ్గించే వ్యూహాలను రూపొందించడంలో ఎప్పుడూ ముందుంటారు, కరువు పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో వీరికి బాగా తెలుసు. జీవ వైవిధ్యాన్ని, పంటల వైవిధ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో, ఎలాంటి సేద్య పద్ధతులను అనుసరించాలో, నేల సారాన్ని ఎలా నిలబెట్టాలో, నీటి వనరులను ఎలా సంరక్షించుకోవాలో, వ్యవసాయ వ్యర్థాలను తిరిగి ఎలా పుపయోగించుకోవాలో, ఉమ్మడి వసతులు, వనరులను ఎంత జాగ్రత్తగా వాడాలో వీరికి తెలిసినంతగా మరొకరికి తెలియదు’ అని వ్యాఖ్యానించారు.

స్థానిక నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా ఎప్పుడు నాట్లు వేయాలి, నేల సారం దెబ్బతినకుండా పంటలను ఎలా మార్చుకోవాలో రైతులకే బాగా తెలుసు. నేడు పెద్దయెత్తున ముందుకొస్తున్న పారిశ్రామిక ఆధారిత వ్యవసాయం దీనికి పూర్తి విరుద్ధమైన రీతిలో సాగుతున్నది. కంపెనీ వ్యవసాయంలో అనుసరించే పద్ధతులు పంటల వైవిధ్యాన్ని, నేల పొరల్లోని జీవావరణాన్ని దెబ్బతీయడమే కాదు, వ్యవసాయ క్షేత్రాల, మొక్కల మౌలిక స్వభావంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయన్నారు. చిన్న కమతాల రైతులు అనుసరించిన పద్ధతుల్లో ఎక్కువ భాగం అంతగా పరిణతి లేనివని, లోపభూయిష్టమైనవని, ఒకప్పుడు ప్రచారం చేశారని. ఇప్పుడు వాటినే అత్యంత అధునాతనమైన, సరైన పద్ధతులుగా పరిగణిస్తున్నారని జియాని, ప్లాహె

పేర్కొన్నారు. ప్రస్తుతం వాడుకలో వున్న 20 వృక్ష జాతులే మానవుడు ఆహారం కోసం ఉపయోగించే మొత్తం వృక్షజాతుల్లో 90 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ వెల్లడించింది.. ఇటువంటి సంకుచిత జన్యు ఆధారిత ప్రపంచ ఆహారవ్యవస్థ వల్ల ఆహార భద్రత తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు.

పలు ఉన్నతస్థాయి నివేదికలు సయితం ఇదే విషయాన్ని ఉద్ఘాటించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రపంచ సుస్థిర, ఆహార భద్రత సాధించేందుకు వ్యవసాయ ఆవరణం, చిన్న కమతాల రైతుల ప్రాధాన్యతను గుర్తించి పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ ఆహార సంస్థ పిలుపునిచ్చింది. దేశంలో వ్యవసాయ, రసాయనిక క్రిమిసంహారక మందుల లాబీ చాలా బలంగా వుంది. పారిశ్రామిక వ్యవసాయ పనిముట్లను, సాంకేతిక పరిజ్ఞానాన్ని బయటినుంచి దిగుమతి చేసుకోవడానికి బదులు దేశీయంగా సాంప్రదాయక ఆహారోత్పత్తి వ్యవస్థలను ప్రోత్సహించాలని, గ్రామీణ ప్రాంత రైతుల నైపుణ్యం, విజ్ఞానం, తెలివితేటలపై ఆధారపడిన సాంప్రదాయ వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలను, సంస్కృతిని నమ్ముకోవడమే మంచిదని పలువురు సలహా ఇచ్చారు..మనది వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ. మెజారిటీ ప్రజానీకం ఇప్పటికీ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. నేడు మనం చూస్తున్న విదేశీ పెట్టుబడి దేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చట్రంపై ఎలా దాడి చేస్తుందో చూస్తున్నాము. దీనిని బిల్‌గేట్స్ ఎగదోస్తున్నారా? ప్రపంచ బ్యాంకు నయా ఉదారవాద విధానాలు ముందుకు తెస్తున్నాయా? వ్యవసాయ సంబంధమైన వాణిజ్యం పెంచుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఇఎఫ్) వంటి సంస్థలు "అభివృద్ధి" పేరుతో ఆడుతున్న నాటకమా? ఏదేమైనప్పటికీ దీని పర్యవసానాలు ప్రపంచ రైతాంగంపై తీవ్రంగా పడుతున్నాయి. పశ్చిమ దేశాలకు చెందిన శక్తివంతమైన బహుళజాతి సంస్థలు అవినీతికి ఆలవాలమైన పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ కంపెనీలకు దండిగా లాభాలు సంపాదించిపెట్టేందుకు, రైతులను వాటి రసాయనిక 'ట్రెడ్‌మిల్లు'ల్లో పెట్టి పిండేస్తున్నాయి. మన విస్తారమైన మార్కెట్‌లను కబళించేందుకు, పెద్దయెత్తున లాభాలు జుర్రుకునేందుకు 'గ్లోబల్ సప్లయి చెయిన్స్' సంస్థలు ఆహారోత్పత్తి రంగంలో పెద్ద ఎత్తున

**"మనది వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ. మెజారిటీ ప్రజానీకం ఇప్పటికీ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. నేడు మనం చూస్తున్న విదేశీ పెట్టుబడి దేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చట్రంపై ఎలా దాడి చేస్తుందో చూస్తున్నాము. దీనిని బిల్‌గేట్స్ ఎగదోస్తున్నారా? ప్రపంచ బ్యాంకు నయా ఉదారవాద విధానాలు ముందుకు తెస్తున్నాయా?"**




**రైతులను, వినియోగదారులను దోపిడి చేసే బహుళజాతి సంస్థల షాపింగ్ మాల్స్**

ప్రవేశిస్తున్నాయి. ఇండోనేషియాలో సహజ పంటలను అవి ఎలా నాశనం చేసిందీ ఎరుకే. ఇందుకోసం అవి పచ్చి అబద్దాలను సయితం ప్రచారంలో పెడుతున్నాయి. జన్యుమార్పిడి విత్తనాల పేరిట భారత ఆహార వ్యవస్థను ఎలా అవినీతిమయం గావిస్తున్నదీ చూస్తున్నాం. ఇవన్నీ రైతులపైనా, గ్రామీణ ప్రాంత ప్రజలపైనా వినాశకర ప్రభావాన్ని చూపుతున్నాయి. నేల సత్తువ కోల్పోవడం, ప్రజారోగ్యం దెబ్బతినిపోవడం, నీటి వనరులు కలుషితం కావడం సర్వసాధారణమైపోయాయి. భారత్ లాంటి చోట్ల బహుళజాతి కంపెనీలు వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తూ, స్థానిక ఉత్పాదక వ్యవస్థలను, చిన్న కమతాలపై ఆధారపడిన రైతాంగాన్ని, కుటుంబ వ్యవసాయాన్ని పక్కకు నెట్టేస్తున్నాయి.

చిన్న కమతాల వ్యవసాయం, కుటుంబ వ్యవసాయం అధిక ఉత్పత్తి సాధనకు సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు మాత్రమేగాక ఆరోగ్యకరమైన ఆహారాన్ని, వైవిధ్యభరితమైన పోషకాలను అందిస్తాయి. గ్రామీణ ప్రజలకు స్థానిక, ప్రాంతీయ ఆహార భద్రతను గ్యారెంటీ చేస్తాయి.

సేద్యం చేసే రైతులు మామూలు వ్యక్తులు కాదు. పర్యావరణవేత్త వివా కెర్మానీ పేర్కొన్నట్లు వారిలో ఒక శాస్త్రవేత్త వున్నాడు, ఒక అన్వేషకుడున్నాడు, ఒక సహజవనరుల పరిరక్షణావేత్త వున్నాడు, ఒక విత్తన పరిరక్షకుడున్నాడు, హైబ్రిడీకరణ నిపుణుడున్నాడు. అటువంటి అనేక విశిష్టతలు కలిగిన రైతు పాత్రను నేడు సాంకేతిక పరిజ్ఞానం కోసం విదేశీ కంపెనీల ముందు దేబిరించే స్థాయికి దిగజార్చుతున్నారు. అంతకంతకూ పెరిగిపోతున్న వ్యవసాయ పెట్టుబడుల పరిశ్రమ వెలువరించే విషపు ఉత్పత్తులను స్వీకరించే వినియోగదారుని స్థాయికి రైతు పాత్రను కుదించారు. ఏ రైతుల విత్తనాలు, విజ్ఞానం కార్పొరేట్ సంస్థలచే దొంగిలించబడిందో ఆ రైతులే నేడు రసాయన ఆధారిత హైబ్రిడ్ విత్తనాలు, జన్యుపరంగా మార్పు చేసిన విత్తనాలపై ఆధారపడే దుస్థితికి నెట్టబడుతున్నారు. ఈ ఒక్క విషయంలోనే కాదు, కార్పొరేట్ లాభాల కోసం భారత్‌లో పై నుంచి కింది వరకు సామాజిక చట్రాన్ని ఈ సంస్థలు ఎలా నాశనం చేస్తున్నదీ మనం చూస్తున్నాము.

# అట్టడుగుకు దిగజారుతున్న మోడి



రచయిత
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

**ఏ.జి. నూరాని**

గుజరాత్ శాసనసభ ఎన్నికల ఆఖరిదశ ప్రచారంలో ప్రధాని మోడీ అనుసరించిన విభజన రాజకీయదశలు, విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చట్ట పరంగా, నైతికంగా, రాజకీయంగా తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

గుజరాత్ ఎన్నికల ప్రచారంలో అడ్డూ అదుపు లేకుండా ఈ విధమైన వాక్పటిమతో కూడిన అపవాదులు సంధించటం చూస్తే నరేంద్ర మోడీ 2019 పార్లమెంట్ ఎన్నికలలో ఇదే పద్ధతిని కొనసాగిస్తాడని అనిపిస్తోంది. ఆయన ప్రచారం, అందరూ ఒప్పుకున్నట్లుగానే, బి.జె.పి.ని అధికారంలోకి మరలా తేగలిగిందికాని, కాంగ్రెస్‌ను మట్టికరిపించలేక పోయింది. ప్రచారం అయిపోయింది, ఆయన వ్యాఖ్యానాలు మర్చిపోయారు, కాని అందులో ఉన్న తీవ్రమైన అంశాలు మరచిపోలేనివిగా ఉన్నాయి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఉపన్యాసాలు మత విద్వేషాలను పెంచి పోషించాయి. భారత దేశంలో ఉన్న ముస్లింలను పాకిస్తానీయులుగా చిత్రీకరించటం సర్వసాధారణమై పోయింది. వారిని "మియా" అని పిలవసాగారు.

ఆదాము అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు. ఢిల్లీ, బీహార్, ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో ప్రధానమంత్రిగా ప్రచారం చేశారు. కానీ అందరూ మర్చిపోయిన అంశం ఏమిటంటే 'గుజరాత్ వీటికి పూర్తిగా భిన్నమైనది. ఇక్కడ ప్రచారంలో మన స్వదేశీ మెక్‌కర్తి' తన హత్యకు కుట్ర జరుగుతోందని, తన ప్రభుత్వాన్ని పాకిస్థాన్ సహాయంతో కూలదోయాలని ప్రయత్నం జరుగుతోందని విద్వేష ప్రచారం చేశారు. అందుకు కొన్ని పేర్లను కూడా ఉపయోగించారు. మాజీ ఉపరాష్ట్రపతి, మాజీ ప్రధానమంత్రి, మాజీ కేంద్ర మంత్రులు పాల్గొన్న సమావేశాన్ని వక్రీకరించి, ప్రముఖ పాత్రికేయులు రాసిన అంశాలకు కూడా వక్ర భాష్యాలు జోడించి, ఓటింగ్‌కు నాలుగురోజుల ముందు అబద్ధాలతో రెచ్చగొట్టారు. మోడీ చట్టాలను తోసిపుచ్చాడు, పచ్చి అబద్ధాలు ప్రచారం చేశాడు, విభజన రాజకీయలను, విద్వేషాలను రెచ్చగొట్టాడు. అన్ని విధాలుగా రికార్డు చేయబడిన ఆయన ఉపన్యాసాలు విన్న తరువాతైనా అణుకువ, నమ్రత కలిగిన, శ్రద్ధతో ఆలకించే వ్యాఖ్యాతలందరూ నిటారుగా నిలబడి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

మణిశంకర్ అయ్యర్‌కు (ఇక నుండి మణి అని పిలుచుకుందాం) పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి అయిన ఖుర్షీద్ మెహమ్మద్ కసూరితో స్నేహం ఇప్పటిది కాదు, ఆక్స్‌ఫర్డ్‌లో వారు కలసి చదువుకున్నప్పటి నుంచి కొనసాగుతోంది. కసూరి సజ్జనుడు, పెద్దమనిషి ఎప్పుడూ భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు బావుండాలని కోరుకునేవాడు. ఆయన విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన ప్రయత్నాలే అందుకు నిదర్శనం. (2003-07).

ఢిల్లీలో అనంత సెంటర్ నిర్వాహకులు "ప్రస్తుత భారత-పాకిస్థాన్ సంబంధాలు" అనే అంశంపై మాట్లాడమని ఆయనను ఆహ్వానించారు. అది డిసెంబరు 7వ తేదీ 2017లో జరిగింది. దానికి మణిశంకర్ అయ్యర్‌ను కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ముందు తన స్నేహితునికి విందు భోజనం ఏర్పాటు చేశాడు అయ్యర్. అది డిసెంబర్ 6వ తేదీ సాయంకాలం జరిగింది. దీనికి ఆహ్వానాలు నెలముందే పంపబడ్డాయి. ఈ విందుకు హాజరైన ప్రముఖులలో మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాన మంత్రి డా. మన్మోహన్ సింగ్, మాజీ ఆర్మీ ఛీఫ్ జనరల్ దీపక్ కుమార్, (మార్చి2010లో రిటైర్ అయ్యారు), పాకిస్థాన్‌లో హైకమీషన్‌లో పనిచేసిన మాజీ భారత అధికారులు, కె.నట్వర్ సింగ్, కె.శంకర్ బాజ్‌పాయ్, శరత్ సబర్వాల్, టి.సి.ఏ. రాఘవన్, విదేశాంగ శాఖలో పనిచేసిన అధికారులు మాజీ విదేశాంగ శాఖకార్యదర్శి సల్మాన్ హైదర్, చిన్మయ ఘరేఖాన్. (రాజీవ్ గాంధీ ఆఫీసులో పనిచేశారు) యునైటెడ్ నేషన్స్‌లో పనిచేసిన ప్రముఖులైన డేవిడ్ గారు అలాగే పాకిస్థాన్ హైకమీషనర్ సొహైల్ మహమ్మద్ కూడా పాల్గొన్నారు.

సర్వసాధారణంగా జరిగే విధంగానే ఈ విందు కార్యక్రమం కూడా ఇంటిలిజెన్స్ బ్యూరో పరిశీలనలో ఉంది. ఈ విందు మూడుగంటలు జరిగిందని మోడీ చెప్పటమే అందుకు తార్కాణం. ఇక్కడ చర్చలు కూడా సీక్రెట్‌గా ఏమీ జరగలేదు. భారత-పాకిస్తాన్ మధ్య సంబంధాలను మెరుగు చేయటం గురించే అంతా మాట్లాడారు. మోడీ గుజరాత్ ఎన్నికల ర్యాలీలలో డిసెంబర్ 8 నుండి ప్రసంగించడం మొదలుపెట్టారు. డిసెంబర్ 7వ తేదీన అయ్యర్ చేసిన ప్రకటన "మోడీ ఒక నీచ్ ఆద్మీ (తక్కువ స్థాయివాడు) అనే దానితో తన ప్రసంగాన్ని ప్రారం భించారు." అయ్యర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ తగిన విధంగా స్పందించి అతనికి గుణపాఠం చెప్పింది. కాని మోడీ దానిని పక్కకు పెట్టి, ఆ అవకాశాన్ని ఉపయోగించి కాంగ్రెస్ ఒక అగ్రకుల పార్టీ అని ప్రచారం చేశాడు.

వాస్తవాలను తారుమారు చేస్తున్న ఆయన తన ప్రచారం ఈ విషయంతో ఆపలేదు. దేశద్రోహం, హత్యాయత్నం వంటి తీవ్రమైన ఆరోపణలతో అబద్ధపు ప్రచారాన్ని వ్యాపారంలా కొనసాగించాడు. ఉత్తర గుజరాత్‌లోని భబ్బర్‌లో మాట్లాడుతూ మణి శంకర్ అయ్యర్ తనను చంపడానికి సుపారీ కోసం పాకిస్థాన్ వెళ్ళివచ్చాడని ప్రకటించాడు. నేను ప్రధాని మంత్రి అయిన తరువాత ఈ వ్యక్తి (మణి) పాకిస్థాన్ వెళ్ళి కొంతమంది పాకిస్తానీయులను కలిసాడు. ఈ వివరాలన్నీ సోషల్ మీడియాలో అందుబాటులో ఉన్నాయి. "మోడీ మన

మార్గంలో అడ్డం ఉన్నత వరకు మన మధ్య సంబంధాలు మెరుగుపడవు" అని మణి ఆ మీటింగ్‌లో మాట్లాడినట్లు కనిపిస్తోందని పేర్కొన్నాడు. దారిలో ఉన్న అడ్డుని తొలగించాలి అంటే అర్థం ఏమిటి అని మోడీ ప్రజలను ప్రశ్నించారు. నాకు సుపారీ ఇప్పించడానికి నువ్వు పాకిస్తాన్ వెళ్ళావా? మీరు నాకు సుపారీ ఇవ్వదలచుకున్నారా? అని ప్రశ్నిం చాడు. మణి మీద ఆ పార్టీ ఎటువంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదు. మా అంబే (మాత అంబి) నన్ను కాపాడుతూ వస్తోంది, అని మోడీ పచ్చిగా ప్రజల మనోభావాలను రెచ్చగొట్టాడు. వాస్త వానికి మణి శంకర్ అయ్యర్ పాకిస్థాన్ వెళ్ళిన సంఘటన మూడు సంవత్సరాల క్రితం జరిగింది. 2015లో పాకిస్తాన్‌లో ఒక టెలివిజన్ చర్చల్లో పాల్గొన్న సందర్భంలో ఈ వ్యాఖ్యచేశాడు.

సాక్షాత్తు నరేంద్రమోడీ చేసిన అసత్య ప్రచారంతో ఎన్నో ప్రశ్నలు ముందుకు వచ్చాయి. సుపారీలను ఎవ్వరూ టి.వీలలోను, సోషల్ మీడియాలోను నిర్ణయించరు. 2015లో నరేంద్ర మోడీయే ప్రధానమంత్రి. ఒక విదేశీ టి.వి ఛానల్‌లో తన ప్రాణానికి వెలకట్టారని తెలిస్తే ఆయన ప్రధానమంత్రిగా ఎందుకు చర్యలు తీసుకోలేదు? కనీసం కాంగ్రెస్ పార్టీనైనా ఆయన అడిగాడా? అదీలేదు. ఒక ఇరానియన్ రాజకీయ నాయకుడు బి.బి.సి.లో మాట్లాడుతూ, ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్, అమెరికాల మధ్య సంబంధాలు మెరుగుపడవు అని అంటే, ఆఖరికి ట్రంప్ కూడా అది తన మీద హత్యా యత్నం అని అనలేదు. కాని మోడీ చాలా దుర్మార్గపు ఆలోచనతో ప్రజల మనోభావాలను రెచ్చగొట్టటానికి మత అంశాలను జోడించి, మాతా అంబాని అడ్డం పెట్టుకొని అబద్ధా లాడాడు. ఈ కోవలోనే అనేక అబద్ధాలు నిసిగ్గుగా ప్రచారంలో పెట్టాడు. హఫీజ్ సయీద్‌కి బెయిల్ రాగానే కాంగ్రెస్ పార్టీ సంబరాలు చేసుకుందని ప్రచారం చేశాడు. పాకిస్థాన్ అహమ్మద్ పటేల్‌కు మద్దతు ఇస్తోందని, డోక్లాం వివాదం జరుగుతున్నపుడు రాహుల్ గాంధీ చైనా రాయబారిని హత్తుకున్నారని పేర్కొన్నారు. దేశాల మధ్య సంక్షోభం ఏర్పడినపుడు, రాజకీయ నాయకులు, మేధావులు, జర్నలిస్టులు ఆయా దేశాల దౌత్యవేత్తలను కలుస్తూ ఉంటారు. అలా కలవాలి కూడా.

డిసెంబర్ 10వ తేదీన ఏలంపర్ ర్యాలీలో మాట్లాడుతూ మణిశంకర్ తో పాకిస్థాన్ బృందం

> "ఒక ఇరానియన్ రాజకీయ నాయకుడు బి.బి.సి.లో మాట్లాడుతూ, ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్, అమెరికాల మధ్య సంబంధాలు మెరుగుపడవు అని అంటే, ఆఖరికి ట్రంప్ కూడా అది తన మీద హత్యా యత్నం అని అనలేదు. కాని మోడీ చాలా దుర్మార్గపు ఆలోచనతో ప్రజల మనోభావాలను రెచ్చగొట్టటానికి మత అంశాలను జోడించి, మాతా అంబాని అడ్డం పెట్టుకొని అబద్ధాలాడాడు."



గుజరాత్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మోడి

నిన్న భేటీ అయిందని, ఆ మరునాడే అయ్యర్ గుజరాత్‌ని కించపర్చారని, వెనుకబడిన తరగతికి చెందిన తనను దూషించారని మాట్లాడాడు. ఈ పరిణామాలతో ఎన్నో సందేహాలు రేకెత్తుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ వీటికి సమాధానం చెప్పాలని డిమాండు చేసాడు. ఆయన ఉపన్యాసం కొనసాగిస్తూ ఇంకా ఇలా అన్నాడు. మీరు వార్తా పత్రికలు, టీ వీలలో చూస్తుంటారు, ఢిల్లీలో మణి శంకర్ అయ్యర్ ఇంట్లో నిన్న ఒక చర్చా కార్యక్రమం జరిగింది.. ఆయన మోడీని, గుజరాత్‌ని అగౌరవపర్చాడు. పాకిస్థాన్ హైకమిషనర్, మాజీ విదేశాంగ మంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి, మాజీ ప్రధానమంత్రి అయ్యర్ ఇంట్లో మూడు గంటలపాటు సమావేశంలో పాల్గొన్నారు. ఆ మరునాడే అయ్యర్ మోడీని (నన్ను) నీచుడని ప్రకటన చేసారు. ఇది చాలా సున్నితమైన, తీవ్రమైన సమస్య. ఎందుకంటే పాకిస్థాన్ హైకమీషనర్ కూడా పాల్గొన్నారు. అంతకన్నా గుజరాత్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం అంత సీక్రెట్‌గా జరగాల్సిన అవసరం ఏమిటి? అని ప్రశ్నించాడు.

ఆ మర్నాడు సనంద్ ర్యాలీలో ప్రసంగిస్తూ, మోడీ ఇవే అసత్యాలను ప్రచారం చేస్తూ, అయ్యర్, అహమ్మద్ పటేల్‌లకు పక్కదేశం నుంచి ్ర మద్దతు ఎందుకు వస్తున్నదని ప్రశ్నించారు. ఈ సారి పాకిస్థాన్ మిలటరీ మాజీ చీఫ్ రఫీక్‌ను కూడా ఇందులోకి లాగాడు. ఇదంతా చూస్తుంటే మన దేశానికి అనుమానం రాదా అని ప్రశ్నించారు. ఇది మన దేశ సార్వ భౌమత్వానికి ప్రమాదం కాదా అనిఅక్కడ పాల్గొన్న భారీ జనాన్ని ప్రశ్నించారు. మర్నాడు బరోడాలో మాట్లాడుతూ, అయ్యర్ గారు, భారత, పాకిస్థాన్‌ల మధ్య ఇంత ఎక్కువగా ఉద్రిక్తతలున్న నేపథ్యంలో మీ ఇంట్లో జరిగే సమావేశం గురించి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారా? ఇవ్వలేదు. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మన రాష్ట్రానికి విదేశీయులు ఎవరు వచ్చినా మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి తెలియచేసే వాడినని సెలవిచ్చారు.

ప్రతి ముఖ్యమంత్రీ విదేశీయులెవరిని కలిసినా కేంద్రానికి తెలియచేస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రయివేటు వ్యక్తి అలా చేయాల్సిన అవసరం లేదు. రెస్టారెంట్స్‌లోనూ, ఇళ్ళల్లోనే విందులు జరుగుతాయి. బహిరంగ పార్కులలో జరుగవు. అతిధులు ఎవరు అనేది అతని స్వంత విషయం. ఈ కేసు విషయంలో మోడీగారు మరింత

> “ఆ విందు సమావేశాన్ని ఇంటెలిజన్స్ బ్యూరో పర్యవేక్షించింది. దేశ రక్షణ సలహాదారు అజిత్ దోవల్ ఆ సమావేశం విషయాలన్నింటినీ ప్రధానమంత్రికి వివ రించారు. ఆ విందులో ఎవరు పాల్గొంది కూడా తెలియచేశారు. ఇదంతా తెలిసికూడా మోడీ తన ఉపన్యాసాలలో కేవలం నలుగురి పేర్లే ఎందుకు ప్రస్తావించారు? ”



గుజరాత్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధి

ముందుకెళ్ళి, భారతదేశ అధికారులెవ్వరు ఈ విందులో పాల్గొన లేదు, ఈ విందు గురించి ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం లేదని ఆరోపణలు గుప్పించారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కూడా ప్రధానమంత్రికి దౌత్య విధానాలు, ప్రైవేటు సమావేశాలు, వాటి విధి విధానాలు తెలియవని అనుకోవాలా? లేక తెలిసే నాటకమాడుతున్నారని భావించాలా? ఆయన ఉద్దేశాలు ఏమిటో ఆయన ప్రసంగాలే తెలియజేసాయి. ఆ విందు సమావేశాన్ని ఇంటెలిజన్స్ బ్యూరో పర్యవేక్షించింది. దేశ రక్షణ సలహాదారు అజిత్ దోవల్ ఆ సమావేశం విషయాలన్నింటినీ ప్రధానమంత్రికి వివ రించారు. ఆ విందులో ఎవరు పాల్గొంది కూడా తెలియచేశారు. ఇదంతా తెలిసికూడా మోడీ తన ఉపన్యాసాలలో కేవలం నలుగురి పేర్లే ఎందుకు ప్రస్తావించారు? కేవలం పాకిస్తాన్ హైకమీషనర్, పాకిస్ధాన్ మాజీ విదేశాంగ మంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీప్రధాని మన్మోహన్ సింగ్‌ని మాత్రమే పేర్కొని, మిగతా పెద్ద మనుషులు అందరిని వదిలి వేయటం వాస్తవాలను వక్రీకరించి, తన ప్రచారం కోసం ఉపయోగించుకోవటానికి ఉద్దేశ పూర్వకంగానే చేశాడు. వారి పేర్లుకూడా బహిరంగ పరిస్తే తన నాటకం బయట పడిపోతుంది కాబట్టి. ఈ విషయంలో మోడీ కపటంగా వ్యవహరించాడు. నిజాన్ని వెలుగు లోకి తీసుకురావటానికి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన లీజ్ మాథ్యూస్ సహాయం చేసారు. ఆ విందులో పాల్గొన్న ఇతర ప్రముఖుల పేర్లను కూడా ఆయన వెల్లడించారు. అందులో భారత మాజీ సైనికాధికారి, నలుగురు భారత మాజీ హైకమీషనర్లు (పాకిస్ధాన్ కి), మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి, ప్రపంచ ప్రఖ్యాత మాజీ దౌత్య అధికారి పాల్గొన్నారు. మరి మోడీ గారు వీరందరిని వదిలేసి, ఇద్దరు భారతీయులు, ఇద్దరు పాకిస్తానీయులు, కేవలం నలుగురినే ఎందుకు ఎంచుకున్నారు? అందులో ఈ పాకిస్తాన్ హైకమీషనర్ ఈ మధ్యనే నియమించబడ్డారు. కొత్తగా వచ్చిన అధికారిని ఈ విధంగానేనా మనం స్వాగతించేది?

### నిరంతర ప్రచారం

ఇటువంటి అసంబద్ధమైన, నీతిబాహ్యమైన ప్రచారాలను ఏదో ఒక స్టంటులా జరిగిందని మర్చిపోదామా? ఇది చాలా సిగ్గుమాలిన విషయం. మోడీ ప్రచారం ఒక పథకం ప్రకారం నిరంతరంగా కొన సాగుతోంది. దీనికి వ్యతిరేకంగా నిరసన సెగలు పెద్ద ఎత్తున రావటం లేదు. ఈ మధ్యకాలంలో జాతీయత పేరుతో, ,దేశభక్తి పేరుతో వ్యక్తుల మీద దాడులు జరుగుతున్నాయి. ఇవన్నీ విభజన వాదాన్ని మత కల్లోలాలను పెంచుతున్నాయి. ప్రభుత్వ విధానాలపై, దేశీయ, విదేశాంగ విధానాలపైన చర్చ జరగటం లేదు. దేశమంతా ఒక లెక్కప్రకారం విభజించ బడుతోంది. పరిణామాలు ఎలా ఉన్నా డిసెంబర్ 9,10 తేదీలలో జరిగిన ర్యాలీలలో మోడీ ఉపన్యాసాలు ప్రజలు నవ్వుకునే లా చేశాయి. మోడీ గమనించలేక పోయింది ఏమిటంటే తన విలువని తానే పూర్తిగా దిగజార్చుకున్నాడన్నది.

### పరిణామాలు

మోడీ ప్రవర్తన అనేక నైతిక అంశాలను లేవనెత్తుతున్నది. ఆయన చట్టానికి అతీతుడు కాదు. ఆయన ప్రవర్తన, ప్రసంగాలు చట్టపరమైన అనేక సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. అలాగే రాజకీయ పరిణామాలు కుడా జరుగుతాయి. కాని ఆ విందులో పాల్గొన్న వారెవరూ బహుశా పరువునష్టం కేసులు బనాయించి, న్యాయ పోరాటం ద్వారా మోడీకి వ్యతిరేకంగా పోరాటం చేయకపోవచ్చు. చేసినా అది ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలియని పరిస్థితి కూడా ఉంది. ఎన్నికల చట్టం కూడా కొంత లోపభూయిష్టంగా ఉంది. 1951 పీపుల్స్ రిప్రజెంటేషన్ చట్టంలో సెక్షన్ 1234 ప్రకారం, ఎవరైనా ఒక వ్యక్తి అభ్యర్ధి అనుమతితో అతని ప్రకటన అబద్దమని తెలిసి ప్రచురించినా, ఒక వ్యక్తి యొక్క గుణగణాల మీద అబద్ధాలు ప్రవచించినా, అతని అవకాశా లను దెబ్బతీసే విధంగా కావాలని మాట్లాడినా అవి అవినీతి చర్యలు అని మాత్రమే మన చట్టం పేర్కొంది. ఇది చాలా సంకుచితమైనది. ఇదే అమెరికాలో అనేక స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి ఉపన్యాసాలను పర్యవేక్షించి అబద్ధపు ప్రచారా లను, హానికరమైన అంశాలను వేలెత్తిచూపిస్తాయి మనకటువంటి వ్యవస్థలేదు. ఈ కేసు నేరపూరితమైనది గాను, సివిల్ కోర్టులో పరువు నష్టం దావాగానూ ఉంటుంది. ఈ మార్గంలో అనివార్యంగా వెళ్ళవచ్చు కాని ఎవరూ ముందుకు రాకపోవచ్చు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 499 ప్రకారం మోడీ ఉపన్యాసాలు ఈ పరువు నష్టం కోవలోకి ఖచ్చితంగా వస్తాయి. ఆయన తప్పనిసరిగా తన వ్యాఖ్యలన్నీ నిజమని నిరూపించాలి.

ప్రజా ప్రయోజనాల రీత్యా వారికి పరి ష్కారం చూపే దిశగా అమెరికా సుప్రీం కోర్టు “ప్రముఖ వ్యక్తులు” కోవలోకి వచ్చేవారికి

వెసులుబాటు కల్పిస్తూ ఇలా పేర్కొంది. ఎవరైతే ప్రముఖ వ్యక్తులను టార్గెట్ చేసి మాట్లాడతారో "వారు మాట్లాడేది అవతలి వ్యక్తిని భ్రష్టు పట్టించేది గాను ఉన్నా, అది అబద్ధమని తెలిసి మాట్లాడినా, అసలు అవి తప్పా ఒప్పా అనేది సంబంధం లేకుండా నిర్లక్ష్యంతో వ్యవహరించినా, అలా మాట్లాడిన వారందరూ శిక్షార్హులే " అని ప్రకటించింది. మోడీ ఈ మూడు కేటగిరీలకు ఖచ్చితంగా సరిపోతాడు.

అమెరికా సుప్రీంకోర్టు ఇంకా స్పష్టంగా దేశాధ్యక్షునికి ప్రత్యేక రక్షణ కవచం ఏమిలేదని చెప్పింది.ఇదే చట్టం ప్రధాన మంత్రికి కూడా వర్తిస్తుంది. అందువలన చట్టాలను చర్చకు పెడితే సమస్య యొక్క తీవ్రత తెలుస్తుంది. న్యాయపరమైన చర్యలు తీసుకోలేదన్నంత మాత్రాన సమస్య తీవ్రత తగ్గదు. హిట్లర్‌కి గోబెల్స్ ప్రచారం కావాల్సివచ్చింది. మోడీ నేరుగా హెచ్చరికలే చేస్తున్నాడు. ఒక రకమైన నియంతృత్వపోకడలు, దానికి సలాంచేస్తున్న నక్క వినయపు క్యాబినెట్ సహచరులు, స్తబ్దతతో లేదా నిస్సత్తువతో మీడియా, వానిని పెంచే ప్రక్రియలో క్యాబినేట్ సహచరులు, చాపక్రింద నీరులా సమాజంలో విద్వేషాలను, భయాందోళనలు రెచ్చగొడుతున్నారు.

మెక్ కార్తిజమ్ అనేది ఒక శూన్యవాదం. మోడీయిజం కూడా అదే. "ది ఎకనమిక్స్" లీడ్ ఎడిటోరియల్ జూన్ 29, 2017లో దానిని చక్కగా వర్ణించింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎగుమతుల వ్యాపారానికి దుస్సహమైన కొత్త నిబంధనలు పెట్టి హిందువులు గోవును గౌరవిస్తారనే నెపంతో ఆ వ్యాపారాన్ని దెబ్బతీశారు. యోగి ఆదిత్య నాద్‌ను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన నియమించాడు. ఆయన మనోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, గొడవలు సృష్టిస్తున్నారని నేరారోపణలు ఎదుర్కొంటున్నారు.

ఇప్పుడు అసలు భయమేమిటంటే, ఆర్థిక వ్యవస్థ మరలా డోలాయమానంలో పడితే, మోడీ తన పేరు ప్రఖ్యాతలు నిలబెట్టుకోవడానికి మరలా మతకల్లోలాలను లేవనెత్తిస్తారేమోనని. 1990లో భారతీయ జనతా పార్టీ ఇదే మార్గంలోఅధికారంలోకివచ్చింది అన్నది మర్చిపోవద్దు. 2002లో గుజరాత్‌లో అల్లర్లు జరిగినపుడు మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. సుమారు వేయిమందికి పైగా ముస్లిములు చంపబడ్డారు. ఈ రోజుకి కూడా ఆయన దానిని ఖండించడం కాని, జరిగిన దానిని నిరోధించలేక పోయానని విచారాన్ని కాని వ్యక్తం చేయలేదు.

**" హిందూ జాతీయవాద టక్కరులు, లౌకిక సాంప్రదాయాల నుండి ప్రభుత్వం వైదొలగుతోందని మాట్లాడుతున్న వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. కొద్దిమంది మీడియా యాజమాన్యాలు ధైర్యంచేసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, వారి ఆఫీసులపై ఏదో ఒక వంకతో పోలీసులతో దాడులు చేయి స్తున్నారు. "**


మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్


మణిశంకర్ అయ్యర్

మోడీ పరిపాలనలో ప్రజలకు సంబంధిం చిన విధానాల పైన చర్చలుకాని, మరీ ముఖ్యంగా మతసామరస్యంపైన చర్చలు క్షీణ దశలో ఉన్నాయి. హిందూ జాతీయవాద టక్కరులు, లౌకిక సాంప్రదాయాల నుండి ప్రభుత్వం వైదొలగుతోందని మాట్లాడుతున్న వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. కొద్దిమంది మీడియా యాజమాన్యాలు ధైర్యంచేసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే, వారి ఆఫీసులపై ఏదో ఒక వంకతో పోలీసులతో దాడులు చేయి స్తున్నారు. మతపరమైన తగవులు పెట్టేవారికి మోడీయే ఆరాధ్యుడుగా నిలిచాడు. వీటన్నిటి ద్వారా ఎన్నికలలో గెలవటం ఒక మార్గంగా ఆయన భావిస్తుండవచ్చు. కాని నిజం ఏమిటంటే, ఇది అంతిమంగా ఆయనను దౌర్భాగ్యమైన స్థితికి తీసుకువెళుతుందని నా భావన.

ఎట్టకేలకు భారతదేశపు బృహత్ సంపదను వెతికితీసే మగాడువచ్చాడనిమోడీ గారి భజన బృందం సంబర పడుతుండవచ్చు. కాని నిజా నికి నిరంతరంగా, వేగంగా అభివృద్ధి చెందు తున్న భారత దేశపు గొంతు నొక్కేసిన ఘనత చరిత్రలో ఆయనకు మిగులుతుంది. ఇప్పటికీ ఇంకా ఆందోళన పెంచుతున్న అంశమేమిటంటే ఇంకా మరింత చెడ్డరోజులు వచ్చే సూచనలు కానవస్తున్నాయి.

మోడీపై ప్రజల అభిమానం రోజు రోజుకి తరిగిపోతున్నది. కాబట్టి మరిన్ని అపవాదులు, నిందలు బయటకి రావచ్చు. ఆలోచించి చూడండి. మోడీ విశ్వసనీయత మీద వాటి ప్రభావం ఎలా ఉంటుంది?

ఢిల్లీలో బ్రిటీషు హైకమీషన్ అధికారి మోడీగారి గుజరాత్ నమూనా గురించి ఇచ్చిన రిపోర్టు మీ అందరికి గుర్తుందా? వీకీలీక్స్ దానిని బహిర్గతం చేసింది. ప్రతి విదేశీ కమీషనర్ మరీ ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలన్నింటి హైకమీషనర్ ఆఫీసులలో రాజకీయ విశ్లేషకులు, కాన్సలర్స్, మంచి స్థాయి ఉన్న అధికారులు నియమింపబడతారు. వారంతా భారత రాజకీయాలపై నిరంతరం నివేదిక లిస్తుం టారు. వారి విదేశాంగశాఖలు అవన్నీ నిరంతరం పరిశీలి స్తుంటాయి. మోడీగారి ప్రవర్తన ,వ్యాఖ్యలు గురించి వారందరూ ఏమి అంచనా వేస్తుంటా రనేది పెద్దగా ఊహించాల్సిన అవసరం లేదు.

❋

# హిట్లర్‌ను మట్టికరిపించిన రెడార్మీ

## (2వ పేజీ తరువాయి)

అదే వ్యవధిలో యూరప్ ప్రజలకి, ప్రపంచ ప్రజలకీ నాజీ పరిపాలనంటే ఏమిటో గూడా తెలిసి వచ్చింది. హిట్లరు జైత్రయాత్రలు ప్రారంభం అవటంతోటే యూరప్ ఉన్నత వర్గాల లోని కొన్ని తరగతులు అతన్ని బలపరిచాయి. యూరప్‌నంతటిని ఏకం చేస్తుందని ఆశించి కొందరు సాధారణ ప్రజలు గూడా జర్మన్ "న్యూ ఆర్డర్"కి అనుకూలంగా ఆలోచించ ప్రయ త్నించారు. నాజీలు యూరప్‌ని ఐక్యం చేయకపోగా 'జర్మన్‌జాతి' దురంహంకారం కింద బానిసత్వాన్ని, కరువుకాటకాలను ప్రసా దించారని రెండేళ్ల అనుభవం చాటిచెప్పింది. లక్షలకొలది యూదుజాతివారు, స్లావ్ జాతి వారు కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో మలమల మాడుతున్నారు. యూరప్‌లో యీ ద్వేషాగ్ని రగులుతుండగానే ప్రపంచ ప్రజాభిప్రాయం ఒకదారికి వస్తోంది. అమెరికా హిట్లర్ వ్యతిరేక ఆయుధాగారం గావడం ఎంతో ఉపయోగించింది. స్టాలిన్ ఆశించినట్లుగానే హఠాత్తుగా జరిగిన ఈ దురాక్రమణదాడి ప్రపంచ అభిప్రాయాన్ని ఒక దారికి తెచ్చేందుకు పనిచేసింది.

"బోల్షివిజానికి వ్యతిరేకంగా పవిత్ర పోరాటాన్ని సాగించాలంటూ" హిట్లర్ ఇచ్చిన పిలుపును ఖాతరుచేసిన వాళ్లులేరు. దాంతో ప్రపంచ ఎటు మొగ్గుతున్నదీ సూచనకనబడ్డది. పోప్ బోల్షివిక్కుల్ని ఖండిస్తాడని చాలామంది భావించారు. కాని పోప్ ఆ పని చేయలేదు. బోల్షివిజానికి ఆగర్భశత్రువైన చర్చిల్ తటస్థవైఖరి తీసుకుంటాడని కొందరు అనుకున్నారు. కాని "నాజీజానికి వ్యతిరేకంగా పోరాడే ఏ వ్యక్తికైనా మా సహాయం వుంటుంది. రష్యాకు ప్రమాదం వస్తే మనందరికీ వచ్చినట్లే "అని చర్చిల్ రష్యాను బలపరుస్తూ ఉత్సాహపూరితమైన ప్రకటన చేశాడు. నాల్గవవారంలో బ్రిటన్ సోవియట్ యూనియన్‌తో మిత్రత్వ సంధిపై సంతకం పెట్టింది. లండన్‌లో తలదాచుకుంటున్న పరాజిత యూరప్ ప్రభుత్వాలన్నీ వెంటనే బ్రిటన్‌ని అనుసరించి మిత్రత్వ సంధులు చేసు కున్నాయి. ఇదివరకు ఆశ కనపడని ఆ అజ్ఞాత ప్రభుత్వాలకు ఎప్పటికైనా ఇల్లు చేరగలమనే ఆశ జనించింది.

"ఆరువారాల ప్రతిఘటన లండన్, వాషింగ్టన్, ప్రవాస యూరోపియన్ ప్రభుత్వాల వైఖరిలో మార్పు తెచ్చింది' అని మెకార్మిక్ 'న్యూయార్క్ టైమ్స్'లో వ్రాశాడు. హిట్లర్ కబంధహస్తాలలో "బంధితమైయున్న యూరప్" వైఖరిలో గూడా మార్పు వచ్చింది. రహస్య ప్రతిఘటనోద్యమాలు త్వరగా అక్కడ తలెత్తాయి. 1941 ఆకురాలు కాలానికి అప్పుడే యూరప్‌లోని రహస్య ప్రతిఘటనా యుద్ధాలు ప్రాముఖ్యతకు వచ్చాయి. హిట్లర్‌ను రష్యా ప్రతిఘటించినందుకు, ప్రవాస ప్రభుత్వాలతో మిత్రత్వ సంధి చేసుకున్నందున, కమ్యూనిస్టుల నుండి రాచరిక వాదులవరకూ, యూరప్‌లోని నాజీ వ్యతిరేక శక్తులన్నీ ప్రతిఘటనోద్యమంలో ఐక్యమయ్యాయి. ఈ సందర్భంలో మనం కొన్ని విషయాలు గుర్తుకు తెచ్చుకోవాలి. అమెరికా, బ్రిటన్‌లలోనూ, యూరప్‌లోనూ సోవియట్ వ్యతిరేకశక్తులు బలంగా ఉన్నాయి. "జర్మనీ వాళ్లు గెలుస్తూ వుంటే మనం రష్యావాళ్లకు తోడ్పడాలి. రష్యావాళ్లు గెలుస్తూఉంటే జర్మనీ వాళ్లకు తోడ్పడాలి. ఆ విధంగా సాధ్యమైనంత ఎక్కువమందిని వాళ్లు చంపనీయండని అని యుద్ధారంభంలో సెనేటర్ హారీ ట్రూమన్ చెప్పాడు. ఈ విషయాలు గుర్తుంటే అకస్మిక దాడితో హిట్లర్ రష్యాలోకి చొచ్చుకుని పోయేవరకూ స్టాలిన్ వేచియుండటం తెలివి తక్కువాగాదు. నిర్లక్ష్యమూ గాదని బోధ పడుతుంది.

కృశ్చేవ్ 1956లో చెప్పినట్లుగా ఎర్రసేన దాడిని తట్టుకునేందుకు తయారైలేదని ప్రపంచ సైనిక నిపుణులెవరూ అప్పుడు భావించలేదు. పైగా ఎర్రసేనను ఎంతగానో కొనియాడారు. "1918 యుద్ధానికిగాక 1941 యుద్ధానికి శిక్షణపొందిన సేనను జర్మన్లు మొదటిసారి కలుసుకున్నారు" అని 1941 జూలై 29న జార్జిఫీల్డింగ్ ఇలియట్ వ్రాశాడు. "లోతైన రక్షణ స్థావరాలను ఏర్పరచుకొని బలంగా ప్రతిఘటించింది. విమానదాడి నుండి ఫిరంగి దళాన్ని కేమోఫ్లేజ్‌చేసి కాపాడటంలో జర్మన్ పాంజర్ దళాలపై ఆకస్మిక ఎదురుదాడులు చేసి అందుకు తమ విమాన బలగాన్ని తోడు చేసుకోవటంలో ఎర్రసేన ఎనలేని నైపుణ్యాన్ని ప్రదర్శించింది" అని గూడా అతను గుర్తించాడు. "వ్యూహంలో వాస్తవికత, ఎత్తుగడల్లో సామర్థ్యం, రూపంలో ఆధునికత్వం కలిగిన సైన్యం అది " అని 'న్యూ రిపబ్లికన్' పత్రికలో ఆగస్టు 14న తేదిన మేక్స్ వెర్నర్ వ్రాసాడు.

ఎర్రసేన చేతనున్న ఆధునిక ఆయుధ పరికరాలను చూసి సైనిక నిపుణులు మరీ ఆశ్చర్యపోయారు. పెద్ద టాంకు యుద్ధాలు జరిగాయి. సూటిగా ఎదుర్కొని జర్మన్ టాంకుల్ని తల్లకిందులు చేయగలిగిన, ధ్వంసం చేయ గలిగిన శక్తిగల టాంకులు రష్యావద్ద ఉండటం గమనార్హం. "ఒక ట్రాక్టర్ ఇస్తే దాన్ని నడుపుకోలేక తుప్పు పట్టేట్లు పొలంలో పారేసే రష్యన్ రైతులు ఇప్పుడు వేలకొలది టాంకుల్ని ఇంత సమర్థవంతంగా ఎలా నడుపుతున్నారు?" అని ఒక న్యూయార్కు పత్రికా సంపాదకుడు నన్నడి గాడు. దానికి కారణం పంచవర్ష ప్రణాళిక అనినేను చెప్పాను. 9 వారాల యుద్ధానంతరం 7500 మరతుపాకుల్ని, 4500 విమానాల్ని, 5000 టాంకుల్ని తాను నష్టపోయానని మాస్కో ప్రకటిస్తే ప్రపంచం విస్తుపోయింది. అంత నష్టానికి గురై గూడా ఆ సైన్యం ఇంకా పోరాడుతున్నదంటే దానివద్దనున్న సప్లయి యెంతగా వుండివుండాలి? ప్రపంచంలోకెల్లా ఆ దేశానిది "మొదటిస్థానమో, రెండవస్థానమో అయి ఉండాలి.

యుద్ధం ఇంకా కొనసాగిన తర్వాత, హిట్లర్ ఆధారపడిన మెరుపు యుద్ధపు టెత్తుగడపని రష్యన్లు పట్టారని సైనిక పరిశీలకులు ప్రకటించారు. టాంకుల్నీ, విమానాల్నీ, అత్యధిక సంఖ్యలో ప్రయోగించి శత్రుసేనల వెనుక గండికొట్టి చొచ్చుకుపోవడం, తన ఆయుధదళాన్ని ఎదిరిసైన్యం వెనకభాగానచేర్చి ఆ సైన్యాన్ని సప్లయి నుండి వేరుచేసి, హతమార్చడం హిట్లర్ ఎత్తుగడ. ఈ ప్రయోగం ఇంత వరకూ అన్ని దేశాల్లోనూ ఎదురులేకుండా జయించింది. "మానవశక్తి దీన్ని తట్టుకోలేదు" అని బెర్లిన్‌లోని అమెరికా రాయబారి నాతో అన్నాడు. దాన్ని రష్యన్లు రెండు పద్ధతుల్లో ఎదుర్కొన్నారు. ఆ రెండింటికి అంతులేని దీక్ష అవసరం. జర్మన్ టాంకులు చొచ్చుకువచ్చినప్పుడు ఆ టాంకులకూ, వాళ్లకాల్బలానికీ మధ్య సోవియట్ కాల్బలం మళ్లీ పోరాటం సాగించింది. అటు జర్మన్లూ, ఇటు రష్యన్లూ ఎక్కడపడితే అక్కడ చిందర వందరగా పోరాడడడంతో యుద్ధరంగంలో అరాచకం ఏర్పడ్డది. అక్కడి ప్రజలు రష్యన్ల ఆప్తులు గనక వారి సహాయం వుంటుంది. జర్మన్ల ఈ అది అగ్నిగుండం, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల రైతులు గెరిల్లా దళాలుగా తయారై ఎర్రసేనకు అండగా నిలిచారు.

ఆ విధంగా హిట్లర్ సత్వర విజయం కోసం ఆధారపడిన మెరుపుయుద్ధం రష్యన్లను ధ్వంసం చేయలేకపోయింది. జర్మన్ ఆర్థిక పరిస్థితి తట్టుకోలేని దీర్ఘకాల యుద్ధంలోకి హిట్లర్ ఈడ్వబడ్డాడు. "మొట్టమొదటిసారిగా, హిట్లర్

కొత్త వైశాల్యంలో పోరాడవలసి వచ్చింది" అని 'న్యూయార్ టైమ్స్' పత్రిక సంపాదకీయం వ్రాసింది. రచయిత భూగోళాన్ని గురించే మాట్లాడుతున్నాడు కాని "కొత్త వైశాల్యం" అంటే భూగోళానికి మించినది. హిట్లరు మొట్టమొదటిసారిగా, ఎంతకైనా తెగించి రక్షించుకుంటున్న మొత్తం ప్రజల్ని ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రజలకూ, సైన్యానికీ మధ్య సమన్వయం కుదుర్చుకోగలిగింది సోవియట్ ఎత్తుగడ. "ఫిరంగులు గర్జించేదే యుద్ధరంగం కాదు. ప్రతి కర్మాగారం. ప్రతి క్షేత్రం యుద్ధరంగమే" అనేది దాని నినాదం.

❝ మహత్తరమైన ద్నీపర్‌డాంను రష్యన్లు పేల్చివేయగా ప్రపంచం నిర్ఘాంతపోయింది. ఏ జాతీ పోరాడనంత తీవ్రంగా వారు పోరాడ సిద్ధమవుతున్నారని ప్రపంచం గ్రహించింది. పాశ్చాత్య పత్రికలు పేరుబెట్టిన సోవియట్ "సర్వవిధ్వంస" వ్యూహంలో ఇదొక సహజ సంఘటన మాత్రమే. రష్యన్లు ఈ మాటల్ని వాడలేదు. ప్రతిదాన్నీ ధ్వంసం చేయడం కార్యక్రమంగా వారు పెట్టుకోలేదు. ❞



స్టాలిన్‌గ్రాడ్‌లో సోవియట్ ప్రజల ప్రతిఘటన

రష్యాకు బ్రహ్మాండమైన మనుష్యబలం వున్నదని ప్రతివారూ గుర్తించారు. కాని యీ మనుష్యబలంలో గల స్వభావశక్తిగా ఎంతగా మారిందో తెలుసుకొన్నవాళ్లు కొద్దిమందే. ఉచిత వైద్యసదుపాయం, ప్రసూతి సందర్భంగా తల్లులయెడ, బిడ్డలయెడ చూపే శ్రద్ధ, యువతీయువకులకు ఇచ్చే శారీరక శిక్షణ, వారుపాల్గనే వ్యాయమ క్రీడలు జాతి ఆరోగ్యాన్ని పెంపొందించాయి. ఎత్తు, బరువు, ఛాతి వైశ్యాలం స్థిమితంగా నానాట పెరుగుతున్నట్లు సైనికలెక్కలు విధితం చేశాయి. రిక్రూట్ చేసుకున్న వారికి సైనిక విజ్ఞానం, విద్య ఆ సంవత్సరానికి సంవత్సరం అభివృద్ధి చెందాయి. శిక్షణ పొందిన స్త్రీలు లక్షోపలక్షలుగా రక్షణకు పాటుబడ్డారు. స్లపయి శాఖ, ఇంజనీరింగ్ శాఖ, రవాణాశాఖ, సైనిక వైద్యశాఖల్లో అంతా వాళ్లే. సైన్యంతో శారీరకంగా సహకరించడానికి ప్రజలు ఎక్కడిక్కడ సంసిద్ధులయ్యారు. "శ్రమకూ, రక్షణకూ, సిద్ధం'' అనే బాడ్జీలను 60 లక్షలమంది ధరించారు. నడక, పరుగు, దూకుడు, ఈత, తెడ్డువేయడం, మంచులో జారడం మొదలైన వాటన్నింటా శిక్షణపొంది సమర్థులుగా ఉత్తీర్ణులైనవారే వీరు, చాలామంది తమంత తాముగా పారాచూట్‌తో దూకడం నేర్చుకున్నారు. విశ్రాంతి విజ్ఞానవనాలలో చివరకు పిల్లలు సహితం ''పేరాచూట్ గోపురాల'' నుండి దూకడంలో సరదాపడేవారు.


సమిష్టి వ్యవసాయక్షేత్రం రూపం రక్షణావసరాలకు మహత్తరంగా సరిపోయింది. ప్రతి క్షేత్రానికి శ్రామికదళాలూ, వాటికి నాయకులూ వున్నారు. ఈ దళాలే సేనను గూడా తమవంటి సదుపాయాలను తామే చేసుకొనే శ్రామిక దళాలుగా పనిచేశాయి. ప్రతి క్షేత్రానికి నర్సింగ్ హోమ్‌లున్నాయి. శిక్షణపొందిన నర్సుల సహాయంతో వృద్ధమాతలు వాటిని నిర్వహించేవారు. సైనికుల్ని తీసుకువచ్చిన రైళ్లలో పిల్లల్ని ఎక్కించి యుద్ధరంగం వెనక్కు పంపడానికి ఈ నిర్మాణం తోడ్పడింది. ప్రతి క్షేత్రానికి పౌరరక్షణదళం వున్నది. ప్రతిదళానికి తుపాకి కాల్చడం ఆయుధాల్ని ఉపయోగించడం తెలుసు. తయారుచేసి వుంచిన గెరిల్లా దశాలు గా ఆ దశాలు అక్కరకు వచ్చాయి.

జర్మన్లు ఉక్రెయిన్‌లో ప్రవేశించగానే అక్కడి ధాన్యం పంటను దక్కించునేందుకు పోటీపడ్డది. ఈ ధాన్యాన్ని రక్షించుకోవడము తమ మొదటి కర్తవ్యము అని రైతులు భావించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ సహాయపడేందుకు పొలాలకు వెళ్లారు. యుద్ధరంగంలో మధ్యమధ్య ఖాళీ దొరికినప్పుడల్లా సైన్యం గుడా నూర్పిళ్లకు తోడ్పడ్డది. సెప్టెంబర్ 10 కి హిట్లరు సేనలు ఉక్రెయిన్ నడిగడ్డకు చేరుకున్నాయి. అప్పటికప్పుడే 60 శాతం పంట ధాన్యము అక్కడి నుండి తరలించబడ్డది. లక్ష కొలదీ రైతులు ట్రాక్టర్లను, ట్రక్కులనూ నడుపుకుంటూ గాని, సైన్యం వచ్చిన రైళ్లలో ఎక్కిగాని తూర్పుకు తరలిపోయారు. యూరప్‌లోని కాందిశీకులవలె వారు నిరుద్యోగులు కాలేదు. వారి పరికరాలను వారు తీసుకుపోయి మరొకచోట ఆహార ఉత్పత్తిలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు కావాలనిగాని, అవసరాన్ని బట్టిగాని జర్మన్ ఆక్రమిత ప్రాంతంలోనే వుండిపోయారు. వీరు వెనకనుండి పోరాడి జర్మన్లను వేధించారు.

మహత్తరమైన ద్నీపర్‌డాంను రష్యన్లు పేల్చివేయగా ప్రపంచం నిర్ఘాంతపోయింది. ఏ జాతీ పోరాడనంత తీవ్రంగా వారు పోరాడ సిద్ధమవుతున్నారని ప్రపంచం గ్రహించింది. పాశ్చాత్య పత్రికలు పేరుబెట్టిన సోవియట్ "సర్వవిధ్వంస" వ్యూహంలో ఇదొక సహజ సంఘటన మాత్రమే. రష్యన్లు ఈ మాటల్ని వాడలేదు. ప్రతిదాన్నీ ధ్వంసం చేయడం కార్యక్రమంగా వారు పెట్టుకోలేదు. శత్రువుకు అందకుండా తమ ఉపయోగార్థం అన్నింటినీ తీసుకుపోవడం వారు పనిగా పెట్టుకున్నారు. శత్రువు దగ్గరకు వస్తుండగానే ప్రతి పరిశ్రమలోనూ కార్మికులు దళాలుగా ఏర్పడేవారు. యంత్రాలను వేటికవిగా విడగొట్టి గ్రీజు రాసి ప్యాకింగు చేసి తూర్పుదిశకు తరలించేవారు. ఆ విధంగా కార్మికులు తమ యంత్రాలను తామే తీసుకుపోయి సైబీరియాలోనో, యురల్స్ పర్వతాలలోనో నిర్ణయించినచోట మళ్లీ పరిశ్రమల్ని నెలకొల్పారు.

ఖార్కోవ్ పట్టణాన్ని జర్మన్లు ఆక్రమించుకునే రోజువరకూ ఒక్కరోజు గూడా వృధాపోకుండా టాంకుల్ని ఉత్పత్తి చేయగలిగామని ఖార్కోవ్ ట్రాక్టర్ యంత్రాగార కార్మికులు గర్వంగా

“ ‘బ్రహ్మాండమైన ఆ ప్రజానీకం పని చేస్తుండగా చూడటానికి నాకే భయం వేసింది’ అని పట్టుబడిన ఒక జర్మన్ పైలట్ అన్నాడు. చెల్లాచెదురయ్యే ప్రజలను విమానం నుండి భీతావహులను చేయటం తన పనిగా ఆ పైలట్ పెట్టుకున్నాడు. తమ సైన్యం కోసం, దేశం కోసం సాహసంతో దుర్గాల్ని నిర్మిస్తున్న ఆ ప్రజాసమూహాన్ని చూస్తే అతడికి భయం వేసింది. ”



రెడ్‌స్క్వేర్‌లో జరిగిన సైనిక కవాతు నుండి తిన్నగా యుద్ధరంగానికి తరలిపోతున్న సోవియట్ సైనికదళాలు

చెప్పుకున్నారు. అప్పటికే యంత్ర పనిముట్లు తీసుకుని చాలామంది తూర్పుకు వెళ్లిపోయారు. కాని అదివరకే తయారైయున్న విడి భాగాలన్నింటిని జేర్చి ట్యాంకుల్ని చేసి వాటి శత్రువుపై ప్రయోగించేందుకు అవసరమైనంతమంది కార్మికులు అక్కడే వుండిపోయారు. ఈ కర్మాగారంలో ఇంకా ట్యాంకుల ఉత్పత్తి ఆగక ముందే అసలు కర్మాగారం మరొకచోట నుండి ట్యాంకుల్ని ఉత్పత్తిచేయడం ప్రారంభించింది.

సోవియట్ వ్యూహంముందు హిట్లరు వ్యూహం ఎలా నీరుగారిపోయిందీ “లాస్టు ట్రెయిన్ ఫ్రం బెర్లిన్” అనే పుస్తకంలో హోవార్డు స్మిత్ వర్ణించాడు. యూరప్‌ను దోచుకుని జర్మను యుద్ధతంత్రం కొవ్వెక్కింది. జర్మన్ ప్రజలు కండబట్టారు. కాని హిట్లరు రష్యా ప్రవేశంతో వారికి పస్తులు ప్రారంభమయ్యాయి. జర్మన్ సేనలు ద్నీపర్‌డాం అవతలిగట్టునుండి చూస్తే ఫ్యాక్టరీ భవనాలన్నీ కనపడ్డాయి. ఉన్నవి ఉన్నట్టుగా నేటికాపరిశ్రమలన్నీ చేజిక్కినాయిగదా. అని సంతోషించారు. కాని తీరా భవనాల వద్దకు వచ్చి చూస్తే యంత్రాలేగాదు, చివరికి ఒక్కచీలమేకు గూడా లేదు. “రక్షణ అంటే అదీ” అన్నాడు స్మిత్.

‘బ్రహ్మాండమైన ఆ ప్రజానీకం పని చేస్తుండగా చూడటానికి నాకే భయం వేసింది’ అని పట్టుబడిన ఒక జర్మన్ పైలట్ అన్నాడు. చెల్లాచెదురయ్యే ప్రజలను విమానం నుండి భీతావహులను చేయటం తన పనిగా ఆ పైలట్ పెట్టుకున్నాడు. తమ సైన్యం కోసం, దేశం కోసం సాహసంతో దుర్గాల్ని నిర్మిస్తున్న ఆ ప్రజాసమూహాన్ని చూస్తే అతడికి భయం వేసింది.

కొన్ని సంవత్సరాలకు పూర్వమే ఇంకా బ్రిటిష్, ఫ్రెంచి సైనిక నిపుణులు 1914 నాటి ఫ్రెంచి యుద్ధాన్ని గురించే ఆలోచిస్తూండగానే, ఎర్రసేనకు చెందిన పత్రికలు మెరుపు యుద్ధాల్ని గురించి వూహించాయి. మెరుపు యుద్ధాలు బలహీనమైన శత్రువును వెంటనే పడగొట్టి వేస్తాయి. విజేతకు పెద్దనష్టం కలగదు. అయితే సమానమైన శక్తిగల దేశాలు తారసిల్లినప్పుడు మెరుపు యుద్ధం వెంటనే విజయం పొందక పోతే దీర్ఘకాల యుద్ధంగా మారుతుంది. అప్పుడు జయాపజయాలు వారి వారి ఆర్థిక వనర్లమీద, యుద్ధనిలవలమీద, ప్రజల నైతిక శక్తి మీద ఆధారపడుతుంటాయని ఆ పత్రికలు వ్రాశాయి. జర్మన్లు– రష్యన్లు ఇప్పుడా పరీక్షలలో ఎదురుబొదురుగా నిలబడ్డారు.

1941 నవంబరు నాటికి నాజీలు ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కీవ్‌ను లూటీ చేశారు. ఉత్తరపు దుర్గం లెనిన్ గ్రాడ్‌ను చుట్టుముట్టారు. మూడువైపులా నుండి మాస్కో పరిసరాలలోకి వచ్చి శిఖరాలకు కనుచూపు మేరలో వున్నారు. పెద్దపెద్ద పట్టణాల కోసం పోరాటం ప్రారంభమైంది.

ఆధునిక పట్టణాలు వాటంతటవి రక్షించు కోలేవు. చాలాదేశాల్లో పురజనులు తాము గూడా యుద్ధం చేయాలని భావించరు. జర్మన్లు ఫ్రెంచి సేనను ఓడించిన తర్వాత పారిస్ పట్టణాన్ని “ఒపెన్‌సిటి”గా ప్రకటించారు. నాజీలు సురక్షితంగా పారిస్‌లో ప్రవేశించారు. ప్రభుత్వమూ, సేనానాయకులూ, పారిపోయిన తర్వాత కూడా వార్సా మేయరు వీరోచితంగా ప్రతిఘటిస్తూంటే ప్రపంచం ఆశ్చర్యపడ్డది. పూర్వకాలంలో పట్టణాలే కోటలుగా మారి ఎంత బ్రహ్మాండంగా రక్షించుకునేవో మనం మరిచిపోయాం. కాని స్టాలిన్ మరవలేదు. లెనిన్ గ్రాడ్‌ను అజేయమైన కోటగా చేయడానికి ఫిన్లండు యుద్ధాన్ని కొనసాగించాడు. గృహనిర్మాణాన్ని కొనసాగించడంతోపాటే ప్రచారం చేయకుండా ప్రపంచంలోకల్లా బలవత్తరమైన కోటనగరంగా ఆయన మాస్కోను తయారుచేశాడు.

మధ్య యుగాలనాడు మాస్కో కోటనగరమే. గోడల మధ్యనున్న క్రెమ్లిన్ దాని నడిబొడ్డు. దానికి మైలుదూరంగా చుట్టూ రాతిగోడవుండేది. రెండుమైళ్లు అవతలగా చుట్టూ మళ్లీ మట్టి కట్టలుండేవి. ఆ గోడ, మట్టికట్టడాల స్థానాల్లో రెండు వలయాలుగా చెట్ల రోడ్లను వేశారు. చక్రంలోని అకులవలె పది రహదారులు మాస్కో కేంద్రస్థానం నుండి బయటికివెళ్లుతున్నాయి. ఈ వలయాలు ఆ రహదారుల్ని కలుపుతాయి. ఒక ప్రధానమైన రైలు మార్గానికి కొమ్మలవలె పదకొండు రైళ్లు లంకెబడి వున్నాయి. పంచవర్ష ప్రణాళికల కాలంలో వీధుల్లోనూ, రహదారుల్లోనూ అటుఇటూ రష్యను చలికాలానికి తట్టుకో గలిగినంత దట్టమయిన గోడలతో నాలుగు అంతస్థుల కాంక్రీటు భవనాల్ని నిర్మించారు. వలయాల్లోని చెట్లను కుళ్లగించి పెరళ్లలోనూ, పార్కులలోనూ నాటించారు. దానికి సౌందర్య పిపాసులు నిట్టూర్పు విడిచారు. కాని యుద్ధం వచ్చిన తర్వాత టాంకుదళాలు, ఫిరంగి దళాలు, గంటకు 40 మైళ్ల వేగంతో 6 సోలుపులుగా నగరంలో ఏ ప్రాంతానికైనా ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కదలగలవనీ, అటు ఇటూ కోటగోడలవలె నాలుగు అంతస్థుల మేడలు కాపాడు తుండగా ఎటు అవసరమైతే అటు కాల్పులు

సాగించగలవనీ విదితం అయ్యింది. ఆధునిక దుర్గాలు కేవలం గోడలతోనే నిర్మించబడటం లేదు. మానర్హీమ్ దుర్గ శ్రేణుల్ని మేగినాట్ విచ్ఛిన్నం చేసిన తర్వాత యీ విషయం దృఢ పడ్డది. దుర్గంలో పెద్దపెద్ద సైన్యాలు అటూ ఇటూ సురక్షితంగా కదలడానికి అవకాశం ఉండాలి. మాస్కో ఆ అవకాశాన్ని ఇచ్చింది. యుద్ధావసరాలన్నీ పట్టణంలోనే తయారయ్యాయి. నగరం వెనుక వున్న లిగ్నయిట్ గనులనానుకొని పవర్‌స్టేషన్ వున్నది. నగరంలో తూర్పువైపున వున్న విమానాశ్రయాలను ఆధారం చేసుకొని ఆకాశరక్షణలు ఏర్పరచబడ్డాయి.

విదేశరాయబార కార్యాలయాలతోపాటు సోవియట్ ప్రభుత్వం బాగా వెనకతట్టున వోల్గానది ఒడ్డునున్న క్యూబిషేవ్ పట్టణానికి తరలిపోయింది. పిల్లలు ఉపాధ్యాయులతోపాటు దూరాన ఉన్న యూరల్సు పర్వతాలలోకి పోయి ఆక్కడ రెండు సంవత్సరాలుండిపోయారు. యుద్ధానికి అవసరం గాని పురజనుల్ని గూడా వెనక్కు పంపివేశారు. మాస్కోయే యుద్ధరంగం. అక్కడి ప్రజలు 1600 క్యాలరీల ఆహార రేషన్‌తో గడపవలసి వచ్చింది. ఇళ్లకుగాని, స్కూళ్లకుగాని బొగ్గు సప్లయి లేదు. యుద్ధపరిశ్రమలకే బొగ్గు, సాయంకాలం 4 గంటలనుండి ప్రారంభమయ్యే చలికాలపు దీర్ఘరాత్రుళ్లంతా వారి ఇళ్లకు విద్యుద్దీపాలు లేవు. మందుగుండు పరిశ్రమలకే విద్యుచ్ఛక్తి. ప్రజలు 12 గంటలూ పనిచేసి ఇల్లుచేరి చీకట్లో ముసుగువేసుకొని పడుకునేవారు. మరీ ప్రమాదభరితమైన రోజుల్లో మాస్కో రేడియోలో పనిచేసే నా స్నేహితురాలు పక్కముట్టగూడా ఆఫీసుకే తీసుకుపోయి 29 గంటల డ్యూటీ చేసింది. ఆ విధంగా ఆమె తనతోపాటు పనిచేస్తున్న ఇద్దరు పురుషుల్ని నగరం వెలుపల రక్షణకై కందకాలు తవ్వడానికి పంపించగలిగింది.

స్టాలిన్ మాస్కో వదలలేదు. పరిసరాల నుండి జర్మన్ శతఘ్నులు గర్జిస్తుండగా, మాస్కోను అప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు హిట్లర్ ప్రకటిస్తుండగా 1941 నవంబర్ 7వ తేదిన రెడ్‌స్క్వేర్‌లో స్టాలిన్ సైనిక ప్రదర్శనల్ని పరిశీలించాడు. ఆ ఘటన. మాస్కో ప్రజలకు ధైర్యోత్సాహాల నిచ్చింది. తమ సేనానాయకత్వం క్రింద రక్షణ కీకలం అయిన మాస్కో తమ చేతుల్లోనే వున్నదని వారికి ఆ ఘటన గుర్తుచేసింది. ఆ శీతాకాలంలోనే శత్రుసేనల్ని 60 మైళ్లు వెనక్కునెట్టి అక్కడ నుండి అడుగు ముందుకు కదలనీయలేదు.

**❝ స్టాలిన్ మాస్కో వదలలేదు. పరిసరాల నుండి జర్మన్ శతఘ్నులు గర్జిస్తుండగా, మాస్కోను అప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు హిట్లర్ ప్రకటిస్తుండగా 1941 నవంబర్ 7వ తేదిన రెడ్‌స్క్వేర్‌లో స్టాలిన్ సైనిక ప్రదర్శనల్ని పరిశీలించాడు. ఆ ఘటన. మాస్కో ప్రజలకు ధైర్యోత్సాహాల నిచ్చింది. తమ సేనానాయకత్వం క్రింద రక్షణ కీకలం అయిన మాస్కో తమ చేతుల్లోనే వున్నదని వారికి ఆ ఘటన గుర్తుచేసింది. ❞**

లెనిన్ గ్రాడ్‌పట్టణం మరింత అగ్నిపరీక్షకు గురైంది. రెండున్నర సంవత్సరాల కాలం అది కాల్పుల మధ్య ముట్టడిలో ఉంది. అక్కడి ప్రజలు అయిదు స్లైసులరొట్టేతోనూ, రెండుగ్లాసుల వేడినీళ్లతోనూ కొంతకాలం బ్రతికారు. ఈ రేషన్ తోనే వారు మందుగుండు సామాగ్రి తయారుచేసి జర్మన్‌లతో పోరాడారు. లెనిన్ గ్రాడ్‌లో జర్మనీ వాళ్ల తుపాకీ గుండ్లకంటే ఆహార కరువుతో చనిపోయిన వారెక్కువ. మాంసకృత్తులు తక్కువై చచ్చిపోయారుగాని పూర్వకాలపు నగరాల్లో వలె వారు ప్లేగుతో చనిపోలేదు. పార్కుల్లోని పైన్ చెట్ల యీనెల్నుండి సి విటమిన్లను ఎలా పొంద వచ్చునో వారికి శాస్త్రజ్ఞులు నేర్పారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు షాష్టకోదిచ్ ఆకాశ రక్షకుడిగా పనిచేశాడు. జర్మన్లు ఇళ్లకప్పులపై వేసిపోయిన మంటల బాంబుల్ని ఏరి ఆయన అవతల పారవేసేవాడు. మధ్య వ్యవధి వున్నప్పుడల్లా సంగీత గేయాలు రచించి పోరాటానికీ, విజయవానికి వాటిని అంకితం చేశాడు. ఆ ముట్టడి కాలం అంతా అక్కడున్న పౌరులకు 'లెనిన్‌గ్రాడ్' అనే మెడల్‌ను ప్రభుత్వం బహుకరించింది.

రెండవ సంవత్సరపు యుద్ధంలో గూడా జర్మన్లు ఇంకా పురోగమించారు. ఉత్తరాన లెనిన్ గ్రాడ్ వారిని అడ్డింది. మధ్యరంగంలో మాస్కోఅడ్డింది. కాని దక్షిణాదిని మెట్ట మైదానాల్లో గుండాబడి ఉత్తర కాకసస్ పంట భూముల్నీ, స్టాలిన్ గ్రాడ్ పట్టణాన్ని చేరుకున్నాయి. ఆ పట్టణం మైదానంలో వున్నది. స్వతస్సిద్ధమైన రక్షణదానికేమీ లేదు. వోల్గానది ఒడ్డున 30 మైళ్ల మేరకు ఫ్యాక్టరీలతో అదినిండియున్నది. ఉత్తరాదిన లెనిన్ గ్రాడ్‌కు వలెనో దక్షిణాదిని స్టాలిన్‌గ్రాడ్ ఎర్రసేనకు లంగరుగా పనిచేసింది.

"ఎలాగైనా స్టాలిన్ గ్రాడ్‌ను పట్టాలి" అని 1942 వేసవిలో హిట్లర్ ఆజ్ఞాపించాడు. స్టాలిన్‌గ్రాడ్ పతనమైతే దిగువనుంచి మాస్కోను చుట్టుముట్టడానికి మార్గం దొరుకుతుంది. బాకూ నూనెగనులకూ, భారతదేశానికీ, ఇరాన్‌కూ, చైనాకు చెందిన టర్కిస్తాన్‌లో జపానువాళ్లను కలుసుకునేందుకూ అది కవాటం తెరుస్తుంది. ఏ రోజుబట్టినా వెయ్యి విమానాలు, వెయ్యి టాంకులు ఈ ఒక్కపట్టణాన్నే ఢీకొన్నాయి. సెప్టెంబరు మధ్యకాలానికి యీ కోటా రెండువేల విమానాలకూ, రెండువేల టాంకులకూ పెరిగింది. జర్మన్లు స్టాలిన్‌గ్రాడ్‌ను దజను ముక్కల క్రింద నరికారు. తాను స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకున్నానని అనేకసార్లు హిట్లరు ప్రకటించాడు. దానిలో ఎక్కువ భాగాన్ని వశం చేసుకున్నమాట నిజమే. కాని దానిలోని ప్రజల్ని జయించలేకపోయాడు.

'వోల్గా వెనుక నిలబడేందుకు నేలలేదు' అనేది స్టాలిన్ గ్రాడ్ నినాదం. వీధివీధికి, ఇంటింటికీ, గదిగదికి పోరాటం జరిగింది. ఈ పోరాటంలో తుపాకుల్నీ, గ్రెనేడ్స్‌నీ, కత్తుల్నీ, వంటింటి కుర్చీలనీ, సలసలకాగే వేడీనీళ్లని అన్నింటిని వాడారు. అక్కడి టాంకు ఫ్యాక్టరీ టాంకుల్ని ఉత్పత్తి చేస్తూనే వున్నది. అవి ఫ్యాక్టరీ గేటునుండే సరాసరి పోరాటంలోనే దూకాయి. 'దెబ్బతినని ఇల్లులేదు, అని జర్మనీవాళ్లు రిపోర్ట్స్, ప్రజలు గుహల్లోంచి, కోట్లలోంచి పోరాడారు. "ధైర్యముంటే ఏ రాతిగుట్ట అయినా కోటగా పనిచేస్తుం" నే మాట ఆనోట ఆనోట ప్రచారం అయింది. "పునరాక్రమించుకున్న ప్రతి గుట్టా మనకు కాలవ్యవధినిస్తుంది" అని స్టాలిన్ తంతి పంపాడు. ఆ విధంగా స్టాలిన్ గ్రాడ్ ప్రజలు 182 రోజులు పోరాడారు. అప్పటికి సైబీరియాలో శిక్షణ పొందిన కొత్త సేనలు మైదానాన్ని దాటివచ్చి పిన్సర్ ఎత్తుగడల్లో జర్మన్లు పట్టణాన్ని పట్టుకున్నాయి. 3 లక్షల మందిఆ వలలో చిక్కారు. 1943 ఫిబ్రవరి 2వ తేదిన వాళ్లు లంగిపోయారు.

ఇక్కడ్నుంచే యుద్ధరంగమంతంటికీ ప్రవాహం మళ్లింది ఇక్కడే ఈ వీరోచిత వోల్గా

**❝ అప్పటికి ఇంకా రెండు సంవత్సరాలకు పైగా కఠోర యుద్ధ భారాన్ని భరించవలసి యున్నది. అయితే స్టాలిన్ గ్రాడ్ నుండి నెమ్మదిగా జర్మన్లను వెనక్కుగొట్టారు. 1943లో ఉక్రెయిన్ నుండి వెళ్లగొట్టారు. 1944 వేసవికి సోవియట్ సరి హద్దుల్నుంచి నాజీలను తరిమివేశారు. జులై చివర సోవియట్ సేనలు వార్సాలో నాజీలను ఎదుర్కొన్నాయి. ❞**



**జర్మన్ పార్లమెంటు భవనంపై అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సోవియట్ సైనికులు**

గ్రాడ్ పట్టణంలోని స్త్రీ పురుషుల ముందే ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకునేందుకు బయలుదేరిన జర్మన్ దాడి భగ్నమైంది.

అప్పటికి ఇంకా రెండు సంవత్సరాలకు పైగా కఠోర యుద్ధభారాన్ని భరించవలసి యున్నది. అయితే స్టాలిన్ గ్రాడ్ నుండి నెమ్మదిగా జర్మన్లను వెనక్కుగొట్టారు. 1943లో ఉక్రెయిన్ నుండి వెళ్లగొట్టారు. 1944 వేసవికి సోవియట్ సరి హద్దుల్నుంచి నాజీలను తరిమివేశారు. జులై చివర సోవియట్ సేనలు వార్సాలో నాజీలను ఎదుర్కొన్నాయి. 1945 ఏప్రిల్‌లో ఎర్రసేన బెర్లిన్ లో నిలిచింది. యుద్ధానంతర ప్రపంచాన్ని తీర్చిదిద్దేందుకు జూన్‌లో ఫ్రాన్సిస్కో నగరాన ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డది.

సోవియట్ యూనియన్‌లో ప్రజలు జర్మన్లు పాడుచేసిన భూముల్ని బాగుచేసుకునేందుకు మరలారు. చెంఘిజ్‌ఖాన్ రోజులయింతర్వాత చరిత్రలో ఇంత విధ్వంసం ఎప్పుడూ జరగలేదు. పరాజయం పొందిన జర్మన్ సేనలు తమ ప్రపంచ విజయానికి అడ్డుతగిలిన ప్రజా నీకాన్ని ఊచకోత కోశారు. లక్షలాది ప్రజల్ని చిత్రహింస చేసి చంపారు. గ్యాస్‌గదుల్లో మగ్గపెట్టి చంపారు. ఇళ్లలోనే వుంచి నిప్పుపెట్టి చంపారు. పశు గణాన్నంతటిని కసాయిశాలల్లో నరికి వేశారు. 30 లక్షలమంది ప్రజల్ని బానిసలుగా పట్టుకు పోయారు. దక్షిణ రష్యాలోనూ, ఉక్రే యిన్‌లోనూ రెండున్నరకోట్లమందిని నిర్వాసుల్ని చేశారు.

పోలెండు గుండా బెర్లిన్‌కు పురోగమిస్తున్న సోవియట్ సేనల్ని గురించి ఏమీ చెప్పకుండా నేను ఈ అధ్యాయాన్ని ముగించలేను. యుద్ధ రంగానికి వెనుకనున్న వార్సా, లాడ్‌జి పట్టణాల నుండి నేను పరిస్థితుల్ని గమనించాను. మూడేండ్ల క్రితం ప్రపంచంలోకెల్లా శక్తివంతమైంది జర్మన్ సైన్యం. ఆ సైన్యాన్ని తరుముతూ ప్రపంచంలో కెల్లా శక్తివంతమైనదిగా మారింది ఎర్రసేన. నిర్దాక్షిణ్యమైన మూడు సంవత్సరాల కాలం రష్యన్లను ఒక రూపానికి తెచ్చింది. జర్మన్ల వలెగాక వారిలో ఇంతకుముందే 'నూతన ప్రజా లక్షణాలు' అభివృద్ధి అయినాయి. సమిష్టి శక్తిలో భాగంగా వారిలో వ్యక్తిగత చొరవ అభివృద్ధి చెందింది. నేను యుద్ధంలో పాల్గన లేదు. అయినా చెప్పగలను- సోవియట్ ప్రజలు మహత్తరమైన ఐక్యతతో ఏక తాటిమీద నడిచారు.

1944 అకురాలు కాలం చివరికి ఎర్రసైనికులు వార్సాకు ఎదురుగా విస్తులానది వొడ్డుకు చేరుకున్నారు. నదికి పశ్చిమాన బురద భూములున్నాయి. టాంకులు నడవవు. ఆ మహత్తర పురోగమనం ఆ బురద ఆ రేవరకు కొన్నాళ్లాగి పోవలసి వచ్చింది. సోవియట్ లోనున్న ప్రవాసులతో పోలిష్ సైన్యాన్ని తయారుచేశారు. రంగంలో ఆ సైన్యం మధ్య నిలిచింది. ఎదురుగా వారి వార్సా పట్టణం విధ్వంసమౌతుంది. జర్మన్లు గోడగోడను పేల్చివేస్తున్నారు. ఇంటింటినీ తగుల బెడుతున్నారు. వాళ్లరక్షల్ని బద్దలు గొట్టేందుకు ఇటు పోలిష్ సైన్యంనద్ద ప్రతి ఏడడుగులకి ఒక శతఘ్ని వున్నది.

జనవరి 12 శుక్రవారం నాడు ప్రథమ ఉక్రేనియన్ సైన్యం మార్షల్ కొనివ్ నాయకత్వాన దక్షిణ పోలెండులో 9 రక్షణ శ్రేణుల్ని బద్దలు చేసుకొని రెండు రోజుల్లో 25 మైళ్ళు పురోగమించింది. ఆదివారానికి రెండు కొత్త సేనలు పడమటి దిక్కుకు పురోగమనంలో కలుసు కున్నాయి. బైలోరష్యన్' పోలిష్ ప్రథమ శ్రేణులు మార్షల్ ఝుకోవ్ నాయకత్వాన రెండురోజుల్లో 1200 గ్రామాలను విముక్తిచేస్తూ మధ్యరంగానికి చేరాయి. బైలోరష్యన్ ద్వితీయ శ్రేణికి నాయ కత్వం వహించిన మార్షల్ కొసంస్కి ఉత్తరం నుండి వచ్చిచేరాడు. సాయుధ సేనలు చరచరా ముందుకుసాగాయి. ఝుకోవ్ ట్యాంకులు ఒక్క రోజుల్లో 70 మైళ్లు పురోగ మించాయి. పడమటికి నడుస్తున్న రైలులైన్లను ఎప్పటికప్పుడు సోవియట్ కార్మికులు తమకవసరమైన గేజ్‌లోకి మార్చుతు న్నారు. 2 వేలమైళ్ల వెనుకవున్న యూరల్సు నుండి సప్లయిలు. నిర్విరామంగా వచ్చి పడుతు న్నాయి. మందుగుండు సప్లయి చూసి ప్రపంచసైనిక నిపుణులు నివ్వెరపోయారు.

నాకు మిలిటరి పరిజ్ఞానం లేకపోయినా పటంలో ఆ సేనల కదలికను చూచినప్పుడు ఒకరినొకరు సకాలంలో తోడ్పడుతూ, పక్కనుండి ఆకస్మికంగా ఆ పట్టణాలను ముట్టడించి స్వాధీనం చేసుకోవడంలో ఎంతగా సమన్వయం జరిగిందా అనిపించింది. అనుకున్నట్టు తూర్పు దిక్కునుండి గాక మిగతా మూడు దిక్కుల నుండి వార్సాను ఝుకోవ్ ముట్టడించారు. కొనీవ్ దక్షిణ పోలెండుగుండా జర్మనీ సరిహద్దున ఒక కోట నగరాన్ని వశం చేసుకొని బెర్లిన్‌వైపు నుండి వార్సా ప్రవేశించాడు. మారణ ఫ్యాక్టరీలు ఇంకా పనిచేస్తూనే వున్నాయి. మాడ్చివేయబడనున్న 9 వేలమంది యూదులను వారు విముక్తిచేశారు. సామాన్యంగా ఓడిపోయి తిరోగమిస్తున్నప్పుడల్లా యూదు, స్లావ్ జాతి ఖైదీలను మారణ యంత్రాలలో పెట్టి మాడ్చివేయడం నాజీలకు అలవాటు. కోనీవ్ సేనలలో ఒక భాగం గిర్రున తిరిగి ఆకస్మికంగా క్రాకోవ్ పట్టణాన్ని చెక్కు చెదరకకుండా పట్టుకున్నది. అలాగే ఝుకోవ్

“ మొదటి పోలిష్ సేనకు ఇచ్చిన బాధ్యతను గమనిస్తే సోవియట్ నాయకత్వానికి ఎంత రాజకీయ చాతుర్యం వున్నదీ బోధపడుతుంది. వార్సాను పటుకున్న గౌరవం పోలిష్‌వారికే దక్కింది. వారొక్కరే చాలరు గనుక నగరానికి 25 మైళ్ల దూరంలో ఝుకోవ్ సేనలు జర్మన్ సప్లయిలను తెగ్గొట్టి చుట్టుముట్టాయి. ”

తప్పుడు దారిని వచ్చి ఒక దెబ్బతో లాడ్‌జి పట్టణాన్ని పట్టుకున్నాడు. నేను వెళ్లిన హోటల్లో ఇంకా జర్మన్ ఆఫీసరు సూట్‌కేస్ అలాగే వున్నది.

రష్యన్లదే విడుదల చేయబడిన అమెరికన్ ఖైదీలు లాడ్‌జిలో కనబడి వాళ్ల అనుభవాలు చెప్పారు. మామూలుగా యుద్ధంలో అనుసరించే పద్ధతులేగాక చొరవతో రష్యన్లు అనేక ఉపాయాల్ని ప్రయోగించడం వారికి విచిత్రంగా తోచింది. గాసోలైన్‌ను ట్యాంకుల్లోనేగాక మామూలు కారుల్లో సహితం తీసుకువెళ్లగలిగిన సదుపాయాల్ని అడుగుభాగంలో చేశారు. సాయుధ సేనలకు అవసరం అయిన సామాగ్రిని రైళ్లలో తీసుకువెళ్లవలసి వచ్చింది. గనుక కాల్బలం గుర్రాల్ని ఉపయోగించింది. అనేకమంది మామూలు రైతుల బండ్లమీద పడుకొని రేయింబవళ్లూ ప్రయాణం సాగించారు. గుర్రాలు అలసిపోయినప్పుడు రైతుల దొడ్లలో తొలివాళ్ల గుర్రాలను తీసుకుపోయేవారు. దీని ఫలితంగా పోలెండు పశ్చిమభాగాన గుర్రాలన్నీ పోగయ్యాయి. తొలకరిలో వాటిన్నంటినీ మళ్లీ మధ్య పోలెండుకు చేర్చడం కొత్త పోలిష్ పభుత్వానికి ప్రథమ కర్తవ్యం అయింది. “యుద్ధాన్ని గురించి మేము చాలా నేర్చుకున్నాం” అన్నారు అమెరికన్లు.

మొదటి పోలిష్ సేనకు ఇచ్చిన బాధ్యతను గమనిస్తే సోవియట్ నాయకత్వానికి ఎంత రాజకీయ చాతుర్యం వున్నదీ బోధపడుతుంది. వార్సాను పటుకున్న గౌరవం పోలిష్‌వారికే దక్కింది. వారొక్కరే చాలరు గనుక నగరానికి 25 మైళ్లదూరంలో ఝుకోవ్ సేనలు జర్మన్ సప్లయిలను తెగ్గొట్టి చుట్టుముట్టాయి. పోలిష్ సేన నగరంపై దాడిచేసింది. ముందు పోమిరేనియా వెళ్లి కోల్‌బర్గ్ నౌకాశ్రయాన్ని పట్టుకున్నది పోలిష్ సేనే. పోలిష్ సైనికులు, రష్యన్ సైనికులు కలిసి డాంజిగ్ పట్టణాన్ని పట్టుకున్నా సూటిగా నగరాన్ని స్వాధీనం చేసుకొని పతాకావిష్కరణ చేసినవారు పోలిష్ సైనికులే. పోలిష్ వారు, జర్మన్లు వెయ్యి సంవత్సరాలనుండి ఆ సముద్ర తీరం కోసం కుస్తీబడుతున్నారు. కనుక పోలిష్ సైన్యమే ఆ విజయాలు సాధించడంలో చారిత్రక ప్రాముఖ్యం వున్నది. ఇంతలో విముక్తి. పోలెండులో రెండవపోలిష్ సేనను తయారుచేశారు. వారిని అన్ని నగరాల్లోనూ గస్తీదళాలుగా ఉపయోగించారు. విముక్తి అయిన వెంటనే ఎక్కడికక్కడ పెద్ద పట్టణాలన్నీ పోలిష్‌వారి చేతుల్లోనే పెట్టి వేయబడ్డాయి. రెండు నెలల అనంతరం యీ రెండవసేన నిసీని పట్టుకునేందుకు తోడ్పడ్డది. తర్వాత బెర్లిన్‌పై దాడిచేసిన ఝుకోవ్ సేనల్లో మొదటి శ్రేణిని నిలిచింది ఈ రెండవ పోలిష్ సేన. అది వారి హక్కు. వారి మాతృభూమిపై దురాక్రమణ చేస్తేనే హిట్లర్‌తో యుద్ధం ప్రారంభమైంది.

పెద్దఎత్తున పురోగమించి పశ్చిమ పోలెండును విముక్తి చేయడంతో విధ్వంస కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగించేందుకు జర్మన్లకు అంత వ్యవధి చిక్కలేదు. వార్సాలో మాత్రం ఇందుకు భిన్నంగా జరిగింది. రష్యన్‌లతో సమన్వయం చేసుకోకుండా అకాలంగా బార్‌సేనాని ఆ పట్టణంలో క్రిందటి వేసవిలో తిరుగుబాటు చేశాడు. దానితో పట్టణం ధ్వంసం చేయబడ్డది. వార్సా విముక్తి పొందిన తర్వాత పలు ముఖాలనుంచి ఆ పురజనులు ఇళ్లు చేరుకున్నారు. కొంపలన్నీ పాడుబడి ఉన్నాయి. లింగు లింగుమంటూ పురమందిరం, నాటక కళాశాల మాత్రం కనిపిస్తున్నాయి. చర్చిభవనాలు, రాజభవనాలు, ఛోపిన్, కోపెర్నికస్ స్మారక భవనాలు అన్నీ మట్టిపాలయ్యాయి. నీరులేదు, విద్యుచ్ఛక్తి లేదు, గాస్‌లేదు. వీధులన్నింటా శవాలు గుట్టలు పడున్నాయి. నగరం విముక్తి చెందిన రెండు రోజులకి జనవరి 19వ తేదీన అధ్యక్షుడు బీరుట్ ఆ నగర శిథిలాలమధ్యనే నిలిచి సైనిక వందనాన్ని స్వీకరించాడు. ముఖ్య పట్టణంగా వార్సా పట్టణాన్ని పునర్మిర్మించుకొని తీరుతాం అని ప్రకటించి అందుకు పోలెండు నలువైపులనుండీ సహాయం అందాలని విజ్ఞప్తి చేశాడు. అప్పటికే ఆ పడిపోయిన గూళ్లలోనే నివసించేందుకు వేలకొలదీ పోగయిన వారు వేదికచుట్టూ నిలిచి ఆ ప్రకటనను హర్షించారు. ఆ చలికాలపు శిథిలాలలోనే బీరుట్‌కు బహూకరించేందుకు ఒక చిన్నపిల్లకు ఎక్కడో పూలగుత్తి ఒకటి దొరికింది.

నేను గమనిస్తున్న ఈ పోలెండు విముక్తి పురోగమనం ఓడర్‌నది ఒడ్డుకు వచ్చినిలిచింది. అక్కడ స్థావరాలేర్పరచుకొని బెర్లిన్‌పై దాడికి ఎర్రసేన సన్నద్ధమైంది. ఏప్రిల్ 18న అది ప్రారంభమైంది.

అక్కడున్న వారెవ్వరూ ఓడర్ నదీతీరపు ఆనాటి తెల్లవారుఝాము దృశ్యాన్ని ఏనాటికీ మరువజాలరు. వేలకొలది శతఘ్నులు సింహనాదం చేస్తుండగా సోవియట్ భూమి అంతా కదిలి అనేక దారుల్లో శత్రుపీఠం మీదికి దాడి వెడలింది అని ‘ఇజ్వెస్తియా’ పత్రికలో సోవియట్ కెమెరా విలేఖరి కార్మెన్ వ్రాశాడు. ఊగుతున్న చెట్లతోనూ, వికసిస్తున్న పూలమొక్కలతోనూ రోడ్లన్నీ నిండిపోయాయి. (కేమఫ్లెజ్) పోలిష్ సైనికులు నదీజలంతో ప్రతిజ్ఞ చేస్తూ ఓడర్ నదిని దాటారు. ఆరురోజుల అనంతరం ఫ్రీడ్‌రిక్‌స్ట్రేస్సీని లక్ష్యంగా పెట్టుకున్నది ఎర్రసేన. కార్మెన్ టైం గుర్తుపెట్టుకున్నాడు. అది 1945 ఏప్రిల్ 22వ తేది ఎనిమిదిన్నర గంటలు.

బానిసలుగా జర్మన్ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న వారెందరెందరు – రష్యన్లు, పోలిష్‌వారు, యుగోస్లేవియావారు– ప్రవాహంగా వచ్చిపడ్డారో సోవియట్ రచయితలు వెల్లడించారు. అనేక సందర్భాల్లో విముక్తి చెందుతున్న తమ ప్రజలకు అపాయం వాటిల్లుతుందేమోనని నెమ్మదిగా పురోగమించవలసి వచ్చింది. ఉదాహరణగా ఒక సంఘటన చెబుతాను. పేరాచూట్ సిల్కు తయారుచేసే ఒక ఫ్యాక్టరీ కప్పుమీద నుంచి జర్మన్లు కాల్పులు సాగిస్తున్నారు. హఠాత్తుగా రష్యన్ స్త్రీలు గుంపుగా ఫ్యాక్టరీ నుంచి బయటకు ఉరికి తమ సైనికుల్ని కౌగలించుకున్నారు.


“నా చిన్ని తల్లిదండ్రులారా, ఒరెల్‌కు దారేది?” అని ఒక వృద్ధమాత అడిగింది.

“మేము పంపుతాం, మా అమ్మా” అని నవ్వారు సైనికులు. తర్వాత ఒక ట్రక్కు ఎక్కించి ఆమెను వెనక్కు పంపారు.

(అనువాదం: మోటూరు హనుమంతరావు)

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-02-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# ఆధునిక చరిత్రలోనే మతోన్మాద మూలాలు



బిపన్‌చంద్ర

మతతత్వం, మతతత్వ రాజకీయాలు ప్రాతిపదికగా గల సిద్ధాంతం, మతపరమైన హింస మతతత్వ సిద్ధాంతం ఫలితంగా చెలరేగుతుంది. హిందూ, ముస్లిం, సిక్కు, మతతత్వాలు ఒకటి మరొకదానికి భిన్నంగా వుండవు. అన్నీ ఒకే తరహాకి చెందినవి. ఒకే మతతత్వ సిద్ధాంతానికి భిన్నముఖాలు.

ఫాసిస్టు చట్రంలో పనిచేసేదే తీవ్రమైన మతతత్వవాదం. ఇది మతతత్వం యొక్క మూడవ దశగా ఉంటుంది. ఇది భయం, ద్వేషంపై ఆధారపడుతుంది. హింసాయుతమైన భాష, ప్రవర్తన, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూసే వైఖరి కలిగి వుంటుంది. ఈ దశలో మతతత్వవాదులు ముస్లిములు, ముస్లిం సంస్కృతి, ఇస్లాం: హిందువులు, హిందూ సంస్కృతి, హిందూత్వం ప్రమాదంలో పడ్డాయి, . అణచివేయబడుతున్నాయి, నిర్మూలింపబడుతున్నాయి. – లాంటి ప్రకటనలు చేస్తుంటారు. ఈ దశలో హిందువులు, ముస్లిములు వేర్వేరు జాతులకు చెందినవారని, వారి మధ్యగల వైరుధ్యం శాశ్వతమైనది, పరిష్కరించేందుకు సాధ్యపడనిది – అనే సిద్ధాంతాన్ని హిందూ ముస్లిం – రెండు మతాలకు చెందిన మతతత్వవాదులు ముందుకు తెస్తారు. 1937 తరువాత ముస్లిం లీగు, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాలు ఫాసిస్టు మతతత్వవాద దారిపట్టాయి.

మనం చాలా సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మతతత్వవాది తన సమూహం యొక్క ప్రయోజనాలను గురించి మాట్లాడతాడు: విశ్వసిస్తాడు. కాని వాస్తవ జీవితంలో మతానికి లోపల అలాంటి ప్రయోజనాలు లేవు. హిందువుల, ముస్లిముల, ఇంకా ఇతర మతాల వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఒకేరకంగా వుంటాయి. ఆ అర్థంలో వారు వేర్వేరు సమూహాలు కూడా కాదు. హిందువులుగా లేక ముస్లిములుగా వారికి అఖిల భారతస్థాయిలోగాని లేక ప్రాంతీయస్థాయిలోగాని వేర్వేరు రాజకీయ, ఆర్థిక జీవితాలు గాని, ప్రయోజనాలు గాని వుండవు. తోటి హిందువుల నుండి లేక తోటి ముస్లిముల నుండి ప్రజలు, ప్రాంతం, భాష, సంస్కృతి, వర్గం, కుల, సామాజికస్థాయి, సామాజిక ఆచారాలు, ఆహారం, వస్త్రధారణ, అలవాట్లతో విభజింపబడ్డారు. ఈ అంశాల వారీగా ఇతర మతాలవారీతో మమేకమయ్యారు. పై వర్గానికి చెందిన ముస్లింకి పేదవర్గానికి చెందిన ముస్లింకంటె, పై వర్గానికి చెందిన హిందువు సన్నిహితంగా వుంటాడు. వారి మధ్య సామాన్య ప్రయోజనాలు ఏకీభవిస్తాయి. సాంస్కృతికంగా కూడా సన్నిహితంగా వుంటారు. బెంగాలీ ముస్లిం, బెంగాలీ హిందువు, పంజాబీ ముస్లింకి ఇదే వర్తిస్తుంది. ఈ విధంగా భాషా సాంస్కృతిక ప్రాంతాలుగా, సామాజిక వర్గాలుగా చేయబడిన నిజమైన విభజనను, వారిలో పెరుగుతున్న జాతీయైక్యతను అవాస్తవమైన మతవిభజన మరుగుపరుస్తుంది.

మతతత్వవాది తాను సమూహం యొక్క ప్రయోజనాలను పరిరక్షిస్తున్నానంటాడు. కాని అలాంటి ప్రయోజనాలే లేనప్పుడు అతడు తన సమూహం యొక్క ప్రయోజనాల కొరకుగాని, ఇతర సమూహాల ప్రయోజనాల కొరకు గాని పనిచేయడమనేది లేదు. అతడు తన సమూహానికి ప్రతినిధి కాలేడు. తన సమూహం ప్రయోజనాల కొరకు పనిచేస్తున్నాడనే పేరుతో అతడు తెలిసో, తెలియకో మరెవరి ప్రయోజనాల కొరకో సేవలు చేస్తున్నాడు. కాబట్టి అతడు ఇతరులను మోసం చేస్తున్నాడు. తెలియకుండానే తనను తాను మోసం చేసుకొంటున్నాడు. మతపరమైన ఊహలు, మతపరమైన తర్కం, మతపరమైన జవాబులు అవాస్తవాలు. మతతత్వవాది వేటినైతే సమస్యలుగా చెపుతున్నాడో అవి నిజమైన సమస్యలు కావు: ఏవి జవాబులంటున్నారో అవి జవాబులు కావు.

మతతత్వం గతం నుండి కాలానికి తట్టుకొని నిలబడినట్లుగా, మధ్యయుగాలు ఆధునిక యుగానికి అందజేసినట్లుగా లేక కనీసం దాని మూలాలు మధ్యయుగాలలో వున్నట్లుగా చెప్పబడుతున్నది. కాని మతతత్వం ప్రాచీన మధ్యయుగాల నాటి సిద్ధాంతాలను ఉపయోగించుకొంటున్నప్పటికీ అది సామాజిక ప్రేరణలను వ్యక్తంచేస్తూ ఆధునిక, సామాజిక గ్రూపుల, వర్గాల, శక్తుల, రాజకీయ అవసరాలకు సేవలు చేస్తున్న ఇటీవలి రాజకీయ వైఖరి. దాని సామాజిక మూలాలు, అలాగే దాని సామాజిక, రాజకీయ, ఆర్థిక లక్ష్యాలు భారతదేశ ఆధునిక చరిత్రలోనే ఉన్నాయి. దానిని వునికిలోనికి తెచ్చిందీ, నిలదొక్కుకొనేలా చేసిందీ సమకాలీన సామాజిక, ఆర్థిక నిర్మాణమే.

**(బిపన్‌చంద్ర రాసిన 'భారతస్వతంత్ర పోరాటం' గ్రంథంనుండి ఈ భాగం తీసుకోబడింది. )**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.10. Published on February 1, 2018